ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 220 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | మంగళవారం 9 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: ₹3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939
శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥
దక్షిణాయణం, హేమంత ఋతువు,
పుష్యమాసం, కృష్ణపక్షం; తిథి: శుద్ధ అష్టమి
రా.8.34; నక్షత్రం: చిత్త పూర్తి;
వర్జ్యం: మ.2.42 నుండి 4.20 వరకు;
దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు,
తిరిగి రా.10.48 నుండి 11.36 వరకు;
రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు

ఇక మహా సంగమమే

పెన్నా, కృష్ణా, గోదావరి, వంశధార అనుసంధానిస్తా

- ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం..
- కరవురహిత ఏపీని సాధించి చూపిస్తా
- పోలవరం ప్రాజెక్టు పూర్తిపై స్పష్టత వచ్చింది
- మే నాటికి మహాయజ్ఞానికి ఒక రూపం
- పనులు పరిశీలించిన సీఎం చంద్రబాబు
- విపక్షాలవి చెత్త విన్యాసాలంటూ వ్యాఖ్య
- ప్రజలే బుద్ధి చెప్పాలంటూ పిలుపు


పోలవరం ప్రాజెక్టు నమూనా గేటు ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

ఏలూరు, జనవరి 8: ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా నదుల పవిత్ర సంగమం సాధించి రాష్ట్రంలో వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లామని, ఇక కరవురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి మహా సంగమం వైపు అడుగులు వేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెన్నానుంచి కృష్ణా, అక్కడి నుంచి గోదావరి, అక్కడి నుంచి వంశధార నదుల అనుసంధానానికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామన్నారు. రాష్ట్రంలో నీటి భద్రత లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, సాగునీరు వుంటే మన రైతాంగం బంగారం పండిస్తారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా పనుల తీరును పరిశీలించారు. స్పిల్‌వే, కాఫర్‌డ్యామ్, గేట్ల తయారీని పరిశీలించారు. దీనితో ఆయన 22సార్లు ప్రత్యక్షంగాను, 47 సార్లు వర్చువల్ ఇన్‌స్పెక్షన్ ద్వారాను పోలవరం పనులను పరిశీలించినట్లైంది. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తొమ్మిది జిల్లాలు ఒకే లెవెల్‌లో వుండటం ఎంతో కలిసి వచ్చే అంశమని, దీన్ని ఉపయోగించుకుని అన్ని జిల్లాలను కరువు రహితంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తున్నామన్నారు. రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టుపై ఇప్పుడు అన్ని విధాలా స్పష్టత వచ్చిందన్నారు. ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణానికి కూడా గ్రీన్ సిగ్నల్ లభించడంతో ఇక నుంచి


ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులకు సంబంధించి జెట్ గ్రౌటింగ్ యంత్రం స్విచాన్ చేస్తున్న ముఖ్యమంత్రి

ప్రాజెక్టు పనులను పరుగులు తీయిస్తామన్నారు. ఇప్పటికే మట్టి పనులు 73 శాతం వరకు పూర్తయ్యాయని, కీలకమైన కాంక్రీట్ పనులు కూడా అనుకున్న వేగంతోనే ముందుకు సాగుతున్నాయన్నారు. దిగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం 84 శాతం పూర్తయ్యిందని, ప్రస్తుతం ఎగువ కాఫర్ డ్యామ్‌కు గ్రీన్ సిగ్నల్ లభించినందున ఆ పనులు కూడా ప్రారంభించామన్నారు. ఇక డయాఫ్రమ్ వాల్ పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అలాగే 48 గేట్ల పనులు 50 శాతానికి పైగా పూర్తయ్యాయన్నారు. వాస్తవానికి జనవరిలో మొదటి గేటు ఏర్పాటుచేయాలని భావించామన్నారు. కాగా త్రీడీ మోడల్ విషయంలోనూ స్పష్టత వచ్చిందన్నారు. వచ్చే మే నాటికి దాదాపుగా ప్రాజెక్టుకు ఒక రూపం వచ్చే దిశగా పనులను తీసుకువెళుతున్నట్లు చెప్పారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ కూడా ప్రాజెక్టు విషయంలో పట్టుదలతో ఉన్నారని, అనుకున్న సమయానికి పూర్తిచేయడానికి అన్నివిధాలా సహకరిస్తామని చెప్పారన్నారు. ప్రస్తుతంవున్న పరిస్థితుల నేపథ్యంలో గ్రావిటీ ద్వారా అనుకున్న సమయానికి జలాలను విడుదల చేసే దిశగా అడుగులు వేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఈ అంశాల్లో తుది ఆమోదం మంజూరు చేసిన వెంటనే మరింత వేగంగా - మిగతా 7వ పేజీలో


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

అలా.. సెట్ చేశాం


- ఏప్రిల్ 22 నుంచి ఎంసెట్
- 26న ఎంసెట్ (బైపీసీ) ఎంట్రన్స్
- వారం రోజుల్లో ఫలితాలు వెల్లడి
- ఏప్రిల్ 19న ఎడ్‌సెట్, లాసెట్
- మే 2న ఐసెట్, 3న ఈసెట్
- 4నుంచి పీఈసెట్, 10-12 మధ్య పీజీసెట్
- పరీక్షల తేదీలు ప్రకటించిన మంత్రి గంటా

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: ఎంసెట్ (ఇంజనీరింగ్)ను ఏప్రిల్ 22 నుంచి, ఎంసెట్ (బైపీసీ)ను ఏప్రిల్ 26న నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ ప్రవేశ పరీక్షల నిర్వహణ తేదీలను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. తాడేపల్లిలోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ అన్ని ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. ఎంసెట్ (ఇంజనీరింగ్)ను 22నుంచి రోజుకు రెండు సెషన్స్‌లో మూడు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ఎంసెట్ (బైపీసీ)ను ఒకే రోజు రెండు సెషన్లలో నిర్వహిస్తామని వెల్లడించారు. ఒక్కో పరీక్షా కేంద్రంలో ఒక్కో సెషన్‌లో 115 నుంచి 150 మంది పరీక్ష రాసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎంసెట్‌ను జెఎన్‌టియు (కాకినాడ) నిర్వహిస్తుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం - మిగతా 7వ పేజీలో

పునర్విచారణ అనవసరం

- మహాత్ముడి హత్యపై కేంద్రం స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జనవరి 8: మహాత్మాగాంధీ హత్య విషయంలో కుట్ర కోణానికి సంబంధించి గత కొంతకాలంగా కొనసాగుతున్న వివాదానికి కేంద్ర ప్రభుత్వం తెరదించింది. మహాత్ముడి హత్య వెనుక కుట్ర, ఆయనను హత్యచేసిన వ్యక్తి నాథూరాం వినాయక్ గాడ్సేలను గుర్తించడం జరిగిందని, దీని దృష్ట్యా ఈ కేసును పునర్విచారించాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని మంగళవారం సుప్రీం కోర్టుకు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కోర్టు సహాయకుడిగా నియమితుడైన సీనియర్ అడ్వకేట్ అమరేంద్ర షెరాన్ అత్యున్నత న్యాయస్థానంలో ఓ నివేదిక సమర్పించారు. మహాత్ముడి హత్యవెనుక ఫోర్స్ 136 అనే బ్రిటీష్ ప్రత్యేక నిఘా దళ పాత్ర ఉందన్న వాదనలు, ఆరోపణలకు ఎలాంటి నిర్ధారణ లేదని స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి రికార్డుల్లో అన్ని వివరాలూ స్పష్టంగా ఉన్నాయని, నాథూరాం గాడ్సే నేరం రుజువైందని, వారికి తగిన శిక్ష కూడా విధించడం జరిగిందని నివేదికలో సీనియర్ అడ్వకేట్ పొందుపర్చారు. 1948 జనవరి 30న హిందూ జాతీయవాది నాథూరాం గాడ్సే న్యూఢిల్లీలో అతి సమీపం నుంచి మహాత్మాగాంధీని కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఆ కేసుకు సంబంధించి జరిగిన విచారణ అనంతరం గాడ్సే, నారాయణ్ ఆప్టేలను దోషులుగా నిర్ధారించి 1949 నవంబర్ 15న ఉరి తీశారు. మహాత్మాగాంధీ హత్య చరిత్రలో అత్యంత పెద్ద కుట్రకు సంబంధించిందని, ఆ కుట్రను మభ్యపెట్టే ప్రయత్నాలు జరిగాయని పేర్కొంటూ, హత్య కేసును పునర్విచారించడం ద్వారా తెరమరుగైన వాస్తవాలను వెలుగులోకి తేవాలని ముంబయికి చెందిన పరిశోధకుడు డాక్టర్ పంకజ్ ఫడ్నిస్ ప్రజాహిత పిటిషన్‌ను దాఖలు చేశారు. దానికి సమాధానంగా కేంద్ర ప్రభుత్వం తాజా నివేదికను సుప్రీం కోర్టుకు సమర్పించింది. మహాత్మాగాంధీ శరీరంలోకి దూసుకెళ్లిన బుల్లెట్లు, ఆ బుల్లెట్లను పేల్చడానికి ఉపయోగించిన పిస్తోలు, ఆ పిస్తోలును పేల్చిన హంతకుడు, అలాగే హత్యకు దారితీసిన కుట్ర, అందుకు దారితీసిన సైద్ధాంతిక విభేదాలన్నీ నిర్ధారితమయ్యాయని ప్రభుత్వం తన నివేదికలో సవివరంగా తెలిపింది. ఈ కేసును పునర్విచారించడానికి అవసరమైన బలమైన కారణంగాని, సందేహంగాని, అనుమానంగాని వెలుగుచూడలేదని, దీని దృష్ట్యా మళ్లీ నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరమూ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా ఈ అంశానికి సంబంధించి న్యాయమూర్తి ఎస్‌ఏ బాబ్డే సారథ్యంలోని సుప్రీం బెంచ్ ఈనెల 12న విచారణ జరుపుతుంది.


చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న చిన్మయ పాండ్యా

అశ్వమేధ అభివృద్ధి

యజ్ఞ ఫలాలతో మరింత ముందుకు: సీఎం చంద్రబాబు

మంగళగిరి, జనవరి 8: అమరావతి రాజధానిగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం ఎంతగానో దోహద పడుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. అఖిల విశ్వ గాయత్రి పరివార్, శాంతికుంజ్ హరిద్వార్ ఆధ్వర్యంలో గుంటూరుజిల్లా మంగళగిరి మండలం చినకాకానిలో ఈనెల 5నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞం ముగింపు కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచంలోని ఐదు అద్భుత నగరాల్లో అమరావతి ఒకటిగా ఉండాలనే సంకల్పం చేశానని, అలాంటి సంకల్పానికి ఈ యజ్ఞం దోహద పడుతుందని, నిర్వాహకుల ఆశీస్సులు ఫలిస్తాయన్నారు. యజ్ఞంలో పాల్గొనటం తన అదృష్టం, పూర్వజన్మ సుకృతమన్నారు. యజ్ఞ ఫలం పేదరిక నిర్మూలనకు ఉపయోగ పడుతుందని, మనది గొప్పదేశమని, తిండికి, బట్టకు కరువుండకూడదని, పేదలు ఆనందంగా ఉండే విధంగా ఫలితాలు రావాలని, ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉండాలని, ఆరోగ్యం, ఆనందంగా ఉండే విధంగా యజ్ఞ ఫలాలు ఉంటాయని ఆకాంక్షించారు. అమరావతిలో జరిగిన యజ్ఞం రాష్ట్రానికి అవసరమని, దీని వలన రాష్ట్రానికి ఒక శక్తి వస్తుందని, అశ్వం అంటే శౌర్యానికి, శక్తికి చిహ్నామని, మేధ అంటే మేధస్సు, జ్ఞానం అని ఈ రెండూ కలిపి జ్ఞానంతో కూడిన శక్తికి తార్కాణం - మిగతా 7లో

బాబు వస్తే.. చక్కెర చేదు!

సహకార ఫ్యాక్టరీల మూత ఆయన నిర్వాకమే • జన్మభూమిలో మాఫియా గ్యాంగులకు చోటు
లంచమిస్తేనే రేషన్, పింఛన్ల మంజూరు • పూతలపట్టు సభలో వైకాపా నేత జగన్ విసుర్లు


పూతలపట్టులో జరిగిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైకాపా నేత జగన్‌మోహన్‌రెడ్డి

చిత్తూరు/ పూతలపట్టు, జనవరి 8: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు పాలన అవినీతిమయమైందని ప్రతిపక్ష నేత, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం పూతలపట్టులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు గత నాలుగేళ్ల పాలనను తూర్పారబడుతూ, ఎన్నికల హామీల అమలు విషయంలో బాబు వైఫల్యాలను ఎండగట్టారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన ప్రతిసారీ జిల్లాలోని సహకార చక్కెర, సహకార పాల డెయిరీలు మూతపడుతున్నాయని ఆరోపించారు.

తన హెరిటేజ్ డెయిరీ అభివృద్ధి కోసమే గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో తన అనుయాయుల చేత పథకం ప్రకారం డెయిరీని, అదేవిధంగా జిల్లాలోని నాలుగు ప్రైవేటు చక్కెర కర్మాగారాల యాజమాన్యాలతో లాలూచీ పడి చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర కర్మాగారాలను మూయించి నిర్వీర్యం చేసే పనిలో ఉన్నారని మండిపడ్డారు. జిల్లాలో పాడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, వారిని ఆదుకునేందుకు బాబు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక పాడి రైతులకు తప్పకుండా న్యాయం జరగుతుందని భరోసా ఇచ్చారు. రైతు, డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో గద్దెనెక్కిన బాబు సంబంధిత వర్గాల వారికి పైసా కూడా మాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని వాపోయారు. దివంగత సీఎం వైఎస్సార్ పాలనలో హంద్రీ- నీవా ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని, అయితే మిగిలిన 20 శాతాన్ని పూర్తి చేయలేని స్థితిలో నేడు రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. తన నాలుగేళ్ల పాలనలో ఓ కాలువను తీసుకువచ్చి హంద్రీ -నీవా ప్రాజెక్టుకు అనుసంధానం చేసేందుకు కూడా బాబు సర్కార్ ప్రయత్నించకపోవడం జిల్లా రైతులకు - మిగతా 7వ పేజీలో

ఘనగామా



చూడు తమ్ముడు... మనకిక్కడ దాణ, బొగ్గుకు అవకాశం లేదుమరి!!

రానున్నది ఎన్నికల బడ్జెట్!



ఎనిమిది రాష్ట్రాల్లో విజయమే లక్ష్యం

- రైతు, కార్మిక సంక్షేమం బాట పట్టనున్న జైట్లీ • గుజరాత్ గుణపాఠంగా మోదీ, షా కసరత్తు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ ఏడాది జరుగనున్న ఎనిమిది రాష్ట్రాల శాసనసభల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2018 వార్షిక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. వ్యవసాయం, రైతు కార్మికుల సంక్షేమం, నీటి పారుదల ప్రాజెక్టులు తదితర వ్యవసాయ సంబంధ, కార్మిక సంబంధ అంశాలకు ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి ఒకటో తేదీనాడు లోక్‌సభలో ప్రతిపాదించే వార్షిక బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నట్లు తెలిసింది. ఈ ఏడాదిలోనే మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, కర్నాటక రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరుగవలసి ఉన్నది. ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలో రావచ్చు. బీజేపీ అధికారంలో ఉన్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌తోపాటు మిజోరం శాసనసభకు కూడా ఎన్నికలు జరుగనున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటకలో పార్టీని అధికారంలోకి తీసుకురావటం, తాము అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో నాలుగోసారి అధికారంలోకి రావటం ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ముందున్న తక్షణ కర్తవ్యం. అందుకే ఇరువురు నాయకులు ఆయా రాష్ట్రాల్లో బీజేపీ విజయావకాశాలపై ఎప్పటికప్పుడు సమాలోచనలు జరుపుతున్నారు. అమిత్ షా ఇప్పటికే కర్నాటకలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. రాష్ట్రాల నుండి పార్టీ శాఖలు అందజేస్తున్న నివేదికలు, సమీక్షల ఆధారంగా ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేసుకోవటంతోపాటు పార్టీ విజయానికి తోడ్పడే అంశాలను బడ్జెట్‌లో పొందుపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అరుణ్ జైట్లీ ఈ అంశంపై నరేంద్ర మోదీ, అమిత్ షాతో ఇప్పటికే పలు దఫాలు చర్చలు జరిపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అతితక్కువ మెజారిటీతో విజయం సాధించటం పార్టీ అధినాయకత్వం కళ్లు తెరిపించిందని అంటున్నారు. పాతనోట్ల రద్దు, జీఎస్‌టీటి అమలు వంటి అంశాలు ఆ ఎన్నికల్లో పెద్దఎత్తున ప్రభావం చూపాయని బీజేపీ నాయకులు అంచనా వేశారు. వాస్తవానికి ఈ రెండు ముఖ్యమైన అంశాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు బీజేపీకి మెజారిటీ రాకుండా చేశాయి. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరించటంవల్లే గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో పార్టీ చావుతప్పి కన్ను లొట్టపోయిందని బీజేపీ అధినాయకత్వం భావిస్తోంది. ఈ సంవత్సరం మార్చి, ఎప్రిల్‌లలో మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, కర్నాటక శాసనసభల ఎన్నికలు జరిగితే సంవత్సరాంతంలో మిజోరం, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ శాసనసభల ఎన్నికలు జరుగనున్నాయి. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో బీజేపీ మూడు టర్ములనుండి అధికారం చెలాయిస్తోంది. రాజస్థాన్‌లో గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. గుజరాత్‌లో నెలకొన్న పరిస్థితుల లాంటివే మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో నెలకొంటే తమ పరిస్థితి అంతే సంగతులని బీజేపీ అధినాయకత్వం భయపడుతోంది. గుజరాత్ తమ స్వంత రాష్ట్రం, అందులో ఓడిపోతే ప్రతిష్ఠ బాగా దెబ్బతింటుందని భయపడిన నరేంద్ర మోదీ, అమిత్ షా కాలికి బలపం కట్టుకుని ఎన్నికల ప్రచారం చేశారు. గుజరాత్‌లో చేసిన స్థాయిలో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో - మిగతా 7వ పేజీలో

సమాజంలో సఖ్యత కూడా ముఖ్యమే!

- మూడు రోజుల్లో మూడవ విడత రుణమాఫీ పూర్తి
- జన్మభూమిలో ప్రతిభ చూపినవారికి సత్కారాలు
- టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: సంపద ఎంత ముఖ్యమో సమాజంలో సఖ్యత, ఐక్యత కూడా అంతే ముఖ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. సోమవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి జన్మభూమి-మాఊరు, నీరు-ప్రగతి కార్యక్రమాలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సఖ్యతతో, సమష్టిగా కృషిచేస్తే సాధించలేనిది లేదన్నారు. ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యత గురించి చైతన్యపరచాలని, కలిసి ఉంటే కలిగే లబ్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. జన్మభూమిని సమాజంలో సమూల మార్పులు తెచ్చే పవిత్ర యజ్ఞంగా అభివర్ణించారు. మిగిలిన మూడు రోజులూ ఇదే స్ఫూర్తితో జన్మభూమి విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయంపై మక్కువ పెంచేందుకే ఏరువాక వేడుకలు నిర్వహిస్తున్నామని, జలవనరుల ప్రాధాన్యత పెంచేందుకే జలసిరికి హారతి చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు. ప్రకృతితో మమేకం అయ్యేందుకే వనం-మనం, సూర్య ఆరాధన కార్యక్రమాలను చేపట్టామన్నారు. మన రాష్ట్రానికి ఉన్న సన్‌రైజ్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరును సార్థకం చేసేందుకే సౌరవిద్యుత్ ఉత్పాదనను పెద్దఎత్తున చేస్తున్నామన్నారు. 3వ విడత రుణమాఫీ ఈ మూడు రోజుల్లో రైతులకు పూర్తిగా అందించాలని ఆదేశించారు. ఇప్పటివరకు పంపిణీ చేయగా మిగిలిన రూ.400 కోట్లు వెంటనే పంపిణీ చేయాలన్నారు. రైతు సాధికార సంస్థకు వచ్చిన అన్ని ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ రబీ సీజన్‌లో పంట రుణాల పంపిణీ 50 శాతం మాత్రమే జరిగిందంటూ, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరంలో పంట రుణాల పంపిణీ మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతపురంలో కౌలు రైతులకు మరిన్ని రుణాలు ఇవ్వాలని కోరారు. 'ఉన్న జలవనరులను సద్వినియోగం చేసుకోవాలి, తక్కువ నీటితో ఎక్కువ వ్యవసాయం జరగాలి, అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక ఉత్పాదకత సాధించాలని' ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. సిద్దాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభించడం ఒక చరిత్ర అంటూ బ్రిటీష్ కాలంలో 1922లో 1000 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించగా, ప్రస్తుతం దీని ద్వారా 25వేల ఎకరాలకు నీరు ఇస్తున్నామన్నారు. పాడి పరిశ్రమ ద్వారా రాబడి ప్రస్తుతం ఉన్న రూ.60వేల కోట్ల నుంచి 2022 నాటికి రూ.లక్ష కోట్లకు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా తలసరి పాల లభ్యత 168 గ్రాములు ఉంటే, మన దేశంలో 352 గ్రాములు ఉందని, అదే మన రాష్ట్రంలో 522 గ్రాములు ఉందని తెలిపారు. జీఎస్‌డీపీలో పాడి పరిశ్రమ వాటా 12 శాతం నుంచి 20 శాతంకు పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. డిమాండ్ ఆధారంగా పంటలను సాగు చేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయి ఉత్పాదకత సాధించాలన్నారు. పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెరగాలి, ఉద్యాన రంగం ద్వారా రాబడి 18 శాతం నుంచి 30 శాతంకు పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఉల్లి, నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయాలని, దళారుల బెడదను అడ్డుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధరల పెరుగుదలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయంత్రంలోపు సమీక్షించి తనకు వివరాలు తెలపాలని కోరారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని రైతుబజార్లలో అన్ని సరుకులు చౌక ధరకు లభించేలా చూడాలని కోరారు. జన్మభూమిలో ఉత్తమ పనితీరు కనబరిచినవారిని ఈనెల 19న రాష్ట్రస్థాయిలో సత్కరించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

11, 12 తేదీల్లో మండల, జిల్లాస్థాయిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 11వ తేదీన జరిగే బ్యాంకు లింకేజి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు సి.కుటుంబరావు, 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం చైర్మన్ సాయిబాబు, వ్యవసాయం అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధి, రియల్ టైం గవర్నెన్స్, ప్రణాళికా శాఖల అధికారులు రాజశేఖర్, హరి జవహర్‌లాల్, రాంశంకర్ నాయక్, సోమశేఖర్, మురళి, రామాంజనేయులు, అహ్మద్‌బాబు, సంజయ్‌గుప్తా, జన్మభూమి నోడల్ అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



బందరు పోర్టు బాధిత రైతులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పోర్టు కడితే మీరే అభివృద్ధి చెందుతారు

- భూ సేకరణ అంశాన్ని పరిశీలిస్తాం
- వారం రోజుల్లో నిర్ణయాన్ని చెబుతా
- సాధ్యమైనంత వరకు సమీకరణలో భూములు ఇవ్వండి
- పోర్టు బాధిత రైతులతో సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

మచిలీపట్నం, జనవరి 8: బందరు ఓడరేవు నిర్మాణానికి నేను సిద్ధంగానే ఉన్నా. మీ ప్రాంత అభివృద్ధికి దోహదపడే పోర్టు కోసం మీరు కూడా ముందుకు రావాలి. రైతులకు శాశ్వత ప్రయోజనం కల్పించేందుకు భూసమీకరణ ద్వారా భూములను తీసుకునేందుకు నోటిఫికేషన్ ఇచ్చాం. కానీ కొంత మంది భూసేకరణ ద్వారా ఇస్తామని చెబుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా భూసేకరణ అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటాను. ప్రస్తుతం జన్మభూమి గ్రామసభలు జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖాధికారులు అందుబాటులో లేని కారణంగా భూసేకరణ అంశంపై స్పష్టమైన హామీ ఇవ్వలేకపోతున్నాను. వారం రోజుల్లో ఆర్థిక శాఖ, పోర్టు శాఖ, పోర్టు నిర్మాణ సంస్థ నవయుగ వారితో భేటీ అయి భూసేకరణకు ఏ మేర సాధ్యాసాధ్యమో తెలియచేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలియజేశారు. బందరు ఓడరేవు భూముల విషయంలో కొనసాగుతున్న ప్రతిష్ఠంభనను తొలగించేందుకు గాను సోమవారం రాత్రి సచివాలయంలో స్థానిక ఎమ్మెల్యే, న్యాయ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంట్ సభ్యుడు కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు నేతృత్వంలో పోర్టు ప్రతిపాదిత గ్రామాలైన కరగ్రహారం, గోపువానిపాలెం, మేకావానిపాలెం, తపసిపూడి, మంగినపూడి, పోతేపల్లి గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితులను మంత్రి రవీంద్ర, ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ అర్జునుడు సీఎంకు వివరించారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మెజార్టీ రైతులు మేమంతా చిన్న, సన్నకారు రైతులమని పూలింగ్ వల్ల తక్షణ ప్రయోజనం పొందలేమని సీఎంకు తెలియజేశారు. భూసేకరణ ద్వారా ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ పూలింగ్ వల్ల తక్షణ ప్రయోజనం లేకపోయినా భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. సాధ్యమైనంత వరకు పూలింగ్ ద్వారా భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తే బాగుంటుందని తెలిపారు. మరి కొంత మంది రైతులు తక్షణ ప్రయోజనం కోసం కొంత భూమిని భూసేకరణ ద్వారా, శాశ్వత ప్రయోజనం కోసం మరికొంత భూమిని పూలింగ్‌లో ఇస్తామని చెప్పారు.



మావోయిస్టుల హెచ్చరికలతో సామగ్రి సర్దుకుని గ్రామం విడిచి వెళ్తున్న గిరిజనులు

గ్రామాలు విడిచి వెళ్ళాలి

- గిరిజనులకు మళ్లీ మావోల హుకుం

సీలేరు, జనవరి 8: పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తూ రోడ్లు, సెల్ టవర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో ఒడిశాలోని కలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు కుటుంబాల గిరిజనులు గ్రామం విడిచి పోవాలని, లేకుంటే మరణదండన తప్పదని మావోల హెచ్చరికలతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలో కూడ్‌బో గ్రామానికి చెందిన వంతల మాడి, బండిమడకామి, జులా మడకామి, జర్తా మాడి, దుబురునాయక్ అనే గిరిజనులు పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తూ, అభివృద్ధి పనులకు అనుకూలంగా ఉన్నారనే నెపంతో వారు కుటుంబంతో సహా గ్రామం విడిచి వెళ్ళాలని మావోయిస్టులు హెచ్చరించారు. లేకుంటే హతమార్చడం తప్పదన్నారు. ఒడిశాలో ఇటీవల పోలీస్ ఇన్‌ఫార్మర్ పేరిట మావోయిస్టులు పలువురిని హతమార్చిన సంఘటనల నేపథ్యంలో తమకూ ఇదే దుస్థితి పడుతుందని ఐదు కుటుంబాల గిరిజనులు వారి కుటుంబ సభ్యులు, సామగ్రి సర్దుకుని గ్రామం విడిచి వేరొక గ్రామానికి తరలివెళ్ళారు.

సిమెంట్ కార్మికులకు 40వేలు కనీస వేతనం ఇవ్వాలి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: సిమెంట్ కార్మికులకు కనీసం 40వేల రూపాయల కనీస వేతనం చెల్లించేలా పాలకులు చర్యలు చేపట్టాలని ఏఐటీయుసి నూతన కార్యాలయంలో సోమవారం జరిగిన ఆల్ ఇండియా సిమెంట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి హెచ్ మహదేవన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పలు సిమెంట్ ఫ్యాక్టరీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులంతా పాల్గొన్నారు. సమావేశంలో ముందు ఆల్ ఇండియా సిమెంట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ గత సిమెంట్ వేతన ఒప్పందం 2014 ఏప్రిల్ నుండి అమల్లోకి వచ్చిందని, అనేక సిమెంట్ కంపెనీల యజమానులు ఆ ఒప్పందాన్ని అమలు చేయకుండా నీరుగార్చారన్నారు. 2018 ఏప్రిల్ నుండి కొత్త వేతన ఒప్పందం అమల్లోకి రావాల్సి ఉన్నందున ఫెడరేషన్ తరపున చార్టర్ ఆఫ్ డిమాండ్స్ తయారుచేసి సిఎంఎ(సిమెంట్ తయారీ యాజమాన్యాలకు)కు సమర్పించాల్సి ఉందని తెలిపారు.

పోలవరం ఆగదు.. ఓర్వలేకే వైసీపీ నిందలు

- మంత్రి అయ్యన్నపాత్రుడు

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, జనవరి 8: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎవరెన్ని ఆటంకాలు కల్పించినా ఆగదని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టంచేశారు. సోమవారం గుంటూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ వైఎస్ హయాంలో జలయజ్ఞం పేరుతో భారీగా దోపిడీ జరిగిందని విమర్శించారు. గత మూడున్నరేళ్లలో కేవలం జలవనరుల అభివృద్ధికి 47వేల 375.49 కోట్లు తమ ప్రభుత్వం కేటాయించిందని పట్టిసీమ ద్వారా అందించిన నీటితో రూ 30వేల కోట్ల పంటలు కాపాడగలిగామన్నారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా రాయలసీమకు 120 టీఎంసీల నీటిని అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్ తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జలయజ్ఞంకు కేటాయించిన 96వేల కోట్లను మట్టిపనులతో సరిపెట్టి కైంకర్యం చేశారని ఆరోపించారు. వేల కోట్లు వెచ్చించినా సొంత నియోజకవర్గం పులివెందులతో పాటు సీమలో ఒక్క అదనపు ఎకరానికి నీటిని అందించలేకపోయారని విమర్శించారు. భూ పరిహారానికి అప్పట్లో కేంద్రం నుంచి నిధులు సేకరించి కమిషన్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ముందుచూపుతో గండికోట రైతులకు రూ 470 కోట్లు పరిహారాన్ని చెల్లించిందని గుర్తుచేశారు. ముంపు మండలాలను విలీనం చేయకపోతే పోలవరం నిర్మాణమే జరిగేది కాదన్నారు. దేశంలో జాతీయ ప్రాజెక్టుల నిర్మాణంలో అలసత్వం జరుగుతోందని నీతి అయోగ్ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వమే పోలవరం నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భూములకు పరిహారం చెల్లిస్తూ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేస్తుంటే వైఎస్ జగన్ అడ్డుపుల్ల వేస్తున్నారని మండిపడ్డారు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధిచెప్తారన్నారు. ఉనికిని చాటుకునేందుకు చేపట్టిన పాదయాత్రకు స్పందన రాకపోవడంతో పిచ్చిప్రేలాపనలు చేస్తున్నారని ఖండించారు.



గుంటూరు జిల్లా చేబ్రోలు జన్మభూమి సభలో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

పెన్షన్ల పేరుతో పేదల ఎంగిలి మెతుకులు తింటున్నారు

చేబ్రోలు: పెన్షన్ల పేరుతో కొందరు పేదల మూతుల వద్ద ఎంగిలి మెతుకులు తింటున్నారని, విశాఖపట్నం జిల్లాలో తప్పుడు పెన్షన్లను తానే స్వయంగా పట్టుకున్నానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు గుంటూరు జిల్లా చేబ్రోలు జన్మభూమి సభలో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మండల కేంద్రమైన చేబ్రోలు గ్రామంలో సోమవారం జరిగిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో మంత్రి అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ కోన శశిధర్ పాల్గొన్నారు. తొలుత మంత్రి అయ్యన్నపాత్రుడు చేబ్రోలులో నిర్మించిన వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 65 సంవత్సరాలు నిండిన వారికి ప్రభుత్వం పెన్షన్లు ఇస్తుందని, అయితే విశాఖపట్నం జిల్లాలో 50 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి కూడా 65 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు సర్టిఫికెట్లు తెచ్చుకుని పెన్షన్లు పొందుతున్నారన్నారు.

ఈ భాగోతాన్ని తానే స్వయంగా బయటపెట్టానన్నారు. రేషన్‌కార్డులు ఉండి ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న వారికి మాత్రమే పెన్షన్లు వస్తాయని, అయితే చిటికెన వేలు లేని వారు కూడా వచ్చి తనకు వికలాంగ పెన్షన్ కావాలని అడుగుతున్నారని హాస్యోక్తి విసిరారు. 40 శాతం అంగవైకల్యం ఉన్నవారికే వికలాంగ పెన్షన్ వస్తుందని, కొంతమందైతే కేవలం పెన్షన్ల కోసమే కొత్తరేషన్ కార్డులకు అర్జీలు పెడుతున్నారన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్ని పెన్షన్లు ఇస్తుందో కూడా తెలియని వారు, పెన్షన్‌కు అర్థం తెలియని మూర్ఖుడు ప్రతిపక్ష నేతగా ఉండటం దురదృష్టకరమని కూడా మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 46 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని, ప్రస్తుత జన్మభూమిలో మరో 5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశామన్నారు. మొత్తం కలిపి 51 లక్షల మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పుడు ఇస్తున్న పెన్షన్లతో పాటు ఎన్నో ఏళ్ల క్రితం భర్తలు వదిలేసిన మహిళలకు కూడా పెన్షన్లు ఇవ్వాల్సిందిగా ఇటీవల తమ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా వారికి కూడా పెన్షన్లు ఇచ్చారన్నారు.

జన్మభూమి-మాఊరులో

మా పంటలు - మా వంటలు

- మండల స్థాయిలో పోటీలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: జన్మభూమి - మా కార్యక్రమంలో భాగంగా మా పంటలు - మా వంటలు పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రాన్ని ఆనంద, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆలోచనల మేరకు మహిళలకు భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామని సోమవారం మీనా తెలిపారు. జన్మభూమి కార్యక్రమం చివరి రోజైన పదకొండవ తేదీన మండల స్థాయిలో పర్యాటక, సాంస్కృతిక శాఖ వంటల పోటీలను నిర్వహిస్తుందని, ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు కార్యక్రమానికి నేతృత్వం వహిస్తారని మీనా వివరించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆరోగ్యకరమైన వంటలకు సంబంధించిన మెటీరియల్‌ను సమకూర్చుతుందన్నారు. మా పంటలు-మా వంటలు కార్యక్రమాన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తారని వివరించారు. మూడు విభాగాలుగా పోటీలు జరుగుతాయని, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తీపి వంటకాల విభాగాల్లో ఉత్సాహ వంతులు పోటీ పడవచ్చన్నారు. పోటీలకు వినియోగించే వంట సామగ్రిని పాల్గొనే వారే సమకూర్చుకోవలసి ఉంటుందని, ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లను ఎంపీడీవో చేపడతారని వివరించారు. ఎంపీడీవో నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని, వీరిలో స్థానిక ప్రజాప్రతినిధితో పాటు, ఐసీడీఎస్ లేదా డీఆర్‌డీఏ అధికారి సభ్యులుగా ఉంటారని మీనా పేర్కొన్నారు. మండల స్థాయి విజేతలకు ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఉత్తమ ఇంటి చెఫ్ పోటీలకు ఆహ్వానం అందిస్తుందన్నారు. వీరికి ఉగాది లోపు పోటీలు నిర్వహించి స్వయంగా ముఖ్యమంత్రి బహుమతులు అందచేసారు.

సచివాలయంలో సంక్రాంతి ఆహార పండుగ

ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ నేతృత్వంలో సంక్రాంతి సందర్భంగా సచివాలయ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా తెలుగు వంటకాలను అందిస్తున్నట్లు ఆ శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సహకార సంఘ క్యాంటిన్ సహకారంతో నాలుగు రోజుల పాటు సచివాలయ క్యాంటిన్‌లో ఆహార పండుగ జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఒక విశేష వంటకాన్ని పర్యాటకశాఖ తరుపున భోజనంతో పాటు అందిస్తారని తెలిపారు. మంగళవారం రాగిసంకటి, వేరుశనగ పచ్చడి, బుధవారం దంపుడు బియ్యం పలావ్, కుర్మా, గురువారం మెంతికూర టమాటా అన్నం, కుర్మా, శుక్రవారం బెల్లం పొంగలి, మసాల వడ అందచేస్తామన్నారు. ఈ వంటకాలకు అదనపు చెల్లింపులు అవసరం లేదని, రాష్ట్రం ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తొలిసారి ఈ తరహా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

తక్షణ రాజకీయ కర్తవ్యం


బీజేపీని అధికారం నుంచి తప్పించడమే

- లౌకికవాద పరిరక్షణకు విశాల ఐక్యవేదిక అవసరం
- నల్లధనాన్ని వెలికితీయడంలో మోదీ విఫలం
- సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: భారతీయ జనతాపార్టీని అధికారం నుంచి తప్పించడమే తక్షణ రాజకీయ కర్తవ్యమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. హిందుత్వ శక్తుల దాడులపై పోరాటాలు చేయడం చాలా అవసరమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడాలనుకునే రాజకీయ, రాజకీయేతర శక్తులతో కలసి విశాల ఐక్యవేదికను ఏర్పాటు చేయాలని, అందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలని ఆయన ఉద్ఘాటించారు. విజయవాడ దాసరి భవన్‌లో మూడురోజులపాటు జరిగే సీపీఐ జాతీయ సమితి సమావేశాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. బీజేపీలో అవినీతి బాగా పెరిగిపోయిందన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ప్రధాని నరేంద్రమోదీ పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. పనామా పేపర్లు, ప్యారడైజ్ ఎక్స్‌పోజర్స్ వల్ల వెల్లడైన జాబితాలో ఉన్నవారిపై విచారణ జరిపి విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేదన్నారు. స్వయంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జేషా అవినీతి బయటపడినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. జర్నలిస్టులు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు, ఉద్యమాలు నిర్వహించే దళితులపై కేసులు నమోదు చేసి ఒత్తిళ్లకు గురిచేస్తోందన్నారు. పాలన, న్యాయ వ్యవస్థలను సైతం తమ గుప్పిట్లోకి తీసుకుని నియంత్రించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగే పరిస్థితి నెలకొనడంతో విమానయానంలోనే 13 శాతం చార్జీలు పెంచబోతున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. అలాగే రైలు, బస్సులపై కూడా డీజిల్ ధరల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంట గ్యాస్‌పై అసాధారణమైన రీతిలో సబ్సిడీలను రద్దుచేసే పేరుతో ప్రతి నెలా రూ.10లు గ్యాస్ సిలెండర్లపై పెంచుకుంటూ పోతున్నారని ఆయన తెలిపారు. ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్నిచోట్లా నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. అంతర్జాతీయ విషయాలను ప్రస్తావిస్తూ, అగ్రరాజ్యం అమెరికా అభివృద్ధి చెందుతున్న దేశాలపై తన పెత్తనాన్ని చూపేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఆ దేశంలో విపరీతమైన నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం కారణంగానే అక్కడి పేద, మధ్యతరగతి ప్రజలిచ్చిన తీర్పుతోనే డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చారన్నారు. ఇక అమెరికా-ఉత్తరకొరియా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సహా ఆయా దేశాల్లో నెలకొన్న ఆర్థిక సంక్షోభాలు, రాజకీయ పరిణామాలను వివరించారు. కేరళలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి 29 వరకూ జరిగే సీపీఐ 23వ జాతీయ మహాసభలో ఆమోదించాల్సిన రాజకీయ తీర్మానం గురించి ఈ సమావేశంలో చర్చించనున్నట్లు సుధాకరరెడ్డి వివరించారు. కార్యక్రమానికి రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షత వహించగా పార్టీ కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాషీమ్ ఫైజీ, డి.రాజా, కె.నారాయణ, రామేంద్రకుమార్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు. ఇంకా వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన రాష్ట్ర సమితి ప్రతినిధులు కౌన్సిల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జాతీయ ప్రధాన కారదర్శి సురవరం సుధాకరరెడ్డి

5వేల పాఠశాలలకు డిజిటల్ తరగతుల విస్తరణ

రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతోంది. విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు తమ జన్మభూమిపై ఉన్న మమకారాన్ని వివిధ రూపాల్లో తెలియచేస్తూ అభివృద్ధిలో మమేకం అవుతున్నారు. జనవరి 9న ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న తరుణంలో రాష్ట్రానికి ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవలను కూడా గుర్తు చేసుకోవడం అవవసరం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో జన్మభూమి కార్యక్రమానికి రూపకల్పన చేసి, 2016 జనవరిలో ప్రారంభించారు. ఉత్తర అమెరికాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కోమటి జయరాంను ప్రభుత్వం నియమించింది. వివిధ రంగాల్లో రాష్ట్రానికి కావాల్సిన నిధులు, సాంకేతిక, మానవ వనరులను రాష్ట్రానికి ప్రవాసాంధ్రుల నుంచి సమకూర్చడమే లక్ష్యంగా నియమించారు. మాతృభూమికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలన్న పిలుపుతో అనేక మంది ప్రవాసాంధ్రులు స్పందిస్తున్నారు. వివిధ రూపాల్లో రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల్లో 70 శాతం నిధులు ప్రభుత్వం భరిస్తుండగా, 30 శాతం నిధులను ప్రవాస ఆంధ్రులు సమకూరుస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటబొమ్మలు, చదువుకు సంబంధించి బొమ్మల అందించడం, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ వంటివి నిర్వహిస్తున్నారు. విద్యా రంగంలో భారీ మార్పులు తీసుకువచ్చేందుకు వీలుగా సర్కారీ బడులకు డిజిటల్ సొబగులను అద్దుతున్నారు. ఇప్పటికే దాదాపు 2400 పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయగా, ఈ సంవత్సరాంతానికి 5000 పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సౌకర్యం ఏర్పాటు చేసిన పాఠశాలల్లో ఫలితాల తీరును ఎన్నారైలు తెలుసుకునేలా వీడియో కాన్ఫరెన్సు వంటివి నిర్వహిస్తూ స్ఫూర్తి నింపుతున్నారు. గ్రామాభివృద్ధిలో ఎన్నారైలకు మరింత భాగస్వామ్యం కల్పించేందుకు 2017 జనవరిలో ఎన్నారై సెల్‌ను ఏర్పాటు చేశారు. ఏపీ జన్మభూమి కార్యక్రమానికి నిధులు సమీకరించేందుకు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని ప్రచారం చేస్తున్నారు. తరగతుల డిజిటలైజేషన్ చేయడం వల్ల హాజరు 17 శాతం పెరిగింది. ఏపీ జన్మభూమి కార్యక్రమంలో ఇంటర్న్‌షిప్ కోసం 20 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం మాతృభూమిపై మమకారాన్ని తెలియచేస్తుంది. 1000 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూళ్ల ఏర్పాటు, వెయ్యి శ్మశాన వాటికల నిర్మాణం వంటివి చేపడుతూ రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు.

బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న పార్టీలు

- ఆర్ కృష్ణయ్య ధ్వజం

విజయవాడ (పటమట) జనవరి 8: దేశ జనాభాలో 56 శాతం వున్న బీసీ కులాలకు రాజకీయ పార్టీలు ప్రతిసారీ మొండిచెయ్యి చూపిస్తున్నాయని, అన్ని రాజకీయ పార్టీలకు ప్రధాన ఓటు వనరుగా వున్న బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని బీసీగా చెప్పుకునే దేశ ప్రధాని నరేంద్రమోదీ కూడా బీసీలకు చేసిందేమి లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ అన్నారు. సోమవారం విజయవాడలోని ఎస్వీఎస్ కళ్యాణమండపంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 12వ రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లపై ఉన్న క్రీమీ లేయర్‌ను తొలిగించాలని డిమాండ్ చేశారు. అలాకే బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై వున్న క్రీమీ లేయర్‌ను కూడా తొలగించాలన్నారు. పార్లమెంట్‌లో 36 జాతీయ, ప్రాంతీయ పార్టీలున్నప్పటికీ బీసీల గొంతు వినిపించే పరిస్థితి లేకపోవటం బాధకరమన్నారు. చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు అమలుకు మాత్రం నోచుకోకపోవటం విచారకరమన్నారు. పంచాయితీ రాజ్ వ్యవస్థలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 50 శాతం వరకు పెంచాలని, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని అన్నారు. తెలుగు రాష్ట్రాలలో ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కంల చైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న 22 వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని ఈ మేరకు తెలుగు రాష్ట్రాల చట్ట సభల్లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని అన్నారు. దేశంలో 26 వేల బీసీ కులాలుంటే అందులో 2532 కులాలు చట్టసభలకు దూరంగా వున్నాయన్నారు. అనంతరం బీసీ ఉద్యోగుల 2018 డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి విశ్వకర్మ, రాష్ట్ర అధ్యక్షుడు జి.వీరయ్య, ప్రధానకార్యదర్శి గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




తాళ్లపూడి జన్మభూమి కార్యక్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ మత్స్యశాఖ స్టాల్ వద్ద చేపను పరిశీలిస్తున్న సీఎం

ప్రకృతి వనరులతో స్వర్ణాంధ్రప్రదేశ్

తాళ్లపూడి జన్మభూమి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

తాళ్లపూడి, జనవరి 8: ప్రకృతి వనరుల ద్వారా సంపదను సృష్టించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గాలి, నీరు, సూర్యరశ్మిని వినియోగించి సంపదను సృష్టిస్తామన్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే పటిష్ఠ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడిలో జరిగిన జన్మభూమి గ్రామ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులను సద్వినియోగం చేసుకుని, అభివృద్ధిలో ముందడుగు వేస్తామన్నారు. వృథా జలాలు సముద్రంలోకి పోకుండా నదుల అనుసంధానం కోసం ఇప్పటివరకు రూ.50వేల కోట్లతో వివిధ ప్రాజెక్టులు చేపట్టామన్నారు. నీరు బంగారంతో సమానమని, నీరు లేకపోతే అభివృద్ధే లేదని, అందుకే జలసిరి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా, ఆహ్లాదంగా జీవించాలంటే చెట్లు ఎంతో అవసరమని, అందుకే వన మహోత్సవాలకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా సూర్యభగవానుడిని ఆరాధించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు.

ఆరోగ్యంగా ఉండాలంటే సూర్యుని కిరణాలు మనపై పడాలని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా సూర్యధారణ కార్యక్రమాలు చేపట్టి సంస్కృతిని ప్రతిబింబింపజేస్తామన్నారు. సౌర విద్యుత్తుతో రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలపై 60 నుండి 65 శాతం ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని, గత ప్రభుత్వాల పాలనలో వ్యవసాయరంగం సంక్షోభంలో చిక్కుకుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక, మెట్ట ప్రాంతంలో కరెంటు లేక రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, వాటిని తన పాదయాత్రలో గుర్తించి అధికారంలోకి వచ్చిన మూడు గంటల్లోపే మార్పులు చేశామన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఎర్రకాల్వ ప్రాజెక్టును మార్చి, ఏప్రిల్ మాసాల్లోగా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రజల హర్షధ్వానాల మధ్య చంద్రబాబు ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో పోలవరం ప్రాజెక్టుతో పాటు పలు ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల అవసరాలు తీరుస్తామని, మూడువేల టియంసిల నీరు సముద్రంలో కలవకుండా ఎక్కడికక్కడే అడ్డుకట్ట వేయడానికి అవసరమైన ప్రాజెక్టులు నిర్మించి తీరుతామన్నారు. కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. వ్యవసాయరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నామని, రైతులకు వాణిజ్యపంటల విషయంలో కూడ తగిన సహకారం అందిస్తామని తెలిపారు.

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడం వల్ల రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తున్నామని, ఇందుకోసమే ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రులు పితాని సత్యనారాయణ, కెఎస్ జవహర్, ఎంపీలు తోట సీతారామలక్ష్మి, మాగంటి మురళీ మోహన్, జిల్లా కలెక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీలకు స్టార్ రేటింగ్

మంత్రి నారా లోకేష్ వెల్లడి



కావలి, జనవరి 8: రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు స్టార్ రేటింగ్ ఇవ్వడం ద్వారా సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి విషయంలో పంచాయతీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ వాతావరణాన్ని కల్పించనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. నెల్లూరు జిల్లా కావలి నియోజవర్గంలోని తుమ్మలపెంట గ్రామంలో సోమవారం జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ పంచాయతీలలో ఎక్కువగా మన రాష్ట్రం నుంచే ఎంపికయ్యాయన్నారు. అదే స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు 10 స్టార్ రేటింగ్ సాధించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేస్తున్నామన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇందుకోసం జిల్లాలో 13వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. అతి చిన్న వయస్సులోనే మంత్రి పదవిని కట్టబెట్టి ముఖ్యమంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. అయినప్పటికీ 67 సంవత్సరాల వయస్సులో కూడా 20 సంవత్సరాల యువకుడిలా పరుగులు తీస్తున్న మన ముఖ్యమంత్రి వేగాన్ని అందుకోలేకపోతున్నానని, రాష్ట్రాభివృద్ధి కోసం తీవ్రంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రికి మీరందరూ అండగా నిలవాలని ప్రజలను కోరారు. 70 సంవత్సరాల నుంచి దేశాన్ని పాలించిన పాలకులు నదుల అనుసంధానం గురించి మాట్లాడుతూనే ఉన్నారని, కాని కేవలం 18 నెలల కాలంలోనే పట్టిసీమ ద్వారా గోదావరి , కృష్ణ నదులను అనుసంధానించి కేంద్ర పాలకులకు మన ముఖ్యమంత్రి దార్శనికుడిగా నిలిచారన్నారు. అదేవిధంగా రాష్ట్రానికి జీవనాడిలాంటి పోలవరం ప్రాజెక్టును కూడా అనుకున్న సమయానికి పూర్తిచేస్తామన్నారు. మరోవైపు దక్షిణాంధ్ర సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణ, పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ నాటికి రాష్ట్రంలోని అన్ని పంచాయతీలలో 30 లక్షల వీధి దీపాలను నూతన సాంకేతికతతో అనుసంధానించి అమరావతి నుంచి పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే 14 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం చేశామన్నారు. వ్యవసాయ రంగానికి గతానికి భిన్నంగా బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించి ఖర్చు చేయడం ద్వారా అభివృద్ధిలో జాతీయ సగటుకన్నా ఎక్కువ సగటు సాధించగలిగామన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చేస్తామన్నారు. రైతు రథాల పథకం ద్వారా ఇప్పటికే రాష్ట్రంలో 12 వేల ట్రాక్టర్లను రైతులకు అందించామని తెలిపారు. నిరంతరం రాష్ట్రాభివృద్ధి కోసం శ్రమిస్తూ అధునాతన రాజధాని నిర్మాణానికి పూనుకున్న ముఖ్యమంత్రి కి 2019 ఎన్నికలలో ఓటు వేయడం ద్వారా మద్దతుగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి,, కలెక్టర్ ముత్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం.. గాయత్రీ మహాయజ్ఞం




చివరిరోజు సోమవారం యజ్ఞంలో పాల్గొన్న భక్తులు ★ దేదీప్యమానంగా దీపయజ్ఞం

మంగళగిరి, జనవరి 8: అఖిల విశ్వగాయత్రి పరివార్ , శాంతికుంజ్ హరిద్వార్ ఆధ్వర్యాన గుంటూరుజిల్లా మంగళగిరి మండలం చినకాకానిలోని ఎన్నారై వైద్య కళాశాల ప్రాంగణంలో ఈనెల 5వ తేదీ నుంచి నిర్వహించిన అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞం సోమవారం వైభవోపేతంగా ముగిసింది. దేశ విదేశాల నుంచి నాలుగు రోజుల్లో లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో యజ్ఞం అంగరంగ వైభవంగా జరిగి సుసంపన్నమైంది. చివరి రోజున పూర్ణాహుతితో పరిసమాప్తమైంది. ముఖ్యమంత్రి చ చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఆధ్యాత్మిక వేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు యజ్ఞంలో పాల్గొన్నారు. సోమవారం చివరిరోజున ఉదయం 7 గంటలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గాయత్రి పరివార్ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన షోడశ సంస్కారాల్లో పాల్గొన్నారు. వేలాదిమంది భక్తజనులకు దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం వైస్‌చాన్సలర్ డాక్టర్ ఆచార్య చిన్మయ పాండ్యా గాయత్రి మంత్ర దీక్ష ఇచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చిన్మయ పాండ్యా గాయత్రీ పరివార్ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి గాయత్రీ మాతా చిత్రపటం వద్ద పూజలు కాగానే సంప్రదాయ తలపాగా, శాలువతో సత్కరించారు. రాత్రి లక్ష దీపకాంతులతో దేదీప్యమానంగా దీపయజ్ఞం నిర్వహించారు. చిన్మయపాండ్యా దీపయజ్ఞాన్ని ప్రారంభించారు. యాగప్రాంగణం దీపకాంతుల తేజస్సుతో ప్రజ్వరిల్లింది. విశ్వ గాయత్రీ పరివార్ వరిష్ట కార్యకర్తలు వీరేశ్వర్ ఉపాధ్యాయ, సంత్ బ్రిజ్ మోహన్ గౌర్ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. దీపయజ్ఞం ఒక పుణ్య యజ్ఞమని, దీపాలను వెలిగించడం ద్వారా మనలోని అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన జ్యోతులను వెలిగించు కోవడమే దీని పరమార్థమని పాండ్యా అన్నారు.

పోలీసుల కౌన్సిలింగ్‌కు యాంకర్ ప్రదీప్ హాజరు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: మద్యం సేవించి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసుల చేతికి చిక్కిన టివి యాంకర్ ప్రదీప్ సోమవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. ప్రదీప్ తన తండ్రితో కలిసి గోషామహల్ ట్రాఫిక్ పోలీసు శిక్షణ కేంద్రంలో కౌన్సిలింగ్ హాజరై పోలీసులు చూపించిన డాక్యుమెంటరీలను దాదాపు ఆరు గంటల సేపు శ్రద్ధగా చూశారు. గత ఏడాది డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి తన కారును నడుపుతూ వచ్చి తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు దొరికిపోవడం, ఆ కారును అక్కడే వదిలి వేసి వెళ్లిపోవడం తెలిసిందే. మోతాదుకు మించి 178 పాయింట్ల వరకు మద్యం సేవించడంతో ప్రదీప్ వార్తల్లో కెక్కారు. పోలీసులు కారు స్వాధీనం చేసుకుని తమ వద్దే ఉంచుకున్నారు. తాజాగా సోమవారం కౌన్సిలింగ్ పూర్తయి ఇంటికి వెళుతూ కూడా తానే తాగి వాహనం నడపవద్దని ప్రచారం చేసి, తానే తప్పు చేశానని, ఇంకెప్పుడూ చేయనని, ఎవరూ చేయవద్దని చెప్పారు. తాను చట్ట ప్రకారం నడుచుకుంటానని, పోలీసులు తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ హ్యాట్సాఫ్ చెప్పారు. కాగా ప్రదీప్ కౌన్సిలింగ్ ముగియడంతో మంగళవారం ఎర్రమంజిల్ కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. మద్యం తాగా వాహనం నడిపిన కేసుతో పాటు ప్రదీప్ తన కారు అద్దాలకు రంగుల ఫిల్మ్‌ను అతికించి మరో నిబంధనను ఉల్లంఘించడం వల్ల ట్రాఫిక్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

హంతకుడికి యావజ్జీవ శిక్ష ఖరారు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: అనంతపురం జిల్లా చాగల్లు గ్రామానికి చెందిన 16 ఏళ్ల యువతిని దారుణంగా చంపిన కేసులో నిర్దోషికి దిగువ కోర్టు వేసిన యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు సోమవారం నాడు ధృవీకరించింది. జస్టిస్ చల్లా కోదండరాం జస్టిస్ టి సునీల్ చౌదరిలతో కూడిన బెంచ్ ఈ మేరకు గూటీ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.

నటుడు నితిన్‌కు ఊరట

హైదరాబాద్, జనవరి 8: సినీనటుడు నితిన్ , అతని తండ్రి సుధాకర్‌రెడ్డి, సోదరి నిఖిత రెడ్డిలకు ఊరట లభించింది. డిస్ట్రిబ్యూటర్ జి సత్యనారాయణ దాఖలు చేసిన చీటింగ్ కేసు పిటీషన్‌ను 20వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కొట్టివేశారు. అఖిల్ సినిమాకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్‌లో తనకు మోసం చేశారని సత్యనారాయణ సుధాకర్‌రెడ్డి, నితిన్, నిఖిత రెడ్డిలపై కేసు దాఖలు చేశారు. దానిని దిగువ కోర్టు పరిగణనలోకి తీసుకోవడంతో వీరు ముగ్గురు దిగువ కోర్టు నిర్ణయాన్ని 20వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు వేర్వేరుగా సవాలు చేశారు.

ఆరోరోజు అన్ని జిల్లాలకు సీ గ్రేడ్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: జన్మభూమి -మా ఊరు కార్యక్రమంలో ఆరోరోజు అన్ని జిల్లాలకు సీ గ్రేడ్ వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆరో రోజు గ్రేడింగ్‌లో అనంతపురం 29 పాయింట్లతో ముందు ఉండగా, 18 పాయింట్లతో కడప చివరి స్థానంలో ఉందన్నారు.

రచ్చగా మారిన చర్చ

గుంటూరులో హైడ్రామా ◆ అంబటి హౌస్ అరెస్టు ◆ ఎమ్మెల్సీ బుద్దాను అడ్డుకున్న పోలీసులు

ఆంధ్రభూమి బ్యూరో



అంబటి రాంబాబు

గుంటూరు, జనవరి 8: రాష్ట్ర శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రాతనిధ్యం వహిస్తున్న గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీలో అక్రమాలు జరిగాయనే అంశంపై అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లపై హైడ్రామా నెలకొంది. నియోజకవర్గంలో అనర్హులు పింఛన్లు పొందుతున్నారని, జన్మభూమి కమిటీ సభ్యులు కనుసన్నల్లో కొద్దిమందికి మాత్రమే పంపిణీ చేస్తున్నారని, అసలు వితంతు, వికలాంగులైన అర్హులను పక్కనపెడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు. ఈ ఆరోపణలను ఖండిస్తూ పూర్తిస్థాయిలో పారదర్శకంగా పింఛన్ల పంపిణీ జరుగుతోందని, ఎలాంటి అక్రమాలు నిరూపించినా అందుకు అధికార పార్టీ బాధ్యత వహిస్తుందని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న స్పష్టం చేయటంతో పాటు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. దీంతో సోమవారం సత్తెనపల్లి వేదికగా ఇరువురు నేతలు చర్చకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఉదయం 6 గంటలకే గుంటూరు నవభారత్‌నగర్‌లోని అంబటి రాంబాబు ఇంటికి చేరుకున్నారు. ఆయన్ను బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. అదేమని ప్రశ్నించిన అంబటికి హౌస్ అరెస్టు చేస్తున్నట్టు నోటీసులు జారీచేశారు. మరోవైపు బహిరంగ వేదికపై చర్చించేందుకు ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విజయవాడ నుంచి బయల్దేరగా, ఆయనను కాజ టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్న సమయంలో పోలీసులు అడ్డగించారు. అయితే శాంతియుతంగా చర్చించేందుకు వస్తున్నట్లు చెప్పి కారులో సాగిపోతుండగా తిరిగి చుట్టుగుంట వద్ద గుంటూరు అర్బన్ పోలీసులు అడ్డుకుని తిప్పిపంపారు. తనను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచటంపై అంబటి రాంబాబు తీవ్రంగా స్పందించారు. ఒకానొక దశలో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తనకు వెంకన్న సుపరిచితుడే అని అయితే ఆయనతో యుద్ధానికి వెళ్లడంలేదని సామరస్య పూర్వక వాతావరణంలో చర్చించేందుకు బయల్దేరిన తనను అడ్డగించి నిర్బంధించడం అక్రమమని మండిపడ్డారు. సత్తెనపల్లిలో అవకతవకలు జరిగినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని దీనిపై చర్చించేందుకు అనుమతించక పోవటం అప్రజాస్వామిక మన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్దేశ్యపూర్వకంగానే గృహ నిర్బంధానికి పోలీసులను ప్రేరేపించారని విమర్శించారు. తనను మాత్రమే నిర్బంధించిన పోలీసులు వెంకన్నకు విజయవాడ నుంచి స్వాగతం పలికి సత్తెనపల్లిలో స్పీకర్ కార్యాలయానికి తీసుకువెళ్లారని, తాను రాలేకపోయినందున అంబటి ముఖం చాటేశారనే దుష్ప్రచారానికి తెరలేపుతున్నారని మండిపడ్డారు. అంబటి హౌస్ అరెస్టును నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ నేతలు రావి వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఖండిస్తూ కార్యకర్తలతో సహా ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. దీంతో ఒకింత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బుద్దా వెంకన్నను రాజలాంఛనాలతో తీసుకువెళ్లి వైసీపీ నేతలపై ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం ఇటీవల జన్మభూమి గ్రామసభలో తమ పార్టీ ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో మైకు లాక్కుని దౌర్జన్యకరంగా ప్రవర్తించారంటూ ఈ నైజం ఈనాటిది కాదన్నారు. జన్మభూమి గ్రామసభల్లో పింఛన్లు అందరికీ అందిస్తున్నట్లు అధికార పార్టీ అబద్ధాలు చెప్తోందని ఆరోపించారు. కాగా దీనిపై ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న స్పందిస్తూ తనను కూడా పోలీసులు అడ్డుకున్నారని, కనీసం మీడియా ఎదుట హాజరు కానివ్వలేదని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తాము సహకరించామని తెలిపారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు సంక్షేమ కార్యక్రమాల అమలులో రాజీపడటంలేదని, నూటికి నూరుశాతం అర్హులకే పథకాలు అందుతున్నాయన్నారు. తప్పులు ఉన్నట్లు నిరూపించాలని మరోసారి సవాల్ విసిరారు.



బుద్దా వెంకన్న

హంపీ ఆస్థాన పౌరాణికుడు దత్తాత్రేయ శర్మ కన్నుమూత



ధర్మపురి, జనవరి 8: హంపీ పీఠ ఆస్థాన పౌరాణికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కాకెర్ల దత్తాత్రేయ శర్మ (72) సోమవారం ధర్మపురి క్షేత్రంలో ఆయన స్వగృహంలో కన్నుమూసారు. బాల్యం నుండే సంస్కృత, తెలుగు భాషాధ్యయనంచేసి, ప్రభుత్వ పాఠశాలలలో భాషా పండితునిగా పలుచోట్ల వృత్తి నిర్వహణ చేసి విశ్రాంతులైనారు. ఐదు దశాబ్దాలుగా పలుచోట్ల నారదుడు, యయాతి, అంగదుడు, ఆంజనేయుడు, నక్షత్రకుడు, గయుడు, కౌశికుడు, శ్రీహరి, భవానీ శంకరుడు, స్థానాపతి, జక్కన్న, ధృతరాష్ట్రుడు, బాలనాగమ్మ మాంత్రికునిగా చారిత్రక, జానపద, పౌరాణిక రంగస్థల నటునిగా, దర్శకత్వ, సంగీత దర్శక బాధ్యతలు నిర్వహించి, పలు సన్మానాలు పొందారు. సుప్రసిద్ధ జ్యోతిష్కులుగా, వేదవిదులుగా రాష్ట్ర ప్రభుత్వ సన్మానం పొందారు. హంపీ పీఠాధిపతిచే సత్కారమంది, పీఠ ఆస్థాన పౌరాణికునిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. పలు విగ్రహ ప్రతిష్ఠలు చేయించడంలో యాజ్ఞికునిగా, శాస్త్రీయ సంగీత విద్వాంసునిగా, తంజావూర్ భవానీ ఉపాసకునిగా సేవలందించారు. ఏటా ధర్మపురి దేవస్థానంలో నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాలలో త్యాగరాజు వేషధారియై, ఉంఛవృత్తిని లాంఛనంగా నిర్వహిస్తూ, పలు ప్రదేశాలలో హరికథకులుగా లబ్ధప్రతిష్ఠులైనారు. ఇటీవల నిర్వహించిన ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ నాట్యమండలి అశీతి (80 ఏళ్లు) ఉత్సవాలలో సభాధ్యక్షులుగా, ప్రయోక్తగా వ్యవహరించి, కార్యక్రమాలను నడిపించారు. తన ఇరువురు కుమారులు, కూతురుకు తర్ఫీదు ఇచ్చి, పలు నాటకాలలో రాణింపచేశారు. నవంబర్ 30న చివరిసారిగా గుండి రాజర్షి స్మారకంగా సన్మానం పొంది, పురాణ ప్రవచనం చేశారు. సోమవారం ఉదయం నుండి వందలాదిగా పార్థివ దేహాన్ని కడసారి చూసి, కన్నీళ్ళపర్యంతమయ్యారు.

రెండో రోజూ కాంగ్రెస్ పాదయాత్ర



కొవ్వూరు, జనవరి 8: పోలవరం ప్రాజెక్టు సత్వరం పూర్తిచేయాలనే డిమాండుతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మహా పాదయాత్ర రెండో రోజైన సోమవారం పశ్చిమ గోదావరి జిల్లాలో కొనసాగింది. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో ప్రారంభమైన పాదయాత్రలో పాల్గొన్న నేతలు కొవ్వూరులో రాత్రి బసచేశారు. సోమవారం ఉదయం కొవ్వూరు నుండి బయలుదేరిన కాంగ్రెస్ నేతల పాదయాత్ర దొమ్మేరు, కాపవరం మీదుగా ధర్మవరం చేరింది. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి, రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, కేంద్ర మాజీ మంత్రులు పళ్లంరాజు, జెడి శీలం, పనబాక లక్ష్మి, కాపవరం సర్పంచ్ అమర్ జహబేగ్, డిసిసి అధ్యక్షుడు రఫీయుల్లా బేగ్, వట్టి వసంతకుమార్, ఎస్ తులసీరెడ్డి, సత్యవరపు చంద్రశేఖర్, గంధం పూజ్య బాపూజీ, దొడ్డా విజయసారథి, కొల్లేపర శ్రీనివాస్, బోనగిరి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

మంగళవారం, 9 జనవరి 2018

పదునెక్కని పటిమ

సాయుధ సమర సంపత్తిని ఆధునీకరించుకోవాలన్న సైనిక దళాల ప్రధాన అధికారి విపిన్ రావత్ ఆకాంక్షలకు 'అరిహంత' జలాంతర్గామి గాయపడిందన్న ప్రచారం విచిత్రమైన నేపథ్యం. రక్షణ అవసరాల దిగుమతులను తగ్గించివేయడానికి వీలుగా స్వదేశీయ రక్షణ ఉత్పత్తులు జరగాలన్నది సోమవారం జరిగిన రక్షణ వ్యవహారాల సదస్సులో రావత్ చెప్పినమాట! ఇది 'భారత్‌లో నిర్మించండి' - మేక్ ఇన్ ఇండియా - స్ఫూర్తికి అనుగుణం! కానీ గత మూడేళ్లుగా రక్షణ రంగంలో ప్రధానమైన ఆయుధాలు యుద్ధ వాహనాల నిర్మాణానికి రూపకల్పన జరగలేదు! భూతల సమర శకటాలు, గగనతల యుద్ధ విమానాలు, గగన శకటాలు - హెలికాప్టర్‌లు -, జలాంతర్గాములు, ప్రతిఘటనకు ఉపకరించగల యుద్ధ నౌకలు, నౌకాదళానికి అవసరమైన గగన శకటాలు, విమానాలు - ఇలా వివిధ రక్షణ ఉత్పత్తులను దేశంలోనే నిర్మించడానికి దాదాపు ఆరు ప్రధాన పథకాలు రూపొంది ఉన్నాయట! కానీ మూడున్నర లక్షల కోట్ల రూపాయల వ్యయం కాగల ఈ బృహత్ పథకాలు కార్యరూపం దాల్చకపోవడం విచిత్రమైన విపరిణామం! రక్షణ ఉపకరణాలను సమగ్ర స్వదేశీయ పరిజ్ఞానంతో సంపూర్ణ స్వదేశీయ వాణిజ్య భాగస్వామ్యంతో నిర్మించడం అనే స్వప్నం సమీప భవిష్యత్తులో సాకారమయ్యే అవకాశాలు లేవు.. రక్షణ ఉత్పత్తుల రంగంలో సైతం 'విదేశీయుల ప్రత్యక్ష భాగస్వామ్యం' - ఫారిన్ డైరక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ - విధానాన్ని ఐదేళ్ల క్రితమే ప్రభుత్వం ఆమోదించింది! కీలకమైన భద్రతతో ముడివడి ఉన్న రక్షణ ఉత్పత్తుల రంగంలో విదేశీయులకు 'పట్టు' ఏర్పడడానికి ఈ విధానం ఉపకరించగలదు. మన్‌మోహన్‌సింగ్ ప్రధాన మంత్రిత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిన ఈ విధానాన్ని నరేంద్రమోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కొనసాగించడం అనివార్యం అయింది. ఇందుకు కారణం డెబ్బయి ఏళ్ల స్వతంత్ర దేశంలో స్వదేశీయ రక్షణ ఉపకరణ ఉత్పాదక శాస్త్ర పరిజ్ఞానం సంపూర్ణంగా వికసించకపోవడం! అందువల్ల పరిజ్ఞానం విషయంలో విదేశీయ సంస్థల భాగస్వామ్యం అనివార్యం అయింది. దీనితోపాటు విదేశీయ సంస్థల పెట్టుబడులు కూడ అనివార్యం అయిపోయాయి! "భారత్‌లో నిర్మించండి" అన్న పారిశ్రామిక ఉద్యమంలో నిహితమై ఉన్న వైరుధ్యం ఇది! కానీ విదేశాల నుంచి తయారయిన ఆయుధాలను వాహనాలను ఇతర ఉపకరణాలను కొనుగోలు చేయడంకంటె విదేశీయుల భాగస్వామ్యంతో స్వదేశంలోనే రక్షణ సామాగ్రిని ఉత్పత్తి చేయడం మెరుగైన ప్రత్యామ్నాయమన్నది అనివార్య విధానం..

ఈ అనివార్య విధానంలో భాగంగా దక్షిణ కొరియాతో కుదుర్చుకున్న ఒక బృహత్ రక్షణోత్పత్తుల ఒప్పందం ఇప్పుడు రద్దయిపోవడం విచిత్రమైన పరిణామం. సముద్రగర్భంలో నిక్షిప్తమైన విస్ఫోటక పదార్థాలను పసికట్టి మన తీరానికి దూరంగా తోసివేయడానికి ఉపకరించే యుద్ధనౌక - మైన్ కౌంటర్ మెజర్ వెజెల్ - ఎమ్‌సిఎమ్‌వి - ల ఉత్పత్తికి సంబంధించిన ఈ ఒప్పందం ఏళ్ల తరబడి మూలబడి ఉండడానికి కారణం దక్షిణ కొరియావారి 'కాంగ్‌నామ్ ఓడరేవు సంస్థ' గొంతెమ్మ కోర్కెలు. 'ప్రపంచీకరణ' - గ్లోబలైజేషన్ - వ్యవస్థీకృతమైన తరువాత సంపన్న దేశాల ప్రభుత్వాలు, సంపన్న దేశాల వాణిజ్య సంస్థలు ప్రవర్ధమాన దేశాలలో కొనసాగిస్తున్న ఆర్థిక దురాక్రమణలో ఈ గొంతెమ్మ కోర్కెలు భాగం! 'ప్రపంచీకరణ నియమావళి' సహజంగానే సంపన్న దేశాలకు, బహుళ జాతీయ వాణిజ్య సంస్థలకు అనుకూలంగా రూపొంది ఉంది! కానీ అనుకూల్యత బహుళ జాతీయ సంస్థల రాకాసి ఆకలిని సంతృప్తి పరచలేకపోవడం నడుస్తున్న వైపరీత్యం! అందువల్లనే దక్షిణ కొరియా సంస్థ తొలుత కుదుర్చుకున్న ఒప్పందంలోని నిబంధనలను మార్చాలని పదేపదే కోరుతోంది! రాఫెల్ యుద్ధ విమానాలను సరఫరా చేస్తున్న ఫ్రాన్స్ పదేపదే వాటి ధరలను పెంచింది. విక్రమాదిత్య యుద్ధనౌకను మనకు అమ్మిన రష్యా కూడా పదేళ్లపాటు ఆ నౌకను మనకు అప్పగించలేదు. మరమ్మతుల పేరుతో మాటిమాటికి ధరను పెంచి చివరికి నిర్ధారిత ధరకంటె రెండున్నర రెట్లు అధికంగా వసూలు చేయడం చరిత్ర! ఇప్పుడు ముప్పయి రెండు వేల కోట్ల రూపాయల వ్యయంకాగల 'ఎమ్‌సిఎమ్‌వి'ల ఉత్పత్తి పథకం దక్షిణ కొరియా మాటమార్చిన కారణంగా రద్దయిపోయింది!!

సముద్రగర్భంలో మన తీరానికి సమీపంలో పేలుడు పదార్థాలను నిక్షిప్తం చేయడానికి చైనా పాకిస్తాన్ ప్రభుత్వాలు ఉమ్మడియత్నం చేయగల ప్రమాదం పొంచి ఉంది. చైనావారి అణుశక్తి చోదిత జలాంతర్గాములు, ఇంధనతైల చోదిత జలాంతర్గాములు పదేపదే సముద్రగర్భంలో మన తీరానికి సమీపంలో పచార్లు చేస్తున్నాయి. ఓడదొంగలను అణచివేసే నెపంతో అరేబియా సముద్రంలో గస్తీ మొదలుపెట్టిన చైనా ఆ తరువాత పెద్దఎత్తున నౌకలను జలాంతర్గాములను 'గస్తీ'కి దింపింది. ఓడదొంగలను అరికట్టడానికి ఇంత పెద్ద ఆర్భాటం అక్కర లేదు! చైనా లక్ష్యం మనదేశాన్ని మూడు సముద్రాల వైపునుంచి దిగ్బంధం చేయడం. శ్రీలంకలోని హంబన్‌తోట ఓడరేవులో చైనా నౌకాదళానికి ఇటీవల స్థావరం ఏర్పడింది! మాల్‌దీవులు చైనా స్థావరంగా మారిపోతోంది! పాకిస్తాన్‌లోని గ్వాడర్ రేవు స్థావరంగా చైనా పాకిస్తాన్‌ల ఉమ్మడి నౌకాదళ విన్యాసాలు మొదలయ్యాయి. ఇరాన్‌లోని చౌబహార్ ఓడరేవును మన ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నప్పటికీ ఇరాన్ రాజకీయ పరిణామాలపై ఆ దేశంతో మన మైత్రి ఆధారపడి ఉంది! ఇరాన్ జనబాహుళ్యంలో పాకిస్తాన్ పట్ల మైత్రి మనదేశంపట్ల వ్యతిరేకత నిహితమై ఉండడం నిరాకరింపజాలని వాస్తవం! ఈ నేపథ్యంలో ఆఫ్రికా ఖండపు జిబౌటీలో చైనా భారీ నౌకాదళ స్థావరాన్ని, సైనిక స్థావరాన్ని నెలకొల్పడం మన సమగ్ర భద్రతకు మరింత భంగకరంగా మారింది!

చైనా జలాంతర్గాములు జిబౌటీ నుంచి, గ్వాడార్ నుంచి బయలుదేరి మన పశ్చిమ సముద్రగర్భంలో పేలుడు పదార్థాలను నిక్షిప్తం చేయవచ్చు! ఈ పేలుడు పదార్థాలను పసిగట్టి దూరంగా నెట్టివేయడానికి వీలుగా మనకు ఇరవై నాలుగు 'ఎమ్‌సిఎమ్‌వి' అవసరం ఉంది. కాని నాలుగు మాత్రమే ప్రస్తుతం మన నౌకాదళంలో ఉండడం దశాబ్దుల 'ప్రమత్తత'కు చిహ్నం! పన్నెండు ఈ ప్రతిఘటనాత్మక నౌకలను తయారు చేయడం కోసం కొరియాతో కుదిరిన ఒప్పందం రద్దు కావడంతో 'కథ' మొదటికి వచ్చింది! స్వదేశీయ పరిజ్ఞానంతో నిర్మితమై 2009లో జలప్రవేశం చేసిన అణుశక్తి చోదిత 'అరిహంత' పదినెలల క్రితం జరిగిన ప్రమాదం కారణంగా దెబ్బతినిందట! ఈ జలాంతర్గామికి అప్పటి నుంచి మరమ్మతులు జరుగుతున్నాయట! ఈ సంగతి ఇప్పుడు బయటపడడమే కొనసాగుతున్న ప్రమత్తత.

శీతాకాల సమావేశాల్లో బీజేపీ వైఫల్యం

ఢిల్లీ కబుర్లు - కె. కైలాష్

ముందు ఊహించినట్లే పార్లమెంటు శీతాకాల సమావేశాలు కూడా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య జరిగిన గొడవలు, గందరగోళం మూలంగా కొట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పార్లమెంటు శీతాకాల సమావేశాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునేందుకు ప్రయత్నించటం శోచనీయం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్.డి.ఏ ప్రభుత్వాన్ని ఏ విధంగానైనా ఇరకాటంలో పెట్టాలనే పట్టుదలతో వ్యవహరించిన కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్షం పార్లమెంటు ఉభయ సభలు ముఖ్యంగా రాజ్యసభలో అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలకు సంబంధించని అంశాలపై పార్లమెంటును స్తంభింపజేశాయి. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా నరేంద్ర మోదీ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తదితరులపై చేసిన విమర్శలను అడ్డం పెట్టుకుని పార్లమెంటు ఉభయసభలను కొన్ని రోజుల పాటు ప్రతిపక్షం జరగనీయలేదు. అధికార పార్టీకి మెజారిటీ ఉన్న లోకసభ పలు సందర్భాలలో మధ్యాహ్నం నుండి పనిచేసినా రాజ్యసభ కార్యకలాపాలను మాత్రం ప్రతిపక్షం పూర్తిగా దెబ్బతీసింది. నరేంద్రమోదీ వచ్చి క్షమాపణలు చెబితే తప్ప సభను నడవనిచ్చేది లేదని ప్రతిపక్షం భీష్మించుకుని కూర్చున్నది. క్షమాపణలు చెప్పేది లేదంటూ మోదీ ప్రభుత్వం కూడా అంతే మొండి పట్టుదలతో వ్యవహరించటంతో చివరకు ప్రతిపక్షమే దిగిరాక తప్పలేదు. తెరవెనక జరిగిన పలు దఫాల చర్చల అనంతరం మోదీ తరపున రాజ్యసభ నాయకుడు, ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సభలో ఒక వివరణ ఇవ్వటంతో ప్రతిపక్షం చల్లబడింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా చేసిన ఆరోపణలు, ప్రత్యారోపణలకు ఎలాంటి విలువ ఉండదనేది ప్రపంచానికి తెలుసు. అయినా ప్రతిపక్షం ప్రతిష్ఠకుపోయింది. నరేంద్ర మోదీ సభకు వచ్చి క్షమాపణలు చెప్పటం అటుంచితే చివరకు వివరణ కూడా ఇవ్వడదనేది ప్రతిపక్షానికి బాగా తెలుసు. అయినా తమ మొండిపట్టు విడువకుండా ఉభయసభల ముఖ్యంగా రాజ్యసభ విలువైన సమయాన్ని ప్రతిపక్షం వృధా చేయటాన్ని క్షమించలేము. ఏదైనా ఫలితం వస్తోందంటే పోరాడవచ్చు కానీ చివరకు మిగిలేదీ ఏమీ ఉండదని తెలిసి కూడా ప్రతిపక్షం గొడవ చేయటం అర్థరహితం. మహారాష్ట్రలోని కోరేగావ్‌లో దళితులపై జరిగిన దాడి సంఘటనను కూడా ప్రతిపక్షం ముఖ్యంగా కాంగ్రెస్ రాజకీయం చేసింది తప్ప దళితుల ప్రయోజనాలను కాపాడే దిశగా పార్లమెంటులో పనిచేయలేదు. కోరేగావ్‌లో దళితులపై జరిగిన దాడిని ఖండించే పేరుతో ప్రతిపక్షాలు ఉభయ సభల్లో గొడవచేసి స్తంభింపజేశాయి. గొడవలు, గందరగోళాల అనంతరం కొంత చర్చ జరిపారు. ఎవరి వాదన వారు వినిపించి వెళ్లిపోయారు తప్ప గొడవ ఎందుకు జరిగింది? దానికి కారకులు ఎవరు? ఇలాంటివి జరుగకుండా నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఏ విధంగా వ్యవహరించాలి? అనే అంశంపై స్పష్టత తీసుకురాలేకపోయాయి. ఆయా పార్టీలు తమ వాదన వినిపించటం మినహా సమస్య పరిష్కారానికి కృషి చేయకపోవటం సిగ్గుచేటు. రాజకీయ పార్టీలు, నాయకులు ఒకరినొకరు విమర్శించుకోవటం, పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవటం మినహా అర్థవంతమైన చర్చ జరిపి ప్రజలకు ఆదర్శం కాలేకపోతున్నారు. అందుకే పార్లమెంటులో జరిగే చర్చల నుండి ఎవ్వరు ఏమీ నేర్చుకోలేకపోతున్నారు. వాస్తవానికి పార్లమెంటు చర్చలు ఊకదంపుడు ఉపన్యాసాలుగా మారుతున్నాయి తప్ప ప్రయోజనాలు సాధించే సాధనాలుగా మారటం లేదు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు చట్ట రూపం ఇచ్చే విషయంలో కూడా ఇదే జరిగింది. లోకసభ ఆమోదించిన ట్రిపుల్ తలాక్ బిల్లు, వెనుకబడిన కులాల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లులకు పార్లమెంటు ఆమోదం లభించకపోవటానికి ప్రతిపక్షంతోపాటు అధికారపక్షం కూడా బాధ్యత వహించకతప్పదు.



> **కోరేగావ్‌లో దళితులపై జరిగిన దాడిని ఖండించే పేరుతో ప్రతిపక్షాలు ఉభయ సభల్లో గొడవచేసి స్తంభింపజేశాయి. గొడవలు, గందరగోళాల అనంతరం కొంత చర్చ జరిపారు. ఎవరి వాదన వారు వినిపించి వెళ్లిపోయారు తప్ప గొడవ ఎందుకు జరిగింది? దానికి కారకులు ఎవరు? ఇలాంటివి జరుగకుండా నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఏ విధంగా వ్యవహరించాలి? అనే అంశంపై స్పష్టత తీసుకురాలేకపోయాయి.**

సుప్రీంకోర్టు ఆదేశం మేరకు ఎన్‌డీఏ రూపొందించిన ట్రిపుల్ తలాక్ బిల్లును లోకసభ ఆమోదించినా రాజ్యసభలో ఆమోదం పొందలేకపోయింది. బి.జె.పికి మెజారిటీ ఉన్న లోకసభలో ఈ బిల్లు చర్చకు వచ్చినప్పుడు కాంగ్రెస్ కొద్దిపాటి నిరసనలతో ఆమోదించింది. లోకసభలో ఈ బిల్లుకు తాము ప్రతిపాదించిన సవరణలపై కాంగ్రెస్ ఓటింగ్‌కోసం పట్టుకూడా పట్టలేదు. ఎం.ఐ.ఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ప్రతిపాదించిన సవరణలకు కూడా కాంగ్రెస్ మద్దతు ఇవ్వలేదు. బిల్లులో ట్రిపుల్ తలాక్ ఇచ్చే ముస్లిం పురుషులకు విధించే మూడు సంవత్సరాల శిక్ష క్లాజును సవరించాలని కోరుతూ సవరణ ప్రతిపాదించిన కాంగ్రెస్ దానిపై ఓటింగ్ కోసం ఎందుకు పట్టుపట్టలేదు. లోకసభ ఆమోదించిన ఈ బిల్లు రాజ్యసభకు రాగానే కాంగ్రెస్ వైఖరి పూర్తిగా మారిపోయింది. న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బిల్లును గొడవ మధ్య సభలో ప్రతిపాదించగానే దీనిని సెలెక్ట్ కమిటీకి పంపించాలంటూ సవరణ ప్రతిపాదించింది. ముస్లిం మహిళలకు న్యాయం జరగాలంటే దీనిని సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనంటూ గొడవ చేసింది. లోకసభలో ఆమోదించి రాజ్యసభలో ఎందుకు గొడవ చేస్తున్నారన్న అరుణ్‌జైట్లీ ప్రశ్నకు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పలేకపోయారు. ఇదిలా ఉంటే అధికార పక్షం కూడా దీనిని ప్రతిపక్షం కోరుతున్న విధంగా రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపించి బడ్జెట్ సమావేశాల్లో చట్టరూపం ఇవ్వాలని మొదట భావించింది. ఈ విషయాన్ని కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్షాలకు కూడా తెలియజేసింది. అయితే బి.జె.పి ఆఖరు నిముషంలో తమ మనసు మార్చుకోవటంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. విచిత్రం ఏమిటంటే బి.జె.పి మిత్రపక్షాలైన తెలుగుదేశం, అన్నాడి.ఎం.కె, బిజూ జనతాదళ్ పార్టీలు కూడా ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేయటమే కాదు దీని కోసం కాంగ్రెస్‌తో చేతులు కలిపాయి. ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామి అయిన తెలుగుదేశం నాయకుడు, రాజ్యసభలో పార్టీ పక్షం ఉపనాయకుడు సి.ఎం.రమేష్ ప్రతిపక్షం నాయకుడు గులాం నబీ ఆజాద్‌తో దీనికోసం అంతర్ లాబీలో చర్చలు జరిపారు. అందుకే రాజ్యసభలో కాంగ్రెస్ పక్షం ఉపనాయకుడు ఆనంద్ శర్మ సభలో సెలెక్ట్ కమిటీ తీర్మానం ప్రతిపాదిస్తూ ప్రతిపక్షం తరపున కమిటీలో ఉండే సభ్యుల జాబితాలో సి.ఎం.రమేష్ పేరు కూడా ప్రస్తావించటం గమనార్హం. తెలుగుదేశం, అన్నా డి.ఎం.కె, బిజూ జనతాదళ్ పార్టీలు కాంగ్రెస్‌తో చేతులు కలుపుతుంటే బి.జె.పి అధినాయకత్వం చూస్తూ ఊరుకోవటం ఏమిటి? ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందకపోవటానికి ప్రతిపక్షంతోపాటు అధికార పక్షం కూడా బాధ్యత వహించకతప్పదు. బి.జె.పి తమ మిత్రపక్షాల మద్దతు కూడా నిలబెట్టుకోలేకపోతే బిల్లుకు రాజ్యసభ ఆమోదం ఎలా లభిస్తుంది? బి.జె.పి, కాంగ్రెస్ పార్టీలు చేసిన తెరవెనక రాజకీయాల మూలంగానే ట్రిపుల్ తలాక్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించలేదని చెప్పకతప్పదు.

వెనుకబడిన కులాల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు లోకసభ ఆమోదం లభించకపోవటానికి అధికార పక్షమే పూర్తి బాధ్యత వహించతప్పదు. బి.సి జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును మూడింట రెండు వంతుల మెజారిటీతో లోకసభలో ఆమోదించవలసి ఉండింది. ఇది రాజ్యాంగ సవరణ బిల్లు కాబట్టి దీనిని సాధరణ మెజారిటీతో ఆమోదించేందుకు వీలులేదు. ఈ బిల్లును గతవారం బుధ, గురు, శుక్రవారాల్లో లోకసభ కార్యక్రమాల్లో చేర్చారు. భారీ మెజారిటీతో ఆమోదించేందుకు బి.జె.పి అధినాయకత్వం తమ ఎం.పిలకు విప్ కూడా జారీ చేసింది. అయితే బి.జె.పి ఎం.పిలు లోకసభకు పెద్దఎత్తున గైర్‌హాజరు కావటంతో అధికార పక్షం ఈ బిల్లుపై ఓటింగ్ జరపలేకపోయింది. లోకసభలో బి.జె.పికి భారీ మెజారిటీ ఉన్నా ఎందుకిలా జరిగింది? బి.జె.పి ఎం.పిలు విప్‌ను ఎందుకు బేఖాతరు చేశారు? అనే ప్రశ్నలకు పార్టీ పెద్దలు సమాధానం చెప్పవలసి ఉన్నది. తనను తాను వెనుకబడిన కులాల వ్యక్తిగా చెప్పుకునే నరేంద్ర మోదీ కూడా ఈ బిల్లు విషయంలో ఎందుకు పట్టుదలతో వ్యవహరించలేకపోయారు? శీతాకాల సమావేశాల్లో తాము రెండు చరిత్రాత్మిక బిల్లులు, ట్రిపుల్ తలాక్, బి.సి జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే బిల్లులకు పార్లమెంటు ఆమోదం తీసుకోబోతోన్నామంటూ గొప్పగా చెప్పుకున్న బి.జె.పి తన లక్ష్యాన్ని సాధించటంలో ఘోరంగా విఫలమైంది.

వయోవృద్ధులకు ఆదాయపన్ను పరిమితి పెంచితే మేలు

కేంద్రప్రభుత్వం ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఆదాయపన్ను పరిమితిని, స్లాబులను సవరించి ఆదాయజీవులకు ఊరట కల్పించవలసిన అవసరం ఉంది. చాలాకాలంగా ఆదాయపన్ను స్లాబులను ఈ విధంగా లెక్కిస్తున్నారు. సీనియర్ సిటిజన్ (60-80 ఏళ్ల లోపు ఉన్నవారు, చాలా సీనియర్ సిటిజన్స్ (80 ఏళ్లకు పైబడినవారు)కు పన్ను రాయితీలలోను స్లాబ్స్‌లోను మార్పులు చేస్తున్నారు. ఈ పద్ధతికి స్వస్తి చెప్పాలి. ఎందుకంటే రానున్న గంటలో ఏం జరుగుతుందోనన్న భయంతో గడిపే సీనియర్ సిటిజన్లగురించి ఆర్థిక మంత్రి, ప్రధాని ఆలోచించకపోవడం బాధాకరం. ఆదాయపన్ను చెల్లించేవారంతా ప్రభుత్వ ఉద్యోగులైతే కొంతలో కొంత ప్రభుత్వ సహాయం అందుతుంది. ఇక ప్రైవేటు ఉద్యోగులకైతే అనుక్షణం కష్టాలే. రోగాలపాలైతే ఆస్పత్రుల చుట్టూ తిరిగి డబ్బు ఖర్చు చేసుకోక తప్పదు. ప్రపంచబ్యాంకు గణాంకాల ప్రకారం మనదేశంలో మహిళల సగటు ఆయుర్దాయం 69.9, పురుషుల సగటు ఆయుర్దాయం 66.9 సంవత్సరాలు. ప్రస్తుత సమాజంలో ఎందరు 80 ఏళ్లకు పైబడి జీవిస్తున్నారు. వారిలో ఏటా 5 లక్షల ఆదాయం ఉన్నవారు ఇంకెందరు. అందుకే వ్యక్తిగత ఆదాయపన్ను స్లాబుల వయోపరిమితి విషయంలో మార్పులు అవసరం. అందుకే 60 ఏళ్ల తరువాత ప్రతి 5 ఏళ్లకు ఒక స్లాబ్ పెడితే సబబు. అప్పుడు ప్రతి టాక్స్ పేయర్‌కి టాక్స్‌లో రాయితీ లభిస్తుంది. ఎలాగా ఉచిత ప్రభుత్వ వైద్య సహాయం అందచేయటల్లేదు. అందుకే ఈ విధంగా ఆదాయపన్ను స్లాబులు ఉంటే మంచిది. 65-70, 70-75, 75-80 ఏళ్ల మధ్యవారికి పన్ను చెల్లింపునకు వయోపరిమితిగా స్లాబులుండాలి. 80 ఏళ్ల పైబడినవారికి అసలు పన్నుబాధ ఉండకూడదు. అయితే వ్యాపారులకు ఈ రాయితీ ఉండనవసరం లేదు. ప్రభుత్వ ఖర్చులో 0.0001 శాతం కన్నా తక్కువ పొదుపు చేస్తే సీనియర్ సిటిజన్స్ అంతా కట్టే ఆదాయపన్ను కన్నా ప్రభుత్వ ఖజానాలో ఎక్కువే మిగులుతుంది. పాత పద్ధతులనే అనుసరిస్తే మోదీ, జైట్లీల గొప్పతనం, పనితనం ఏమున్నట్లు. నూతన పద్ధతులు, పరిమితులు, రాయితీలు ఇస్తేనే ప్రజలకు లాభం, వారికి కీర్తి దక్కుతాయి. రాబోయే బడ్జెట్‌లోనైనా సీనియర్ సిటిజన్లకు మేలు కలిగే నిర్ణయాలు తీసుకోండి. వయోవృద్ధులకు మేలు చేసేలా ఆదాయపన్ను రాయితీలు కల్పించండి. వృద్ధాప్యంతో వచ్చే రోగాలకు మందులు కొనుక్కునేందుకైనా కనీసం ఆ రాయితీవల్ల మిగిలే సొమ్ము ఉపయోగపడుతుంది. ఇలా వారికి వెసులుబాటు కల్పించడం ప్రభుతం కనీస ధర్మం. ఎనభై ఏళ్ల పైబడినవారినుంచి కూడా పన్ను వసూలు చేయడం భావ్యం కాదు. వయోవృద్ధులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకుని వారి ఆశీస్సులు పొందడం మోదీలాంటి నేతలకు అవసరం.

-చామర్తి వెంకట రామకృష్ణ

పిన్నరాయుల పెద్దకథ

భారతదేశంలోని సర్వాంగ సుందర ప్రదేశాలలో కేరళ ఒకటి. ఇక్కడి నదీనదాలు నారికేళోద్యానాలు సందర్శకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంటాయి. ఇది పరశురాముని భూమి అని పేరు. లోగడ ఆదిశంకరాచార్యులు కాలడి గ్రామం నుంచి బయలుదేరి మొత్తం భారత దేశం పర్యటించి జాతీయ ఏకాత్మతాభావాన్ని కలిగించాడు. ఆ తరువాత నారాయణగురు మాతా అమృతానందమాయి (జాలరి కులస్థురాలు) నిద్రాణమైన ప్రజలలో సామాజిక సమరసతను కల్పించారు. 1940వ దశకంలో కేరళలోకి కమ్యూనిజం ఒక కాన్సర్ వలె ప్రవేశించింది. క్రమక్రమంగా ఇక్కడ సమ్మెలు లాకౌట్లు హత్యా రాజకీయాలు మొదలైనాయి. భారత దేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమూ, ఒక రాజ్యాంగమూ ఏర్పడిన తరువాత కూడా ఇక్కడ సాయుధ పోరాటం ద్వారానే రాజ్యాధికారం సంపాదించుకోవాలని ప్రచారం చేశారు. ఇక్కడ కొన్ని ప్రాంతాలలో జిహాదీ ఉగ్రవాద ముఠాలు చురుకుగా పని చేస్తున్నాయి. సిరియాలో ఖలీఫా సామ్రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో పోరాడుతున్న నరహంతక మతసంస్థ ఐసిస్‌లో కేరళ కమ్యూనిస్టులు జతకట్టారు. కేరళనుండి దుబాయి మీదుగా ఈ ఉగ్రవాద జిహాదీ మూకలు రిక్రూట్ చేయబడుతున్నాయి. ఎ.కె.ఆంటోనీ వంటి వారి నేతృత్వంలో ఇక్కడ క్రైస్తవ సామాజిక వర్గాలు కూడా సంఘటితంగా ఉన్నాయి.

ఆర్.ఎస్.ఎస్. నాయకుడు ఎం.ఎస్.గోల్వాల్కర్ 1950 ప్రాంతంలో కేరళ పర్యటనకు వెళ్లినప్పుడు ఒక వ్యక్తిని హత్య చేసి కమ్యూనిస్టులు ఆయనకు స్వాగతం పలికారు. 'హింసతో కాక ప్రేమతో మానవ హృదయాలను జయించండి' అని ఆ రోజున కేరళ ప్రజలు గోల్వార్కర్ సందేశమిచ్చాడు. ఐతే హింస, ద్వేషాల్ని అప్పటికే మార్క్సిజం కేరళలో బాగా నూరిపోసింది.

కేరళలో కన్నూరు జిల్లా కేంద్రానికి సమీపంలో పినరాయ్ అనే ఒక కుగ్రామం ఉంది. అక్కడ ఒక నిరుపేద కుటుంబంలో విజయన్ అనే యువకుడు జన్మించాడు. ఈయనకు మాతృభాష మలయాళం తప్ప హిందీ-ఇంగ్లీషు వంటి భాషలు రావు. సిపిఎం కార్యకర్తగా ఆయన అంచెలు అంచెలుగా ఎదిగాడు. 'అడ్డం వచ్చిన వారిని అడ్డంగా నరకండి' అని కేరళ ప్రజలకు ఇతడు పిలుపునిచ్చాడు. పినరాయ్ గ్రామానికి సమీపంలో వరపురం అనే గ్రామంలో 1939లో మొదటిసారి కమ్యూనిస్టు జెండా ఎగిరింది. అక్కడి నుండి క్రమక్రమంగా చుట్టుపక్కల గ్రామాలల్లో కమ్యూనిస్టులు అలజడి సృష్టించారు. తమ గ్రామాలల్లో ఎర్రజెండా తప్ప మరేదీ ఎగురకూడదని శాసించారు. ఒకవేళ ఎవరైనా తమ ఆజ్ఞను కాదంటే వారు గ్రామాలు వదలిపోవలసిందే!! విచిత్రం ఏమంటే ఇటు సిపిఎం, అటు కాంగ్రెసు పార్టీ కూడా ఈ ఉగ్రవాద జిహాదీ ముఠాల మద్దతులోనే గత అరవై సంవత్సరాలుగా రాజ్యపాలన చేస్తున్నాయి.

కేరళలోని దేవాలయాల్లో హిందూ సామాజిక బృందాలు కలసి భజనలు చేస్తూ ఉంటాయి. వీటిపై పినరాయ్ విజయన్ నిషేధం విధించాడు. కేరళలోని సామాజిక ఉత్సవం ఓనం పండుగపై ఆంక్షలు పెట్టాడు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఓనం ముగ్గులు వేయకూడదు అని శాసించాడు. ఐతే ప్రభుత్వ ఉద్యోగులు ఈ శాసనాన్ని ధిక్కరించి ముగ్గులు వేశారు. దీనిని విజయన్ భరించలేకపోయాడు. ఒక్క కన్నూరు జిల్లాలోనే 84 మంది ఆర్ఎస్ఎస్ బిజెపి కార్యకర్తలు హత్యకు గురయ్యారు. కేరళలో ఉత్తమన్ పేరుకు తగ్గట్లే ఉత్తముడు. ఇతడొక నిరుపేద కుటుంబంలో జన్మించాడు. ఈయన కుమారుడు రెమిత్ హిందూ సామాజిక సంస్థల కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. వీరుకూడా హత్యకు గురయ్యారు. దీనివెనుక విజయన్ హస్త ముందంటారు. కారణం... కన్నూరు జిల్లాలో ఎర్రజెండా తప్ప మరొకటి ఎగరకూడదు. కేరళలో జరిగిన 280 హత్యలలో 120 మంది ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారు. పినరాయ్ విజయన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాక 16 నెలల కాలంలో 14మంది బిజెపి కార్యకర్తలు హత్య చేయబడ్డారు. గత ఏడాది అక్టోబర్ 3న కన్నూరు జిల్లాలోని పయ్యన్నూర్ నుండి కేరళ ప్రాంత బీజేపీ అధ్యక్షుడు కమ్మునం రాజశేఖరన్ ఒక పాదయాత్ర నిర్వహించాడు. ఈ యాత్ర తొమ్మిది కిలోమీటర్లు సాగింది. పినరాయ్ అనే గ్రామం నుండి కమలం జెండాతో ఊరేగింపు సాగటం విజయన్‌ను దిగ్భ్రాంతికి గురి చేసింది. "జిహాదీ ఉగ్రవాదం నశించాలి. హత్యా రాజకీయాలు ఆపాలి" అంటూ ఊరేగింపులో నినాదాలిచ్చారు. ఈ ఊరేగింపునకు అఖిలభారత బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా హాజరుకావడంతో ఈ సంఘటన జాతీయ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. పినరాయ్ గ్రామంలో ముఖ్యమంత్రి విజయన్ ఇంటికి సమీపంలోనే చంద్రన్ అనే హిందూ సామాజిక కార్యకర్త ఉన్నాడు. అతినినికూడా హత్య చేయించారు. దానితో గ్రామం నుంచి చాలామంది భయంతో ఇతర ప్రాంతాలకు వలసపోయారు. అశోకన్ అనే క్రియాశీల కమ్యూనిస్టు కార్యకర్త. ఈయన కుమార్తె అఖిల. ఈమె లవ్‌జిహాదీకి గురి అయింది. కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. ఐతే సీపీఎం, అఖిలను రక్షించడానికి ముందుకు రాలేదు.

1962లో చైనా భారత్‌పై దండయాత్ర చేసినప్పుడు కమ్యూనిస్టు పార్టీ నిలువునా చీలిపోయింది. రివిజనిస్టులు నశించాలి అంటూ సిపిఐమీద, సిపిఎం కార్యకర్తలు దాడి చేశారు. 1975లో ఇందిరాగాంధీ దేశంపై అత్యవసర పరిస్థితి విధించినప్పుడు సిపిఐ ఇందిరాగాంధీని సమర్థించింది. సిపిఎం మాత్రం వ్యతిరేకించింది. కేరళలో వందలాది హిందూ సామాజిక సంస్థల కార్యకర్తలు అరెస్టు అయినారు. ఇది తర్వాతి కాలంలో పుట్టిన బీజేపీకి పునాదిగా ఉపయోగపడింది. అప్పటివరకు కమ్యూనిస్టుల మాత్రమే పోరాటాలు చేస్తారని నమ్మిన కేరళ ప్రజలు హిందూ జాతీయవాదులు కూడా ప్రాణాలకు తెగించి పోరాడగలరు అని తెలుసుకున్నారు. ఈ దశలో పినరాయ్ విజయన్ హింస ద్వారా రాజ్యాధికారం సంపాదించుకొని తనను వ్యతిరేకించినవారిని హింసించడం మొదలుపెట్టాడు. సొంత పార్టీ నుండి ఎవరైనా బయటకుపోతే ఇదేగతి పడుతుందని చెప్పి భయభ్రాంతులను చేశాడు. ఆమధ్య విశాఖలో జరిగిన సిపిఎం మహాసభలలో పినరాయ్ తాను పార్టీకి ప్రధాన కార్యదర్శి కావాలని ఉవ్విళ్లూరాడు. ఐతే ఈయనకు మలయాళం తప్ప మరే భాష రానికారణంగా ఏచూరి సీతారామశాస్త్రిని పార్టీ ప్రధాన కార్యదర్శిని చేశారు. దీనిని విజయన్ భరించలేకపోతున్నాడు. తన రాజ్యాధికారానికి అడ్డం వస్తాడని సీనియర్ పార్టీ నేత వి.ఎస్.అచ్యుతానందన్ (దర్జీ సామాజిక వర్గానికి చెందిన వృద్ధ నాయకుడు) ఎదగకుండా అణచివేశాడు.

గత ఏడాది నవంబర్ 11న తిరువనంతపురంలో బీజేపీ లక్షమందితో జరిపిన ప్రదర్శన కేరళలో సీపీఎం పునాదులను కదిలించింది. "జిహాదీ ఉగ్రవాదం నశించాలి. హత్యా రాజకీయాలు ఆపాలి' అంటూ నినాదాలతో కేరళను హోరెత్తించారు. దీనివలన వెంటనే కేరళ ప్రభుత్వం పడిపోకపోయినా ఇకమీద హత్యారాజకీయాలు చేయాలంటే ఒకటికి పదిసార్లు ఆలోచించవలసి వస్తుంది. కె.బాలకృష్ణన్ ఒక బంగారం స్మగ్లర్ ఇచ్చిన ఖరీదైన కారులో 'హిందూ వ్యతిరేక ర్యాలీ' నిర్వహించాడు. పేదప్రజల పార్టీ ఈ స్మగ్లింగ్ కారు ఎలా ఉపయోగించింది? అని ప్రశ్నిస్తే ఇది స్మగ్లర్ కారు అని తనకు తెలియదు అని చెప్పాడు. అదేనెల 15న కేరళలో సీపీఎం మంత్రివర్గం నుండి థామస్ చండి అనే మంత్రి భూకబ్జా నేరాల కింద తొలగింపబడ్డాడు. ఇంతకుముందు ఒకరిని లైంగిక నేరాల కింద మరొకరిని ఆర్థిక నేరాల కింద తొలగించారు. ఇదేనా పేదల పార్టీ ప్రభుత్వ నైతికత?? నవంబర్ 12 నవంబరు 2017 నాడు త్రిశూరు జిల్లాలో సైకిల్ మీద పోతున్న ఒక ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను చంపడం ద్వారా ఈ హత్యల సంఖ్య 281కి చేరింది. మృతుని పేరు ఆనంద్. ఇతడిని లోగడ కేరళ ప్రభుత్వం అరెస్టు చేసి జైలులో పెట్టింది. ఇప్పుడు బెయిల్ మీద బయటకు వచ్చాడు.

సైద్ధాంతికంగా ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. కేరళలో బెంగాల్‌లో ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టులు ముస్లిం, క్రైస్తవ వర్గాలతో సన్నిహితంగా ఉన్నారు. జిహాదీ ఉగ్రవాదం అసలు సమస్యే కాదు. హిందూ ఉగ్రవాదమే సమస్య అన్నారు. వైదికభావజాలం నశించాలి, బూర్జువా ఆర్థిక వ్యవస్థ నిర్మూలించబడాలి వంటి నినాదాలు ఇస్తున్నారు. 5 వందల సంవత్సరాల క్రితం జన్మించిన పోతన మహాకవి 'సత్కవుల్ హాలికులైన నేమి' అని స్వయంగా పొలం దున్ని పంట పండించాడు. ఆయన జయంతి ఉత్సవాలు వరంగల్‌లో లోగడ జరిపినప్పుడు ఎందుకు బహిష్కరించారు? ప్రపంచ తెలుగు మహాసభలను ఎందుకు బహిష్కరించారు. అంటే వీరికి తెలుగుభాషా సంస్కృతులు అక్కర లేదని తెలియడం లేదా? రాజకీయంగా ఆ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిన ముఖ్యమంత్రులను, పార్టీలను ఎదుర్కొనవచ్చు. కానీ భాషా సమావేశాలపై ద్వేషం ఎందుకు? భాగవతం, పోతన వ్రాశాడు. అందుకని పోతన సభలు నిషేధించారు. విష్ణువు దుర్మార్గమైన దేవుడు అని కంచ ఐలయ్య ప్రకటించాడు. అందుకని ఉభయ తెలుగు రాష్ట్రాలలో సామ్యవాదులు అతడికి మద్దతు ఇచ్చారు. నేడు చైనా, అమెరికాతో పోటీ పడుతున్న మరొక సామ్రాజ్య వాద విస్తరణకాంక్ష గల దేశం. దానికి వీళ్లు బహిరంగంగా మద్దతు ఇచ్చారు. దేశీయ ఉత్పత్తులను తిరస్కరించడం, చైనా ఉత్పత్తులను ప్రోత్సహించడం చేస్తున్నారు. ఇదంతా కూడా సామ్యవాదమేనా? భారతదేశ వ్యతిరేక ధోరణిలో పని చేయటం సమర్థనీయమా?

-ప్రొ.ముదిగొండ శివప్రసాద్

శిప్ర వాక్యం

ఉత్తరాయణం

ఆ చర్యలు అసమంజసం

అరుణ్ జైట్లీ పేరును ట్విస్ట్ చేస్తూ వ్యంగ్యంగా ట్వీట్ చేసినందుకుగానూ, రాహుల్‌గాంధీపై హక్కుల తీర్మానం ప్రవేశపెట్టాలని రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌ని కోరడం అనుచితం. నిజానికి రాహుల్ ట్వీట్ ఏ విధంగానూ సభ్యుని హక్కుల్ని భంగపరిచేది కాదు. సభలో సభ్యుడికి తన బాధ్యతల నిర్వహణలో పూర్తి స్వేచ్ఛ కల్పించే దిశగా, అందుకు అవరోధం కల్పించేవారిని శిక్షించేలా ఈ ఏర్పాటు మన రాజ్యాంగంలో ఉంది. అంతే తప్ప వారిపై వ్యంగ్యోక్తులు, పరిహాసాలు పూర్తి నిషిద్ధమని కాదు. రాహుల్ హాస్యాన్ని తేలిగ్గా తీసుకుని వదిలేస్తే మంత్రిగారికి, సభకి హుందాగా ఉండేది. పెట్టీకేసు తరహాలో పెద్దశిక్షకి పూనుకోవడం అనవసర ప్రక్రియ. తప్పుడు అన్వయం. లోక్‌సభ స్పీకర్ సరైన నిర్ణయం తీసుకోవాలి. అలాగే కేవలం ఐదువందల రూపాయల వ్యయంతో ఆధార్ వివరాల్ని అడ్డదారిలో సేకరించగలగడం ఎంత సులభమో ట్రిబ్యూన్ పత్రిక ప్రచురించింది. అందుకుగానూ ఆ పత్రికపై ఆ కథనం రాసిన జర్నలిస్టుపై ఆధార్ సంస్థ క్రిమినల్ కేసు పెట్టింది. ఇది సరికాదు. వ్యవస్థలోని లోటుపాట్లు, లోపాలను బయటపెట్టడం పాత్రికేయుల వృత్తిధర్మం. బాధ్యతగా పనిచేసినవారిపై ఇలా కక్షసాధింపునకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థలో చెడు సంప్రదాయం. కేంద్రప్రభుత్వం స్పందించి ఆధార్ సంస్థకు తలంటడం మేలు. వ్యక్తిగత గోప్యతకు భరోసా ఇవ్వకుండా ఇలా వ్యతిరేక చర్యలకు పాల్పడటం భావ్యం కాదు. నిజానికి లోపాలను ఎత్తిచూపిన జర్నలిస్టుకు బహుమతి ఇవ్వాల్సిందిపోయి కేసులు పెట్టడం విడ్డూరం.

-డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

ఎన్‌ఆర్‌ఐల సేవలు మరువలేం

ప్రపంచంలోని పలు దేశాల్లో ఉంటున్న భారతీయులు మాతృదేశానికి ఎనలేని సేవలందిస్తున్నారు. దేశాభివృద్ధిలో వారి పాత్ర గతంకన్నా ఇప్పుడు విస్తృతమైంది. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రవాస భారతీయులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు వీలుగా ఎల్‌ఎం సింఘ్వి అధ్యక్షతన ఏర్పడిన హైలెవల్ కమిటీ ప్రవాసీ దివస్ ప్రతిపాదనను తీసుకువచ్చింది. సాధారణంగా జనవరి 9న ప్రవాసీ భారతీయ దివస్ నిర్వహిస్తారు. 2003 నుంచి ఈ కార్యక్రమం నిర్వహించడం మొదలైంది. జాతిపిత మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుండి స్వదేశానికి వచ్చిన రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి సింగపూర్‌లో ఆసియాన్ దేశాలతో సంబంధాలు ఏర్పడిన పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రవాసీ దివస్ నిర్వహించారు. అమెరికా, కెనడా, సింగపూర్, గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా భారతీయులు ఉన్నారు. మాతృదేశ సేవలో తమవంతు పాత్ర పోషిస్తున్న ప్రవాస భారతీయులకు ఎన్నడూ లేని ప్రాధాన్యతను మోదీ ప్రభుత్వం ఇస్తోంది. దేశాన్ని సాంకేతిక, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో సమున్నత స్థానానికి చేర్చడానికి వారి సేవలు అవసరమని కేంద్రం భావిస్తోంది.

-కె.సతీష్‌రెడ్డి, పరకాల

చెప్పుల దొంగ పాక్

అమెరికాలోని ఎంబసీ వద్ద భారతీయ సంతతి ప్రజల ఆందోళన

వాషింగ్టన్, జనవరి 8: అమెరికాలో పాక్ రాయబార కార్యాలయం వద్ద ఇండియా, ఆఫ్ఘాన్, బలోచ్ సంతతికి చెందిన ప్రజలు సోమవారం పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. 'చెప్పుల దొంగ పాకిస్తాన్' పేరిట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాక్ అంబసీ అధికారులకు పెద్దఎత్తున చెప్పులు సమర్పించే ప్రయత్నం చేశారు. పాక్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారతీయ మాజీ నావికుడు కులభూషణ్ యాదవ్‌ను చూసేందుకు ఆయన కుటుంబం ఇస్లామాబాద్ వచ్చిన సందర్భంలో పాక్ అధికారులు అనుసరించిన అమానవీయ తీరుపై నిరసనకారులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గడ్డకట్టే చలిలోనే పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఆందోళనలో భాగంగా పాక్ రాయబార కార్యాలయ అధికారులకు చెప్పులు సమర్పించేందుకు ప్రయత్నించారు. కులభూషణ్ యాదవ్‌ను విచారించటంలో పాక్ మిలటరీ కోర్టు అంతర్జాతీయ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కిందంటూ నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహించిన అమెరికన్ ఫ్రెండ్స్ ఆఫ్ బలూచిస్తాన్ వ్యవస్థాపకుడు అహ్మర్ ముస్తిఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పుట్టెడు దుఃఖంతో జాదవ్‌ను చూడటానికి వచ్చిన తల్లి, భార్యను పాక్ అధికారులు మానసికంగా హింసించారు. చెప్పులు తీసేయమన్నారు. భార్య మెడలో మంగళసూత్రాలు తీసేశారు. చివరకు నుదుటిన బొట్టు కూడా చెరిపేసి జాదవ్‌ను కలిసేందుకు అనుమతించారు. బయటకు వచ్చేసరికి ఇద్దరి చెప్పులను పాక్ అధికారులు దొంగిలించారు. ఇంతటి అమానవీయ పరిస్థితి ఎక్కడా ఉండదు' అంటూ ముస్తిఖాన్ ఆగ్రహించారు. పెద్దఎత్తున ఏర్పాటుచేసిన సెక్యూరిటీ గదిలో అద్దానికి ఆవలివైపు నుంచే కుటుంబంతో జాదవ్‌ను మాట్లాడించటాన్ని ప్రస్తావిస్తూ 'పాక్ విడుదల చేసిన దృశ్యాలను చూస్తే ఆ దేశంలో మానవత్వం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. పవిత్రమైన మంగళసూత్రాలు, నుదుటిన బొట్టును తీయించేయడాన్ని చూస్తే, భారత సౌభాగ్యనారిని పాక్ ఎంతగా అవమానించిందో అర్థమవుతుంది' అంటూ యూఎస్‌లో హిందూ కమ్యూనిటీ నాయకుడు కృష్ణ గుడిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పాక్ తన వైఖరితో హిందుత్వ నమ్మకాన్ని అవహేళన చేసింది. మానవత్వం ఎంతగా దిగజారిపోయిందో పాక్ అధికారులు ప్రత్యక్షంగా చూపించారు. పాక్ వైఖరిని ప్రపంచ దేశాలు గర్హించాలి' అంటూ నిరసన కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు డిమాండ్ చేశారు.

'మృత్యుంజయుడి'లో ఉద్వేగం!

26/11 పేలుళ్లలో బతికిన బుడతడికి ఇపుడు 11ఏళ్లు ▪ భారత్ సందర్శనకు వస్తున్న ఇజ్రాయెల్ బాలుడు



ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్నప్పుడు కలిసిన మోషే హోల్జ్‌బెర్గ్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు (ఫైల్ ఫొటో)

జెరూసలేం, జనవరి 8: మోషే హోల్జ్‌బెర్గ్ ఇజ్రాయెల్‌కు చెందిన 11 ఏళ్ల బాలుడు.. రెండేళ్ల ప్రాయంలో ఉండగా 2008 నవంబర్ 26న జరిగిన ముంబయి పేలుళ్ల ఘటనలో క్షేమంగా బయటపడి తన సొంత దేశం చేరుకున్నాడు.. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌ను సందర్శించేందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి వస్తున్నాడు.. ముంబయిలో పుట్టిన ఈ బాలుడు తన జన్మస్థలాన్ని చూసేందుకు వస్తున్నందుకు ఎంతో ఉద్వేగానికి లోనయ్యాడు.. భారత్‌ను సందర్శించేందుకు ఎంతో ఆతృతతగా ఎదురుచూస్తున్నాడు..

ముంబయిలోని నారీమన్ హౌస్ (ఛాబద్ హౌస్) వద్ద పాకిస్తాన్‌కు చెందిన లష్కరే సంస్థ ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న బాంబులు పేల్చినపుడు మోషే తల్లిదండ్రులు మరణించారు. అప్పుడు రెండేళ్ల వయసున్న మోషేను అతని బామ్మ సాండ్రా శామ్యూల్స్ ప్రాణాలకు తెగించి కాపాడింది. ఓ గది మెట్లకిందకు మోషేను ఆమె తీసుకువెళ్లడంతో అతను సురక్షితంగా బయటపడ్డాడు. ముంబయిలో పుట్టిన మోషే ఇన్నాళ్లకు మళ్లీ తన జన్మస్థలాన్ని చూసేందుకు భారత్‌కు వెళుతూ ఎంతో భావోద్వేగానికి లోనైనట్లు అతని తాత రబ్బీ షిమన్ చెబుతున్నారు.

గత ఏడాది జూలై 5న జెరూసలేంలో పర్యటించిన భారత ప్రధాని నరేంద్ర మోదీని మోషే కలుసుకుని, తనకు భారత్‌ను సందర్శించాలని ఉందన్న ఆకాంక్షను తెలిపాడు. 'నాకు ముంబయిని చూడాలని ఉంది.. నేను పెద్దయ్యాక అక్కడే నివసిస్తా..' అని మోషే ప్రధాని మోదీకి తెలిపాడు. మోషే మాటలకు నరేంద్ర మోదీ వెంటనే స్పందిస్తూ, భారత్‌ను సందర్శించేందుకు ఎప్పుడైనా రావచ్చునని ఆహ్వానించారు. మోషేకు, అతని కుటుంబ సభ్యులకు దీర్ఘకాలిక వీసాలు మంజూరు చేస్తామని ప్రకటించారు. మోదీని కలిసినపుడు అక్కడే ఉన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కూడా సానుకూలంగా స్పందించారు. తాను భారత్ పర్యటనకు వెళ్లినపుడు తన వెంట రావాలని మోషేకు చెప్పారు. ఆ హామీ మేరకు నెతన్యాహూ పర్యటనలో మోషే పాల్గొనేలా ఇజ్రాయెల్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 15న ముంబయి చేరుకుని తన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటానని మోషే చెబుతున్నాడు. తన పర్యటన సందర్భంగా భారత ప్రధానిని కలుసుకుని కృతజ్ఞతలు తెలియజేస్తానని అంటున్నాడు. ముంబయిలోని ప్రముఖ ప్రాంతాలతో పాటు తన తల్లిదండ్రులు నివసించిన ఇంటిని చూసేందుకు మోషే వస్తున్నాడు. ఛాబద్ హౌస్‌లో డైరెక్టర్లుగా పనిచేసిన మోషే తల్లిదండ్రులు రబ్బీ గవ్రీల్ రివ్కా హోల్జ్‌బర్గ్ ముంబయి పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయారు. ఛాబద్ హౌస్‌లో డైరెక్టర్‌గా పనిచేయాలన్నదే తన ఆకాంక్ష అని మోషే అంటున్నాడు. రెండేళ్ల ప్రాయంలో మోషేను కాపాడిన అతని బామ్మ సాండ్రా సైకాలజిస్టుగా ఇజ్రాయల్‌లో సేవలందిస్తున్నారు. ఆమెకు ఇజ్రాయల్ ప్రభుత్వం గౌరవ పౌరసత్వాన్ని మంజూరు చేసింది.

ఉద్యోగుల వయోపరిమితి కేసు..

ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కోలకు సుప్రీం నోటీసులు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: విద్యుత్ ఉద్యోగులు వయో పరిమిత పెంపు కోర్టు ధిక్కరణ కేసులో సుప్రీం కోర్టు ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలకు నోటీసులు జారీ చేసింది. పదవీ విరమణ వయస్సు పెంపునకు సంబంధించిన అంశంలో వివిధ కార్పొరేషన్ సంస్థలు, సొసైటీలు, గిరిజన, సాంఘిక, గురుకుల విద్యా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో సమానంగా ఏపీ వయో పరిమిత పెంపును అమలు చేయలేదని, ఆయా సంస్థలకు చెందిన ఉద్యోగులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీం కోర్టు ఈ పిటిషన్‌ను విచారించి గత ఏడాది ఆగస్టు 9న 58 ఏళ్లకే పదవీ విరమణ పొంది ఉండి, వారికి ఇంకా పదవీ విరమణ వయస్సు దాటని పక్షంలో వారిని ఉద్యోగాలలో కొనసాగించాలని ఆదేశించింది. అలాగే పదవీ విరమణ వయస్సు వచ్చిన నాటికి గల కాలానికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని వెల్లడించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వులను అమలు చేయలేదని, అమలులో షరతులు పెడుతున్నారని పేర్కొంటూ విద్యుత్ సంస్థల ఉద్యోగులు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ సోమవారం జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది.

కోడి పందేలపై పిటిషన్

కోడి పందేలపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలైంది. కోడిపందేల నిర్వహించ వద్దంటూ ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై బీజేపీ నాయకుడు రఘురామ కృష్ణంరాజు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుప్రీం కోర్టులో కోడిపందాలపై పిటిషన్ పెండిగ్‌లో ఉండగా హైకోర్టు ఏ విధంగా ఆదేశాలు జారీ చేస్తుందని ఆ పిటిషన్‌లో ప్రశ్నించారు. న్యాయవాది గల్లా సతీష్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

సముద్ర మార్గంలో హజ్ యాత్ర

భారత్ ప్రతిపాదనకు సౌదీ ప్రభుత్వం ఆమోదం ▪ మక్కా వెళ్లే మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు: నఖ్వీ

న్యూఢిల్లీ, జనవరి 8: హజ్ యాత్రకు వెళ్లే భారతీయులకు దూర, భారం తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ వెల్లడించారు. సౌదీ అరేబియా హజ్, ఉమ్రాహ్ మంత్రి మహ్మద్ సలేహ్ బిన్ తాహెర్ బెంటన్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ మధ్య ఆదివారం మక్కాలో యాత్రకు సంబంధించిన ద్వైపాక్షిక వార్షిక ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో యాత్రికులను సముద్ర మార్గం ద్వారా హజ్‌కు పంపాలన్న భారత్ ప్రతిపాదనకు సౌదీ అరేబియా ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి నఖ్వీ సోమవారం ఇక్కడ వెల్లడించారు. జెడ్డాకు సముద్ర మార్గంద్వారా భక్తులు వెళ్లేందుకు వీలుగా సౌదీ అరేబియా ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. 23 ఏళ్ల క్రితం సముద్ర మార్గం ద్వారా మక్కా చేరేవారు. కొన్ని కారణాలు రీత్యా దాన్ని ఆపేశారు. ఇప్పుడు దాన్ని పునఃప్రారంభించాలని ఇరు దేశాలు నిర్ణయించారు. సౌదీ మంత్రి బెంటెన్‌తో సమావేశం ఫలప్రదమైందని నఖ్వీ ప్రకటించారు. యాత్రికులకు సంబంధించి ఇరుదేశాల ఉన్నతాధికారులు చర్చిస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించిన మీదట ఓ నిర్ణయం తీసుకుంటారన్న మంత్రి 'రానున్న రోజుల్లో హజ్‌కు సముద్ర మార్గం గుండానే వెళ్లొచ్చు' అని అన్నారు. అయితే ఇది ఏ సంవత్సరం నుంచి మొదలవుతుందీ అన్నది ఆయన వెల్లడించలేదు. ప్రస్తుతం హజ్ యాత్రకు విమానాల ద్వారానే వెళ్తున్నారు. మక్కా వెళ్లే యాత్రికులకు ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వడాన్ని సుప్రీం కోర్టు వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. 2022 నాటికి సబ్సిడీ విధానాన్ని రద్దుచేయాలని 2013లో సుప్రీం కోర్టు ఆదేశించడంతో కేంద్రం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. దీంతో 2,300 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న జెడ్డాకు ముంబయి నుంచి వెళ్లాలంటే కేవలం నాలుగు గంటలే పడుతుంది. మోడరన్ షిప్‌లలో నాలుగు నుంచి ఐదువేల మంది ప్రయాణించవచ్చు. అలాగే హజ్ వెళ్లాలనుకునే మహిళలకు ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించాలని మొట్టమొదటిసారిగా నిర్ణయించినట్టు నఖ్వీ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు 'మెహ్రాం' (మగవాళ్లతో కలిసి) వెళ్లేవారు. ఇప్పుడు దానికి స్వస్తిచెప్పి మహిళలకోసం ప్రత్యేకంగా మహిళా సహాయకులను నియమించినట్టు మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది మెహ్రాం లేకుండా హజ్‌కు వెళ్తామని 1300 మంది దరఖాస్తు చేసుకున్నట్టు నఖ్వీ తెలిపారు. లాటరీ విధానం ద్వారా వారిని ఎంపిక చేసి మక్కా పంపుతామని మైనారిటీ మంత్రి పేర్కొన్నారు.



సౌదీ అరేబియా పర్యటనలో ఆ దేశ హజ్, ఉమ్రాహ్ మంత్రి మహ్మద్ సలేహ్ బిన్ తహెర్ బెంటన్‌తో సముద్రమార్గంలో హజ్ యాత్రపై ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ

బెయిల్‌కోసం త్వరలో లాలూ పిటిషన్

రాంచీ, జనవరి 8: పశుదాణా కేసులో శిక్షపడి ప్రస్తుతం జైలులో ఉన్న రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ అధినేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ బెయిల్ కోసం ఝార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించనున్నారు. కొద్ది రోజుల్లోనే లాలూ తరపున బెయిల్ పిటిషన్ వేస్తానని ఆయన తరపు న్యాయవాది ప్రభాత్‌కుమార్ సోమవారం మీడియాకు తెలిపారు. సిబిఐ కోర్టు ఇచ్చిన తీర్పును క్షుణ్ణంగా చదివాక వచ్చే శుక్రవారం లేదా సోమవారం నాడు బెయిల్ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. 'తన సోదరి మరణించడంతో లాలూ పెరోల్‌కోసం దరఖాస్తు చేస్తారా?' అని విలేఖరులు ప్రశ్నించగా, 'ఆ విషయం ప్రస్తుతం పరిగణనలో లేదు' అని భరత్‌కుమార్ సమాధానమిచ్చారు. దేవ్‌గఢ్ ట్రజరీలో 89.27 కోట్ల కుంభకోణానికి సంబంధించి లాలూను సీబీఐ కోర్టు దోషిగా ప్రకటించడంతో ఆయనను గత నెల 23న రాంచీలోని బిర్సా ముండా జైలుకు తరలించారు. ఆయనకు మూడున్నరేళ్ల జైలుశిక్షను విధిస్తూ ఈ నెల 6న న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చింది. లాలూకు న్యాయస్థానం జైలు శిక్ష విధించడం ఇది రెండోసారి. చైబసా ట్రజరీలో 37.7 కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగంపై 2013 సెప్టెంబర్‌లో ఆయనకు అయిదేళ్ల జైలుశిక్ష పడింది. రెండున్నర నెలల జైలు జీవితం అనంతరం లాలూకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మరో మూడు దాణా కేసులు ఆయనపై ఇంకా విచారణ దశలో ఉన్నాయి.



పాకిస్తాన్ ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన 147 మంది భారత జాలర్లు సోమవారం వాఘా సరిహద్దు దాటి భారత్‌లో ప్రవేశించిన అనంతరం మాతృభూమికి మొక్కుతున్న దృశ్యం.

చైతన్యరథ సారథులు విప్‌లు

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్

ఉదయ్‌పూర్ (రాజస్థాన్), జనవరి 8: చట్టసభల్లో తమ పార్టీ సభ్యులను నియంత్రించడమే కాదు, వారిని చైతన్యవంతం చేయడం విప్‌ల బాధ్యత అని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖామంత్రి అనంత్‌కుమార్ పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో 18వ అఖిల భారత విప్‌ల సదస్సును సోమవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థ అత్యంత ఉత్తమమైనదని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లాలంటే చట్టసభలు సజావుగా పనిచేయాలన్నారు. ఇందుకు విప్‌లదే కీలక బాధ్యత అన్నారు. తమ తమ పార్టీల సభ్యులను చట్టసభల్లో నియంత్రించడం ఒక్కటే విప్‌ల పని కాదని, వారిని చైతన్యపరచడం విప్‌ల విధి అన్నారు. కేంద్రంతో పాటు 19 రాష్ట్రాలకు చెందిన విప్‌లు పాల్గొంటున్న ఈ సదస్సును 'ఇంద్రధనుసు'గా ఆయన అభివర్ణించారు. చట్టసభల్లో తాము విధులు నిర్వహించినపుడు ఎదురయ్యే అనుభవాలను,సవాళ్లను విప్‌లు పరస్పరం చర్చించుకోవడం ఎంతో అవసరమని కేంద్ర మంత్రి అన్నారు. ఒక రాజకీయ పార్టీకి చెందిన సభ్యులు చట్టసభలో ఎలా నడచుకోవాలి? పార్టీ నిర్ణయాలను ఎలా అనుసరించాలి? అనే అంశాలను పర్యవేక్షించడం ఒక్కటే విప్‌ల బాధ్యత కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల, శాసనాల పట్ల తమ పార్టీ సభ్యుల్లో చైతన్యం కలిగించేందుకు విప్‌లు చొరవ చూపాలన్నారు. పార్లమెంటరీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో అవసరమన్నారు.


చట్టసభల్లో జరిగే చర్చలు సుహృద్భావంగా, ఉపయుక్తంగా ఉండాలని సదస్సులో పాల్గొన్న రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజె అన్నారు. చట్టసభలను సమర్థవంతంగా నడపడంలో విప్‌ల బాధ్యత ఎంతో ఉందన్నారు. 1857 నుంచి 1947 వరకూ స్వాతంత్ర్య సమరంలో కీలక ఘట్టాలను తెలిపే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. సోమవారం జరిగిన సదస్సులో రెండు అంశాలకు సంబంధించి విప్‌లు చర్చించారు. గతంలో జరిగిన రెండు సదస్సుల అనంతరం తీసుకున్న చర్యలు గురించి చర్చించారు. చట్టసభలను మరింత ఫలవంతంగా నిర్వహించేందుకు విప్‌లు తమతమ అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నారు. చట్టసభల్లో డిజిటలీకరణ, కాగిత రహితంగా కార్యకలాపాల నిర్వహణ, ఈ-విధాన్‌కు సంబంధించి మంగళవారం విప్‌లు చర్చిస్తారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయల్, జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్‌సింగ్, రాజస్థాన్ హోం శాఖామంత్రి గులాబ్‌చంద్ కటారియా, రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి రాజేంద్ర రాథోడ్ పాల్గొన్నారు.

25న పద్మావత్ విడుదల

ముంబయి, జనవరి 8: అనేక అవాంతరాలు, విమర్శలు, వివాదాల తరువాత సంజయ్ లీలా బన్సాలీ రూపొందించిన 'పద్మావత్' చిత్రం ఈ నెల 28 ప్రేక్షకుల ముందుకు రానుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికెట్ ధ్రువీకరణ లభించిందని వయాకామ్ 18 మోషన్ పిక్చర్స్ వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఏ వివాదాలు తలెత్తకుండా అంతా సవ్యంగా ఉంటే ఈ చిత్రాన్ని డిసెంబర్ 1న విడుదల చేయాలని దర్శక, నిర్మాత భావించారు. అయితే ఇప్పటివరకూ చిత్రం విడుదలపై బన్సాలీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం. వయాకామ్ 18 మోషన్ పిక్చర్స్ వర్గాలు రిపబ్లిక్‌డే ముందురోజు అంటే జనవరి 25న చిత్రం విడుదలవుతుందని వెల్లడించారు. మరోపక్క జనవరి 25న అక్షయ్‌కుమార్ హీరోగా నటించిన 'ప్యాడ్మన్' రిలీజవుతోంది. అదే రోజు బన్సాలీ పద్మావత్‌ను విడుదల చేయడం గమనార్హం. 'పద్మావత్ విడుదలను నా చిత్రానికి పోటీగా భావించడం లేదు. ఆ వారమంతా ప్రాధాన్యత గలదే. అందుకే శుక్రవారం 25ను ఎంపిక చేసుకుని ఉంటారు. ఏ రోజు రిలీజ్ చేసుకోవాలన్న హక్కు అందరికీ ఉంటుంది. ఈ విషయాన్ని నేను పట్టించుకోను' అని అక్షయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్యాడ్మన్ చిత్ర నిర్మాత ప్రేరన్ అరోరా కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. 'సినిమా బావుంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. రెండూ పెద్దచిత్రాలే అయినా ఏది బావుంటే అదే ఆడుతుంది' అని ఆమె అన్నారు. కాగా మనోజ్ బాజ్‌పాయి నటించిన 'ఐయార్య' రిపబ్లిక్ డే రోజు విడుదల కావల్సి ఉండగా ఫిబ్రవరి 9కి వాయిదా వేసుకున్నారు.

క్షిపణి ప్రయోగాలకు కిమ్ స్వస్తి చెప్పాల్సిందే

స్పష్టం చేసిన ఇండో-అమెరికన్ రాయబారి నిక్కీ హేలీ



వాషింగ్టన్, జనవరి 8: చర్చల ప్రక్రియ ప్రారంభించాలంటే ఉత్తర కొరియా క్షిపణలు, అణ్వస్త్రాల ప్రయోగాలకు స్వస్తి పలకాలని ఐక్యరాజ్యసమితిలోని ఇండో-అమెరికన్ రాయబారి నిక్కీ హేలీ తేల్చిచెప్పారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో ఫోన్‌లో మాట్లాడతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు స్పందిస్తూ, అణుయుద్ధం వస్తే ప్రపంచం ఏమవుతుందో అన్న విషయాన్ని కిమ్ తెలుసుకోవడం లేదన్నారు. అమెరికాలోని ఏ ప్రాంతంపైనైనా దాడి చేసేందుకు అణ్వస్త్రాలను ప్రయోగించేలా తన టేబుల్‌పై 'బటన్' ఉందని కిమ్ చేసిన హెచ్చరికకు దీటుగా- 'అంతకన్నా పెద్ద బటన్ తన గదిలో ఉంద'ని ట్రంప్ పేర్కొనడాన్ని నిక్కీ సమర్థించారు. ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలా కిమ్ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, ఉత్తర కొరియా అధ్యక్షుడితో చర్చలకు సిద్ధమేనని ట్రంప్ ట్వీట్ చేశారని ఆమె గుర్తు చేశారు. 'కిమ్‌ను కాళ్లమీద నిలబెట్టేలా' ట్రంప్ వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. చర్చలకు సిద్ధమని ట్రంప్ ప్రకటించడం శుభపరిణామమే అయినా, అందుకు తగ్గట్టుగా కిమ్ కొన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. క్షిపణలు, అణ్వస్త్రాల ప్రయోగాలను నిలిపివేస్తేనే చర్చలకు మార్గం సుగమమవుతుందన్నారు.

కిమ్‌తో చర్చలకు సిద్ధమంటూ ట్రంప్ ప్రకటించడాన్ని 'అమెరికా విధానాల్లో మార్పుగా భావించాలా?' అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా- 'మేం వెనక్కి తగ్గడం అన్న ప్రసక్తే లేదు.. ట్రంప్ చెప్పింది సబబే.. ఉత్తర కొరియాతో చర్చలు జరపాల్సిన సమయం అంటూ ఒకటి వస్తుంది.. అయితే అణ్వాయుధాలపై నిషేధం విధిస్తున్నట్లు కిమ్ స్పష్టం చేయాల్సి ఉంటుంది.. ఇవన్నీ జరిగితేనే చర్చలకు అవకాశం ఉంటుంది..' అని నిక్కీ స్పష్టం చేశారు. 'పాతికేళ్ల జరిగిన దానిని పునరావృత్తం చేయాలని మేం భావించడం లేదు.. చర్చల పేరిట ఒక చోట సమావేశం కావడం, మేం నిధులు కేటాయించడం.. సహాయం పొందినవారు చివరికి మోసం చేయడం.. ఇవన్నీ ఇకముందు ఉండవు' అన్నారు. 'అమెరికాను భద్రంగా ఉంచడానికి మేం ఏం చేశామో కొరియా ద్వీపకల్పాన్ని అణురహిత ప్రాంతంగా మార్చాలన్నదే మా ధ్యేయం..' అని ఆమె అన్నారు.



ఏమిటీ ఆకాశంలో వింత జంతువులు అంటూ ఆశ్చర్యపోతున్నారా.. అదేంకాదు.. అవన్నీ గాలిపటాలే.. అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ పతంగుల పండగలో ఔత్సాహికులు తయారు చేసిన నమూనాలవి. గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ఆదివారం ఈ పతంగుల పండుగను ప్రారంభించారు.

భారతీయుడికి జాక్‌పాట్

లాటరీలో 3.2 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ

దుబాయి, జనవరి 8: ఇక్కడ ఓ కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న భారతీయుడు లాటరీలో జాక్‌పాట్ కొట్టాడు. 21 మిలియన్ల ధిర్హాం అంటే 3.2 మిలియన్ల అమెరికా డాలర్ల మనీ ప్రైజ్ లభించింది. 2002 నుంచి హరికృష్ణ వి నాయర్ (42) కుటుంబంతోపాటు దుబాయినే ఉంటున్నాడు. అబుదాబీ ప్రభుత్వం ఏటా తీసే డ్రాలో ఇప్పటికి పదిమంది భారతీయులకు మనీ ప్రైజ్ వచ్చింది. అందులో ఎనిమిది మంది ఒక్కొక్కరు మిలియన్ ధిర్హాంలు వచ్చాయి. డాలర్ల లెక్కన చూస్తే 2.7 లక్షలు. అక్టోబర్ మెగా డ్రా సంగతది. ఆగస్టులో మరొక భారతీయుడికి ఏకంగా 5 మిలియన్ ధిర్హాంల నగదు బహుమతి పొందాడు. ఇంతకుముందు కూడా రెండు సార్లు టికెట్లు కొన్నానని అయితే ఎప్పుడూ తగల్లేదని నాయర్ చెప్పాడు. డ్రాలో జాక్‌పాట్ కొట్టినట్టు ఆదివారం తెలిసి అతడి కుటుంబం ఉబ్బితబ్బిబ్బయింది. ప్రతిసారీ కుటుంబ సభ్యులతో కలిసి విదేశీ పర్యటనకు వెళ్లానని ఆశపడతాని అయితే ఈసారి ప్రైజ్‌మనీతో ఆ కోరిక తీర్చుకుంటానని ఖలీజ్ టైమ్స్‌కు చెప్పాడు. త్వరలోనే దానికి ప్లాన్ చేసుకుంటానని కేరళకు చెందిన నాయర్ తెలిపాడు. 'నా ఏడేళ్ల కుమారుడికి మంచి చదువు చెప్పిస్తా. భారత్‌లో మరొక ఇల్లు కొనుగోలు చేస్తా. నా తల్లిని, అత్తగారిని మరింత బాగా చూసుకుంటా' అని బిజినెస్ మేనేజర్ పేర్కొన్నారు. 'పేద ప్రజలను ఆదుకోవాలని ఎప్పుడూ అనుకుంటాను. దేవుని దయవల్ల ప్రైజ్‌మనీ వచ్చింది. ఇప్పుడు అందులో కొంతమొత్తం ధార్మిక కార్యక్రమాలకు వెచ్చిస్తా' అని నాయర్ తెలిపారు. తన భర్త ఆఫీసు ఉద్యోగులు డ్రా వార్త చెప్పగానే ఎంతో ఉద్వేగానికి లోనయ్యానని నాయర్ భార్య తెలిపింది. బిజినెస్ డెవలప్‌మెంట్‌గా పనిచేస్తున్న తన భర్త నగదును ఎలా వినియోగించాలో బాగా తెలుసని ఆమె చెప్పుకొచ్చారు.

'అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించండి'

న్యూఢిల్లీ, జనవరి 8: దేశవ్యాప్తంగా అమలవుతున్న విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను అగ్రవర్ణ పేదలకూ వర్తింపజేయాలని, అందుకు అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఫరీదాబాద్‌లో జరిగిన ఆల్ ఇండియా యాంటీ రిజర్వేషన్ ఫ్రంట్ నిర్వహించిన సదస్సులో కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు. కుల, మత రిజర్వేషన్లను సమీక్షించి, ఆర్థిక వెనకబాటు ప్రాతిపదిక రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



బిజినెస్

దిగజారుతున్న సేవల నాణ్యత

- పెరుగుతున్న కాల్ డ్రాప్స్.. ఆందోళనలో ప్రభుత్వం
- సమస్యపై చర్చించేందుకు రేపు ఆపరేటర్లతో డీఓటీ భేటీ
- అదే రోజు ట్రాయ్‌తోనూ సమావేశం



అరుణా సుందరరాజన్

న్యూఢిల్లీ, జనవరి 8: మొబైల్ ఫోన్లలో సంభాషణలకు సంబంధించి 'కాల్ డ్రాప్స్' పరిస్థితి రోజురోజుకు దిగజారుతుండటం పట్ల ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. దీంతో ఈ అంశంపై చర్చించేందుకు ఈ సేవలు అందిస్తున్న ఆపరేటర్లు, వాటిని పర్యవేక్షిస్తున్న నియంత్రణ సంస్థ టెలికం రెగ్యులేటరి అథారిటి ఆఫ్ ఇండియా (ట్రాయ్)తో టెలికాం శాఖ (డీఓటీ) ఈ నెల 10న సమావేశం కానుంది. టెలికాం శాఖ కార్యదర్శి అరుణా సుందరరాజన్ సోమవారం ఇక్కడ ఈ విషయం చెప్పారు. భారత్ నెట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విడిగా విలేఖరులతో మాట్లాడుతూ కాల్ డ్రాప్స్‌కు సంబంధించి ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిపై చర్చించేందుకు టెలికాం కంపెనీల కార్యనిర్వాహక అధికారుల (సీఈఓ)తో బుధవారం సమావేశం అవుతున్నట్టు తెలిపారు. ట్రాయ్ నిరుడు అక్టోబర్‌లో అమలు చేసిన కొత్త సేవల నాణ్యత నియమాల గురించి కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. 'కాల్ క్వాలిటీ'కి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు అదే రోజు (బుధవారం) డీఓటీ ప్రత్యేకంగా ట్రాయ్‌తో సమావేశం అవుతుందని ఆమె చెప్పారు. కాల్ డ్రాప్స్ పరిస్థితిపై ప్రభుత్వ ఆందోళనను టెలికాం ఆపరేటర్లకు తెలియజేయాలని తాము భావిస్తున్నామని, అందరూ కలిసి పరిస్థితిని చక్కదిద్దడానికి చర్యలు తీసుకోవాలని సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించనున్నామని అరుణా సుందరరాజన్ తెలిపారు. కాల్ క్వాలిటి పరిస్థితి దిగజారిందని, దీనికి సంబంధించి ఫిర్యాదులు చేస్తున్న వినియోగదారుల సంఖ్య పెరుగుతోందని ఆమె చెప్పారు. గత రెండేళ్లుగా టెలికాం రంగంలో సేవల నాణ్యత ప్రధాన సమస్యగా మారిందని ఆమె తెలిపారు. కాల్ డ్రాప్ అయినప్పుడు ఒక్కో కాల్‌కు ఒక రూపాయి చొప్పున సంబంధిత వినియోగదారులకు పరిహారంగా చెల్లించాలని కూడా ట్రాయ్ 2016లో టెలికాం ఆపరేటర్లను ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను తరువాత సుప్రీంకోర్టు కొట్టివేసింది. దేశవ్యాప్తంగా అదనపు మొబైల్ టవర్లను ఏర్పాటు చేయడం వంటి చర్యలను తక్షణమే తీసుకోవడం ద్వారా కాల్ క్వాలిటీని పెంచాలని డీఓటీ గత కొన్ని నెలలుగా ఏర్పాటు చేసిన సమావేశాలలో టెల్కోలను ఆదేశించింది.

సరికొత్త శిఖరాలకు సూచీలు

- మార్కెట్లలో భారీగా కొనుగోళ్లు
- 34,353 పాయింట్లకు చేరిన సెనె్సక్స్
- 10,624 పాయింట్లకు పెరిగిన నిఫ్టీ

ముంబయి, జనవరి 8: మూడో త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు, స్థూలార్థిక గణాంకాలు, రానున్న బడ్జెట్ సానుకూలంగా ఉంటాయనే ఆశావాదంతో ఉన్న మదుపరులు ఈ వారం తొలి రోజు సోమవారం భారీగా షేర్ల కొనుగోలుకు పూనుకోవడంతో దేశీయ మార్కెట్ సూచీలు పుంజుకొని, జీవిత కాల గరిష్ఠ స్థాయిలకు చేరుకున్నాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెనె్సక్స్ 199 పాయింట్లు పుంజుకొని, 34,352.79 పాయింట్ల వద్ద ముగిసి రికార్డు సృష్టించగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ తొలిసారి 10,600 పాయింట్ల మార్కును అధిగమించింది. దేశీయ, విదేశీ మదుపరులు నిలకడగా కీలకమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజి (ఐటీ), క్యాపిటల్ గూడ్స్, ఆరోగ్య సంరక్షణ, మెటల్ కంపెనీలకు చెందిన షేర్లను కొనుగోలు చేయడంతో ఈ రెండు కీలక స్టాక్ మార్కెట్ సూచీలు సరికొత్త గరిష్ఠ స్థాయిలకు చేరుకున్నాయి. 30 షేర్లతో కూడిన సెనె్సక్స్ సోమవారం హెచ్చు స్థాయి వద్ద ప్రారంభమయి, మరింత పైకి ఎగబాకి ఇంట్రా-డే రికార్డు గరిష్ఠ స్థాయి 34,385.67 పాయింట్లను తాకింది. జనవరి 5వ తేదీన ఈ సూచీ చేరిన ఇంట్రా-డే గరిష్ఠ స్థాయి 34,188.85 పాయింట్ల రికార్డును సోమవారం అధిగమించింది. అయితే ఈ అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడంతో సెనె్సక్స్ కొంత తగ్గిపోయి, చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 198.94 పాయింట్లు (0.58 శాతం) పెరిగి, 34,352.79 పాయింట్ల వద్ద స్థిరపడింది. సెనె్సక్స్ జనవరి అయిదో తేదీ రికార్డు అయిన 34,153.85 పాయింట్లను అధిగమించింది.

50 షేర్లతో కూడిన నిఫ్టీ సోమవారం ఇంట్రా-డేలో సరికొత్త గరిష్ఠ స్థాయి 10,631.20 పాయింట్లకు చేరుకుంది.





జనవరి 5వ తేదీనాటి ఇంట్రా-డే గరిష్ఠ స్థాయి 10,566.10 పాయింట్లను అధిగమించింది. అయితే ఈ సూచీ తరువాత స్వల్పంగా పడిపోయి 10,623.60 పాయింట్ల వద్ద ముగిసింది. అయినప్పటికీ, క్రితం ముగింపుతో పోలిస్తే నిఫ్టీ 64.75 పాయింట్లు (0.61 శాతం) పుంజుకొని జీవిత కాల గరిష్ఠ స్థాయి 10,623.60 పాయింట్ల వద్ద ముగిసింది. జనవరి అయిదో తేదీ నాటి 10,558.85 పాయింట్ల రికార్డు ముగింపును ఛేదించింది.

ప్రపంచ స్టాక్ మార్కెట్లలో నెలకొన్న సానుకూల ధోరణికి తోడు మూడో త్రైమాసిక కార్పొరేట్ ఆదాయాలపై సానుకూల అంచనాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు సరికొత్త గరిష్ఠ స్థాయిలకు చేరాయి. ఈ ఆర్థిక సంవత్సర స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) అంచనాలో కోత విధిస్తూ సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సీఎస్ఓ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాలు దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపించలేదు. కొత్త సంవత్సరంలో దేశీయ స్టాక్ మార్కెట్లలో గణనీయంగా పెట్టుబడులు పెట్టడం ద్వారా ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) ప్రస్తుతం కొనసాగుతున్న ర్యాలీకి మద్దతుగా నిలుస్తున్నారు. ఇదిలా ఉండగా, గత శుక్రవారం ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 581.43 కోట్ల విలువ గల షేర్లను, దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) రూ. 243.13 కోట్ల విలువ గల షేర్లను కొనుగోలు చేశారు.

సోమవారం నాటి లావాదేవీల్లో సెనె్సక్స్ ప్యాక్‌లోని కంపెనీలలో కోల్ ఇండియా అత్యధికంగా లాభపడింది. ఈ కంపెనీ షేర్ విలువ 3.26 శాతం పెరిగింది. ఇన్ఫోసిస్ 2.33 శాతం, సన్ ఫార్మా 2.28 శాతం లాభంతో తరువాత స్థానాల్లో నిలిచాయి. ఎల్ అండ్ టీ 1.80 శాతం లాభపడింది. లబ్ధి పొందిన ఇతర కంపెనీలలో హీరో మోటో కార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ లిమిటెడ్, హిందుస్తాన్ యూనీలీవర్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, విప్రో, టాటా మోటార్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎం అండ్ ఎం, కోటక్ బ్యాంక్, మారుతి సుజుకి, యెస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉన్నాయి. వీటి షేర్ల ధరలు 1.37 శాతం వరకు పెరిగాయి.

మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడంతో సోమవారం నష్టపోయిన షేర్లలో భారతి ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ, టాటా స్టీల్, అదాని పోర్ట్స్, డాక్టర్ రెడ్డీస్ ఉన్నాయి.

నిధుల వేటలో ఎస్‌బీఐ!

ఓవర్సీస్ బాండ్ల ద్వారా రూ.12,600 కోట్ల సేకరణకు కసరత్తు

న్యూఢిల్లీ, జనవరి 8: ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విదేశాలలో విస్తరించడం కోసం రెండు బిలియన్ డాలర్ల (రూ. 12,600 కోట్లు) నిధులు సేకరించడానికి రెండు ఆర్థిక సంవత్సరాల కాలంలో అమెరికన్ డాలర్ లేదా ఇతర మారకం చేయగలిగిన కరెన్సీలో బాండ్లను జారీ చేయడానికి కసరత్తు చేస్తోంది. 'దీర్ఘకాలంలో ఒకే మొత్తం లేదా బహుళ మొత్తాల్లో రెండు బిలియన్ డాలర్ల వరకు నిధులు సేకరించడానికి కేంద్ర బోర్డు కార్యనిర్వాహక కమిటి ఆమోదం తెలిపింది' అని ఎస్‌బీఐ ఒక అధికారిక పత్రంలో వెల్లడించింది. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాలలో పబ్లిక్ ఆఫర్, ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా నిధులు సేకరించనున్నట్టు ఎస్‌బీఐ వివరించింది. బాసెల్-3 క్యాపిటల్ నియమాల అనుసరణను పూర్తి చేయడానికి మసాలా బాండ్లు సహా వివిధ మార్గాల ద్వారా రూ. 8వేల కోట్లు సేకరించడానికి ఎస్‌బీఐ బోర్డు గత నెల ఆమోదం తెలిపింది. రూపాయి డినామినేషన్‌లో ఉండే మసాలా బాండ్లను కేవలం మూలధన సేకరణకు విదేశాలలో జారీ చేయవచ్చు. మూలధన సేకరణకు 2018 మార్చి వరకు గడువు ఉందని ఎస్‌బీఐ తెలిపింది. భారత్‌లోని బ్యాంకులు 2019 మార్చి నాటికి బాసెల్-3 నియమాల కింద ప్రపంచ మూలధన సూత్రాలకు అనుగుణంగా మార్పులు చేసుకోవలసి ఉంటుంది. ఇందుకోసం అంతర్జాతీయంగా అంగీకారం పొందిన గడువు 2019 జనవరి. ఏ కారణంగానయినా ఆర్థిక పరమైన ఒత్తిడులు ఎదురయితే, వాటిని తట్టుకొని నిలదొక్కుకునేందుకు వీలుగా బ్యాంకింగ్ రంగ సామర్థ్యాన్ని పెంపొందించడానికి బాసెల్ కమిటీ ఆన్ బ్యాంకింగ్ సూపర్‌విజన్ (బీసీబీఎస్) చేసిన సిఫార్సుల ఆధారంగా ఏర్పడినవే బాసెల్-3 సంస్కరణలు.

ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ సంస్థలే ఊతం

- డీసీఐపై త్వరలో కేంద్రం నిర్ణయం
- హోదా ప్రస్తావన ఇక అనవసరం
- స్వతంత్ర డైరెక్టర్ల సదస్సులో ఎంపీ హరిబాబు



స్వతంత్ర డైరెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ హరిబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 8: భారత ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ రంగ సంస్థలే వెన్నెముకని విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు అన్నారు. భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విశాఖలో జరిగే సమీక్షను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు సాలీనా రూ.18.54 లక్షల కోట్ల టర్నోవర్ సాధిస్తూ, రూ.1.15 లక్షల కోట్ల లాభాలను ఆర్జిస్తున్నాయన్నారు. ఇదే సందర్భంలో భారీ పరిశ్రమల్లో స్వతంత్ర డైరెక్టర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. గతంలో ప్రపంచాన్ని కుదిపేసిన లెహ్మాన్ బ్రదర్స్ సంక్షోభం, మన దేశంలో సత్యం కంప్యూటర్స్ కుంభకోణం వంటి అంశాలు కంపెనీల ప్రత్యేక డైరెక్టర్ల పనితీరుకు ప్రాధాన్యతను తెచ్చిపెట్టిందన్నారు. 2013 కంపెనీ చట్టం మేరకు ప్రత్యేక డైరెక్టర్ల నియామకం మొదలైందన్నారు. ఇదే సందర్భంలో వీరి పనితీరును మరింత మెరుగు పరచడమే కాకుండా, సంస్థల ఆర్థిక ప్రగతి, అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించేలా చూసేందుకు ఇటువంటి సమీక్షలు ఎంతో అవసరమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల శాఖ జాతీయ స్థాయి సదస్సును నిర్వహించేందుకు విశాఖను ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో స్వతంత్ర డైరెక్టర్ల పాత్ర, విధులపై మథింపు జరుగుతుందన్నారు. రెండు రోజుల పాటు జరిగే కీలక, విస్తృత స్థాయి సదస్సులో స్వతంత్ర డైరెక్టర్ల సామర్థ్యాన్ని మరింత పెంచి, వారి పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించేందుకు ఇదొక మంచి అవకాశం అన్నారు. సమావేశానికి భారీ పరిశ్రమల శాఖ కార్యదర్శి మధుకర్ గుప్త నేతృత్వం వహించగా, దేశ వ్యాప్తంగా పలు సంస్థలకు చెందిన స్వతంత్ర డైరెక్టర్లు పాల్గొన్నారు.

సదస్సు ప్రారంభోత్సవం ముగిసిన అనంతరం హరిబాబు విలేఖరులతో మాట్లాడుతూ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)లో నూరుశాతం వాటాల విక్రయంపై విలేఖరులు అడిగిన ప్రశ్నకు స్పందించారు. డీసీఐపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుందంటూ ముక్తసరిగా సమాధానమిచ్చారు. లాభాల్లో ఉన్న డీసీఐ ప్రైవేటీకరణపై ఆయన వివరణ ఇచ్చారు. గత ఏడాది డీసీఐ వార్షిక నివేదిక పరిశీలిస్తే లాభాల శాతంలో క్షీణత కన్పిస్తుందన్నారు. ఇక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే అంశం ప్రస్తావనలోనే లేదన్నారు. ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీకి కేంద్రం హామీ ఇచ్చిందని, దీనిలో భాగంగా ఆర్థిక సంస్థల నుంచి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ప్యాకేజీ కాల పరిమితిని పెంచడంతో పాటు మిగిలిన ప్రాజెక్టులనూ దీని పరిధిలోకి తీసుకువచ్చే ఆలోచన ఉందన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అంశం ఇప్పటికీ కేంద్రం పరిశీలనలోనే ఉందన్న విషయాన్ని ఆయన మరోసారి ఉద్ఘాటించారు.

చిన్న పరిశ్రమలతోనే పెద్ద ఉపాధి

కేంద్ర మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్



హస్తకళ మేళా ముగింపు సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 8: దేశంలో సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పారిశ్రామిక రంగంలోనే అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనల శాఖ సహాయ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ అన్నారు. సెంటర్ ఫర్ భారతీయ మేనేజ్‌మెంట్ బోర్డు (సీబీఎండీ) ఆధ్వర్యంలో విశాఖలో జరుగుతున్న హస్తకళల ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అందరికీ ఉద్యోగాలు కల్పించడం అసాధ్యమేనని, అయితే అందరికీ ఉపాధి కల్పించే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే మన దేశంలోనే యువత ఎక్కువగా ఉందని, వీరంతా ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం తయారీ రంగం, గ్రామీణ, దేశీయ పరిశ్రమల ద్వారా ఉపాధికి మెరుగైన పథకాలు మొదలయ్యాయన్నారు. సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పారిశ్రామిక రంగం బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో 40 కోట్ల మంది జనాభా అసంఘటిత రంగంలో ఉన్నారని, వీరందరికీ కార్మిక సంక్షేమ ఫలాలు అందించేలా కేంద్రం ఆయా రంగాల్ని పటిష్టం చేస్తోందన్నారు. జనధన్ యోజన, ముద్ర యోజన వంటి పథకాల ద్వారా ఇప్పటి వరకూ 9 కోట్ల ఖాతాలకు రూ.4లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ఈ ఎగ్జిబిషన్‌లో ప్రభుత్వ సహకారంతో రుణాలు పొందిన వారు తయారు చేసినవేనన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం నాలుగు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడంతో పాటు వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గాంధీ, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వంటి నేతలు గ్రామీణాభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని అభిప్రాయపడ్డారని, మోదీ ప్రభుత్వం ఆదిశగా గ్రామీణ ఉపాధికి పెద్ద పీట వేస్తోందన్నారు.


పత్రికాస్వేచ్ఛకు కట్టుబడి ఉన్నాం

'ఆధార్' ఎఫ్ఐఆర్‌పై కేంద్ర మంత్రి రవిశంకర ప్రసాద్

న్యూఢిల్లీ, జనవరి 8: ఆధార్ కార్డుల వివరాల గోప్యతకు సంబంధించి వార్త రాసిన విలేఖరి పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పత్రికా స్వేచ్ఛకు తాము కట్టుబడి ఉన్నామని కేంద్ర ఐటీ శాఖా మంత్రి రవిశంకర ప్రసాద్ ట్విట్టర్‌లో స్పష్టం చేశారు. భారత్ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేసే ఆధార్ గోప్యతను, పవిత్రతను కాపాడడమే తమ బాధ్యత అన్నారు. ఎఫ్ఐఆర్‌లో కేవలం 'గుర్తు తెలియని వ్యక్తుల'పై మాత్రమే కేసు నమోదు చేశామని తెలిపారు. 'ఆధార్' వివరాలకు గోప్యత లేదంటూ చండీగఢ్‌కు చెందిన 'ది ట్రిబ్యూన్' పత్రిక పరిశోధనాత్మక వార్తాకథనాన్ని ప్రచురించడంపై 'భారత విశిష్ఠ గుర్తింపు ప్రాధికార సంస్థ' (యుఐడీఏఐ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఈనెల 5న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆధార్ సమాచారం బయటకు పొక్కుతోందని ఆ పత్రిక ప్రకటించాక కేసు నమోదు కావడంతో కేంద్ర మంత్రి రవిశంకర్ స్పందించారు. 'గుర్తు తెలియని వ్యక్తులపై మాత్రమే కేసు నమోదైందని, పరిశోధనాత్మక కథనానికి సంబంధించిన అన్ని వివరాలను ఆ పత్రిక యాజమాన్యం, సంబంధిత విలేఖరి పోలీసులకు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇలాంటి కథనాలను ప్రచురించడం ద్వారా పత్రికా స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని, నిజమైన దోషులను గుర్తించేందుకు ఆ పత్రిక సహకరిస్తే బాగుంటుందని 'యుఐడీఏఐ' పేర్కొంది. ఆధార్ వివరాలను బహిర్గతం కానప్పటికీ, కుట్రదారులను గుర్తించేందుకు పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆ సంస్థ తెలిపింది. పత్రికా స్వేచ్ఛను తాము గౌరవిస్తామని, దోషులను గుర్తించేందుకు మాత్రమే ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. కాగా, విలేఖరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని పలు మీడియా సంస్థలు నిరసించాయి.

సైబర్ నేరాలను కట్టడి చేయండి

పోలీస్ బాస్‌లకు ప్రధాని మోదీ సూచన



టెకన్పూర్ (మధ్యప్రదేశ్), జనవరి 8: సైబర్ నేరాలు, సామాజిక మీడియాలో ఎదురయ్యే సమస్యలపై దృష్టి సారించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ఇక్కడి బిఎస్ఎఫ్ అకాడమీలో సోమవారం జరిగిన డీజీపీలు, ఐజీపీల మూడు రోజుల సదస్సు ముగింపు ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరాలపై తక్షణం దృష్టిసారించి, వాటిని పరిష్కరించేందుకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సాంకేతిక యుగంలో సామాజిక మీడియాకు ఉన్న కీలకపాత్రను కూడా గుర్తించాలన్నారు. మంచి ఫలితాలను సాధించాలంటే స్థానిక భాషలను కూడా వినియోగించుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో యువత తీవ్రవాదం వైపు మళ్లుతోందన్న విషయాన్ని ప్రధాని ప్రస్తావిస్తూ, సమస్యాత్మక ప్రాంతాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించాలన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వానికి చెందిన సుమారు 250 మంది పోలీస్ బాస్‌లు ఈ సదస్సులో పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు సమాచారాన్ని పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడంతో పాటు ముఖ్యంగా అక్రమ ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించాలని మోదీ సూచించారు. భద్రతకు సంబంధించి కూడా పోలీసు అధికారులు నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలను, సమాచారాన్ని పరస్పరం తెలియజేసుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటేనే అంతర్గత భద్రత సాధ్యమవుతుందన్నారు. ప్రధాని సూచనల మేరకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ దేశ రాజధాని ఢిల్లీలో బదులు ఇతర రాష్ట్రంలో ఈ సదస్సును ఏర్పాటు చేసింది. మోదీ నేతృత్వంలో 2014లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గౌహతి, కచ్‌లోని ర్రాన్, హైదరాబాద్‌లో పోలీసు బాస్‌లతో సమావేశాలను ఏర్పాటు చేసింది. ఇలాంటి సమావేశాల్లో జరిగే చర్చల వల్ల పోలీసులు మెరుగైన ఫలితాలను సాధిస్తారని మోదీ అన్నారు. దేశ భద్రత కోసం పోలీసులు చేస్తున్న సేవలను ఆయన శ్లాఘించారు. గతంలోకంటే భిన్నంగా ఈసారి సదస్సులో కొత్త సవాళ్లపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. నాయకత్వ లక్షణాలను పెంచే ఇలాంటి సదస్సుల వల్ల పోలీసులు మరింత సమర్థవంతంగా పని చేస్తారన్నారు. కాగా, ఇంటెలిజెన్స్ బ్యూరోలో విశిష్ఠ సేవలందించిన అధికారులకు ప్రధాని పోలీస్ మెడల్స్‌ను అందజేశారు. అత్యుత్తమ సేవలందించిన అధికారులను ఆయన అభినందించారు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర సహాయ మంత్రులు కిరణ్ రిజిజు, హన్స్ రాజ్ అహిర్ తదితరులు పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ భవానీప్రసాద్

ధరల పెంపుపై ఫిబ్రవరిలో ప్రజాభిప్రాయ సేకరణ

విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: విద్యుత్ ఉత్పాదక రంగాన్ని వెంటాడుతూ వస్తున్న నష్టాల ఊబి నుంచి బయటపడేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యుత్ సరఫరా చార్జీల పెంపుదలపై ఫిబ్రవరి 5తేదీ నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నామని విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించే అవకాశాలు లేనందున విజయవాడ, విశాఖ, రాజమండ్రి, తిరుపతి నగరాల్లో నిర్ణీత తేదీలు, నిర్ణీత సమయాల్లో అన్ని వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ జరుపుతామని అన్నారు. స్థానిక గుణదల విద్యుత్ సౌధలో సోమవారం విద్యుత్ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ మండళ్ల అధికారులతో సమావేశమై 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఏమేర విద్యుత్ వినియోగం ఉండగలదో వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటైన విలేఖరుల సమావేశంలో జస్టిస్ భవానీప్రసాద్ మాట్లాడారు. తమ సంస్థ పనితీరుపై కూడా ఇదే సమయంలో ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'ఉదయ్' పథకం అమల్లో రాష్ట్రంలోని ఈ రెండు ప్రాంతీయ మండళ్లు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాయని అన్నారు. వివిధ సంస్కరణల వల్ల గడచిన మూడేళ్లలో విద్యుత్ కొనుగోలు ఖర్చులను గణనీయంగా తగ్గించగల్గామన్నారు. విద్యుత్ యూనిట్ ఉత్పత్తి వ్యయం 4-50 పైసల నుంచి 4-10 పైసలకు, అలాగే స్వల్పకాలిక కొనుగోళ్ల రేటును రూ.6-50 పైసలను 5-50 పైసలకు తగ్గించగల్గామన్నారు. 2014లో 96 శాతం మంది, 2015లో 95 శాతం మంది వినియోగదారులపై భారం లేకుండా చేశామన్నారు. 2017లో టారిఫ్ పెరగలేదన్నారు. 2018-19లో కూడా ఎలాంటి అదనపు భారం పడబోదని నర్మగర్భంగా చెప్పారు. అయితే ఉత్పత్తి వ్యయం నష్టాలను సబ్సిడీ రూపంలో ప్రభుత్వం భరించాల్సి ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబు కూడా టారిఫ్ పెంచబోమని ఇప్పటికే ప్రకటించిన విషయం పాఠకులకు విదితమే.

తిరుపతిలో సమయ నిర్దేశిత సర్వదర్శనం కౌంటర్లు

కార్యాచరణ రూపొందించాలన్న ఈఓ సింఘాల్

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 8: స్థానిక రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, అలిపిరి తదితర ప్రాంతాల్లో భక్తుల సంచారం ఎక్కువగా ఉంటున్న కారణంగా ఈప్రాంతాల్లో సమయ నిర్దేశిత సర్వదర్శనం కౌంటర్లు ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలనా భవనంలో సోమవారం ఆయన సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా చేపట్టిన సమయ నిర్దేశిత సర్వదర్శనం విధానం విజయవంతం అయ్యిందన్నారు. రైళ్లు, బస్సులు ద్వారా భక్తులు తిరుపతికి చేరుకునే సమయాలను పరిగణనలోకి తీసుకుని కౌంటర్ల పనివేళలను నిర్ణయించాలన్నారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని, హార్డ్‌వేర్ పరికరాలను సిద్ధం చేయాలని చెప్పారు.

వైకుంఠం క్యూకాంప్లెక్‌లోని కంపార్ట్‌మెంట్ల నుంచి భక్తులను దర్శనానికి వదిలే సమయంలో క్యూల నిర్వహణపై సమగ్రంగా అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకోవాలని జేఈఓ శ్రీనివాసరాజును ఆదేశించారు. తిరుమలలో గదులు పొందిన వారు 12 గంటల్లోపు ఖాళీ చేస్తే 50 శాతం రీఫండ్ ఇస్తున్నామని, ఆధార్ లేని వారికి రీఫండ్ ఎలా చెల్లించాలన్న విషయంపై చర్యలు చేపట్టాలని ఈఓ సింఘాల్ ఎఫ్‌ఏసీఏఓను కోరారు. తిరుమలలోని ప్రముఖ కూడళ్లు, అవసరమైన ప్రాంతాల్లో పెంచేందుకు వీలుగా రాజమండ్రి సమీపంలోని కడియం నర్సరీ నుంచి అలంకరణ మొక్కలను తెప్పించుకోవాలని ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. న్యూఢిల్లీ ఇతర ముఖ్యమైన టీటీడీ సమాచార కేంద్రాలతోపాటుగా తిరుమలలోని కల్యాణవేదిక, అన్నప్రసాద భవనం తదితర ప్రాంతాలు, తిరుపతిలో భక్తుల రద్దీ ఉండే ప్రాంతాలలో సీసీ కెమెరాలను త్వరగా అమర్చాలన్నారు. టీటీడీ కల్యాణ మండపాల ఆన్‌లైన్ బుకింగ్‌ను ఈనెల నుంచి చిత్తూరు జిల్లా నుంచే ప్రారంభించాలని ఇఓ ఆదేశించారు.

చంద్రబాబు ఏమాత్రం మారలేదు: బొత్స


ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ మాత్రం మారలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నీ అబద్దాలే చెబుతున్నారని బొత్స సోమవారం విలేఖరుల సమావేశంలో విమర్శించారు. సాగు నీటి ప్రాజెక్టులపై రూ.50 వేల కోట్లు ఖర్చు చేశానని చెప్పడం విస్మయం కలిగిస్తున్నదని అన్నారు. ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితి, చేసిన ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్త సంవత్సరంలోనైనా ముఖ్యమంత్రి వాస్తవాలు చెబుతారని ఆశించామని, అయితే బాబులో మార్పు రాలేదని అన్నారు. ప్రపంచ స్థాయి రాజధాని కడతామని బీరాలు పలికిన చంద్రబాబు ఇప్పటి వరకు అమరావతి శాశ్వత రాజధానికి ఒక ఇటుక కూడా వేయలేదన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లపై అబద్దాలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. పాలనపై నమ్మకం లేకే క్షుద్ర పూజలు, గుప్త నిధుల తవ్వకాలు చేయిస్తున్నారని అన్నారు. క్షుద్ర పూజలు, తాంత్రిక విద్యల ద్వారా ప్రజల మనస్సులు గెలవలేరని బొత్స తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం

సీఎం చంద్రబాబుతో పాలేకర్ భేటీ

ఆంధ్రభూమి బ్యూరో



ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైన సుభాష్ పాలేకర్

విజయవాడ, జనవరి 8: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సలహాదారు సుభాష్ పాలేకర్ సోమవారం వెలగపూడి సచివాలయంలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాలేకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాపు విజయవంతం కావడంపై ముఖ్యమంత్రి అభినందించారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం కోసం 13వేల గ్రామాల్లో ఫైబర్ నెట్ సాయంతో నెలకోసారి శిక్షణా తరగతులు నిర్వహించాలని పాలేకర్‌ను సీఎం కోరారు. వచ్చే జూన్‌లోగా పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై జాతీయ, అంతర్జాతీయ సదస్సులు రాష్ట్రంలో ఏర్పాటు చేసి ఇక్కడి రైతులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ తరహా వ్యవసాయంలో యాంత్రీకరణ విస్తృతంగా ఉపయోగించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న విలేజ్ మాల్స్‌లో ఈ విధానం ద్వారా వచ్చిన ఉత్పత్తులను నేరుగా రైతులే విక్రయించుకునేలా తగిన చర్యలు చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలో రైతులపై పెట్టుబడి భారం లేకుండా ప్రకృతి సేద్యం ద్వారా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన, వ్యవసాయ దిగుబడులు అధికంగా సాధించేలా చూడాలనేది తన సంకల్పమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ మహా యజ్ఞానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని ముఖ్యమంత్రికి పాలేకర్ హామీ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంతో వచ్చే ఉత్పత్తులకు బ్రాండింగ్ తీసుకువచ్చి పెద్దఎత్తున విక్రయించేలా, రైతుబజార్లలోనూ మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయంతో దేశానికి ఎంతో సేవ చేస్తున్న పాలేకర్ రాష్ట్రానికి మరింత సమయం కేటాయించి అన్నదాతల ఉన్నతికి పాటుపడాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

పాలేకర్ ప్రకృతి వ్యవసాయం పెద్ద కుట్ర!

- ★ ఆయన సొంత గ్రామంలోనూ అమలుకావడం లేదు
- ★ అశాస్త్రీయ విధానానికి రూ.కోట్లు ఖర్చు
- ★ ధ్వజమెత్తిన వ్యవసాయ శాఖ అధికార్ల సంఘం

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 8: పాలేకర్ ప్రకృతి వ్యవసాయం అభివృద్ధి చెందుతున్న భారతదేశంపై జరుగుతున్న ఒక పెద్ద కుట్ర అని రాష్ట్ర వ్యవసాయ అధికార్ల సంఘం ఆరోపించింది. వ్యవసాయాధికార్ల ఆత్మాభిమానాన్ని అవమానిస్తున్న పాలేకర్‌ను అడ్డుకోవాలని సంఘం పిలుపునిచ్చింది. శాస్త్రీయ పరిశోధనా విధానాలను తరతరాలుగా క్షేత్ర స్థాయిలో రైతుల వద్దకు తీసుకెళుతున్న పట్టభద్రులైన వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని పాలేకర్ ద్రోహులుగా చిత్రీకరించడం పట్ల సంఘం నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె కమలాకరశర్మ, డి ప్రవీణ్ సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విలేఖర్లతో మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి సాధించి, సాధ్యమైనంత వరకు పురుగుల మందులు, ఎరువులను తగ్గించి, ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించాలని రైతుకు చేదోడు వాదోడుగా ఉండే వ్యవసాయాధికారులను దేశ ద్రోహులుగా చిత్రీకరించడాన్ని తట్టుకోలేకపోతున్నామన్నారు. పాలేకర్ ప్రకృతి వ్యవసాయం తప్పని అనడం లేదని, కానీ శాస్త్రాన్ని కాదని, ఎటువంటి శాస్త్రీయతా లేని విధానాన్ని తీసుకొచ్చి రాష్ట్రంపై రుద్దడాన్ని ఒక అంతర్జాతీయ కుట్రగా భావించాల్సి వుందన్నారు. పాలేకర్ పెడుతున్న శిక్షణా తరగతులకు సుమారు రూ.10 కోట్ల వంతున ఖర్చవుతోందని, ఆయన రాసిన సుమారు రూ.48 లక్షల విలువైన పుస్తకాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, శాస్త్రీయతలేని దీనికి ఇంత ఖర్చు అవసరమా అని ప్రశ్నించారు. ఆర్గానిక్ ఫార్మింగ్‌ను తాము కాదనడం లేదని, అయితే శాస్త్రబద్ధమైన విజ్ఞానంతో స్వయం సమృద్ధి సాధించిన విధానాన్ని వదిలేసి అటువైపు మళ్లడం సరి కాదన్నారు. అశాస్త్రీయమైన పాలేకర్ విధానాన్ని తీసుకురావడం రైతులను తీవ్ర గందరగోళంలోకి నెట్టుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలేకర్ స్వరాష్ట్రం మహారాష్ట్ర ఈ విధానాన్ని ఎందుకు అనుసరించడంలేదని వారు ప్రశ్నించారు. అసలు పాలేకర్ స్వగ్రామంలో కూడా ఒక్క ఎకరాలో అయినా ప్రకృతి వ్యవసాయం సాగుతోందా అని ప్రశ్నించారు. సెర్ప్‌లో శిక్షణ ఇచ్చిన రైతులు ఇపుడు మళ్ళీ ఎందుకు ప్రకృతి వ్యవసాయం అనుసరించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, ఏపీలోని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో త్వరలో విశాఖలో సమావేశమై పాలేకర్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామని ప్రకటించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు బుచ్చిబాబు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థే మేలు

- కార్మిక చట్టాల్లో సంస్కరణలు నష్టదాయకం
- ఉద్యోగాల కల్పనలో కేంద్రం వైఫల్యం
- ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

విజయవాడ (పటమట) జనవరి 8: వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థతోనే దేశం మరింత అభివృద్ధి చెందటంతోపాటు అన్ని రంగాల్లోనూ వృద్ధిని సాధించే అవకాశం ఉంటుందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ అన్నారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ దిప్రెస్ కార్యక్రమంలో అమర్‌జిత్‌కౌర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమెరికా తరహా ఆర్థిక వ్యవస్థ కోసం వెంపర్లాడుతోందన్నారు. కానీ ఆ వ్యవస్థ వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆ దేశంలో ఇప్పటికే రుజువు అయిందన్నారు. దేశంలో 67 శాతం మంది వ్యవసాయ రంగంలో ఉంటూ ప్రజలకు అవసరమైన అన్ని రకాల ఆహార పదార్థాలను ఉత్పత్తి చేస్తున్నారన్నారు. దేశానికి అత్యంత ప్రతిష్ఠాత్మకరమైన ఇస్రో అనేక విజయాలు సాధిస్తుండగా, సాఫ్ట్‌వేర్ నిపుణులు ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నట్లు చెప్పారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే ఛిన్నాభిన్నం అయిందన్నారు.

దేశంలో వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ ద్వారానే స్థిరమైన వృద్ధి సాధించే అవకాశం వుందని ఆమె అభిప్రాయపడ్డారు. పాలకులు ఢిల్లీలో కూర్చుని మేక్ ఇండియా పేరుతో నినాదాలు చేస్తున్నారేగానీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన చేయటంలేదని వ్యాఖ్యానించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయటం వల్ల యువతకు ఉద్యోగవకాశాలు లభించటంతోపాటు ఆర్థిక వ్యవస్థ కూడా వృద్ధి చెందుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలలో ఇప్పటికే కార్మిక చట్టాల సంస్కరణల బిల్లులను ఆయా ప్రభుత్వాలు ప్రవేశ పెట్టాయన్నారు. దీనిని నిరసిస్తూ గత ఏడాది నవంబర్‌లో అన్ని జాతీయ కార్మిక సంఘాలు సమ్మె నిర్వహించినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ, మధ్యాహ్నన్న భోజన పథకం, ఆశా పథకాలలో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు ఇవ్వాలని ఈ నెల 17న ఢిల్లీలో దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 23న ఆంధ్రప్రదేశ్‌లో సత్యాగ్రహం చేయనున్నట్లు తెలిపారు.

దేశంలో 2.5 లక్షల చిన్న తరహా పరిశ్రమలు మూతపడటం వలన 17 లక్షల మంది ఉపాధి కోల్పోయారని అన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ మన దేశంలో పెట్రో ఉత్పత్తుల ధరలు మాత్రం తగ్గలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని రామారావు, కార్యదర్శి జీ.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎస్ పింఛనుపై ఇక ప్రత్యక్ష పోరు

ఆర్టీసీ ఎన్ఎంయూ నేతల వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 8: రాష్ట్రంలోని ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగ కార్మికులు ప్రస్తుతం లోయర్ ఆప్షన్ పరిధిలో ఉంటూ నెలకు కనీసం రెండు వేలకు మించి పెన్షన్ పొందలేకపోతున్నందున సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ ఈపీఎస్ పెన్షన్ కోసం ఇక ప్రత్యక్ష పోరు సాగిస్తామని గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ముఖ్య ఉపాధ్యక్షులు డి.సూర్యప్రకాశరావు, తదితరులు సోమవారం నాడిక్కడ తెలిపారు.

గతంలో కేరళ హైకోర్టుతోపాటు సుప్రీంకోర్టు కూడా లోయర్ పెన్షన్ పొందుతున్నవారికి హయ్యర్ పెన్షన్ అందించేందుకు అనుమతిచ్చినందున ఆ తీర్పును ఏపీఎస్‌ఆర్టీసీకి కూడా వర్తింప చేయాలన్నారు. ఆర్టీసీని నష్టాల బారి నుంచి రాత్రి, పగలు శ్రమిస్తున్న కార్మికుల శ్రమను అయినా దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం పనిచేస్తున్న 56వేల మంది సిబ్బంది, రిటైర్డ్ అయిన 32వేల సిబ్బంది సంక్షేమం కోసం హయ్యర్ పెన్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు.



కాకినాడలో జరిగిన స్వామి వివేకానంద జయంతి సభలో ప్రసంగిస్తున్న మంత్రి కామినేని

ప్రభుత్వాసుపత్రుల్లో పెరిగిన ప్రసవాలు

రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యుల నియామకాలు: మంత్రి కామినేని

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, జనవరి 8: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు గత మూడున్నరేళ్లలో గణనీయంగా పెరిగాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో రోగుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. పెరుగుతున్న రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యుల నియామకాలు చేపడుతున్నామన్నారు. తూర్పు గోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నగరంలోని రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో స్వామి వివేకానంద 155వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కామినేని మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 8 వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయన్నారు. దీంతో ఆయా వైద్య కళాశాలల్లో 850 సీట్లు పెరిగాయన్నారు. 50సీట్లతో ఎయిమ్స్ టెంపరరీ క్యాంపస్ ఫౌండేషన్‌ను విజయవాడలో ఏర్పాటుచేశామన్నారు. రాష్ట్రంలో గడచిన మూడున్నర సంవత్సరాల్లో అనేక పథకాలు ప్రవేశపెట్టామని, తాజాగా ప్రవేశపెట్టిన శానిటేషన్ పాలసీవల్ల ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు.

ప్రపంచంలో ఏ దేశానికి వెళ్ళినా భారతీయులు అందులో తెలుగువారు అధిక సంఖ్యలో వైద్య రంగంలో ఉన్నారన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలోనే తాను విద్యనభ్యసించానని, ఇక్కడ నేర్చుకున్న పాఠాలే తన జీవితానికి మార్గదర్శకమయ్యాయన్నారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల్లో వసతుల కల్పనకు రూ.2.12కోట్లు వెచ్చించామన్నారు. పలు ఆసుపత్రుల నిర్వహణ, సూపర్ స్పెషాలిటీ బ్లాకుల నిర్మాణం, హెల్త్‌కేర్ సెంటర్లు, బాలికల హాస్టల్స్‌ను పెద్ద ఎత్తున నిర్మించినట్టు మంత్రి డాక్టర్ కామినేని వివరించారు. కార్యక్రమంలో రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణబాబు, వైద్య విద్యార్థులు, బీజేపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు వై మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

1వ పేజీ తరువాయి

ఇక మహా సంగమమే

పనులను ముందుకు తీసుకువెళతామన్నారు. కాంక్రీటు పనులు కీలకంగా మారిన సమయంలో ఇక్కడ బ్యాచింగ్ ప్లాంట్ ప్రారంభించామని, త్వరలోనే మరో ప్లాంట్ కూడా ప్రారంభిస్తామన్నారు. దీనితో రోజుకు అయిదు వేల క్యూబిక్ మీటర్ల మేరకు కాంక్రీటు పనులు ముందుకు సాగుతాయన్నారు.

పోలవరం ప్రాజెక్టు వల్ల మొత్తం 40.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 546 గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కృష్ణా డెల్టాకు 80 టిఎంసిలు, విశాఖకు 24 టిఎంసిల జలాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అంతేకాకుండా 194.6 టిఎంసిల నీరు నిల్వ ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో గోదావరిని వంశధార, నాగావళితో అనుసంధానం చేయనున్నామన్నారు. దీని వలన కరువు రహిత రాష్ట్రంగా ఆంధ్రా రూపుదిద్దుకుంటుందన్నారు. పర్యాటక పరంగాను ఇక్కడ ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగానే చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న పాదయాత్రలపై చంద్రబాబు తనదైన శైలిలో విమర్శలు కురిపించారు. ప్రస్తుతం కొంతమంది నాయకులు విన్యాసాలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు. ఇప్పుడు చేస్తున్న పాదయాత్రలు అప్పుడు చేసివుంటే రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగి ఉండేది కాదని కాంగ్రెస్ మహాపాదయాత్రను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మరొక వ్యక్తి పాదయాత్రలు చేసుకుంటూ తిరుగుతున్నారని ఆయన తాను చేసిన పాపాలను క్షమించాలంటూ ప్రజలను కోరుతున్నారా? అని ఎద్దేవాచేశారు. ప్రాధాన్యత్యాక్రమంలో ప్రాజెక్టులన్నిటినీ పూర్తిచేస్తున్నామని చెప్పారు. వచ్చే జూన్‌లోగా ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఆయన వెంట మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఎంపీలు తోట సీతారామలక్ష్మి, మాగంటి బాబు, పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, ప.గో. జిల్లాకలెక్టరు డాక్టరు కాటంనేని భాస్కర్, ఇరిగేషన్ సెక్రటరీ శశిభూషణ్ తదితరులు ఉన్నారు.

రానున్నది ఎన్నికల బడ్జెట్!

ఎన్నికల ప్రచారం చేసేందుకు సాధ్యం కాకపోవచ్చు. కాబట్టి బడ్జెట్‌లో ఈ రాష్ట్రాలకు సంబందించిన పథకాలను పొందుపరచటం, వ్యవసాయం, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన పథకాలకు పెద్దపీట వేయటంద్వారా తమ లక్ష్యాన్ని సాధించాలని మోదీ, షా, జైట్లీ త్రయం వ్యూహం పన్నుతున్నట్లు తెలిసింది. వ్యవసాయ రంగం, కార్మిక రంగం, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన పథకాలను బడ్జెట్‌లో పొందుపరుస్తున్నారని అంటున్నారు. ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల రైతుల ఆగ్రహాన్ని తగ్గించే దిశగా మోదీ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగేనాటికి జీఎస్‌టీ ప్రభావాన్ని కూడా బాగా తగ్గించేందుకు జీఎస్‌టీ కౌన్సిల్‌ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అశ్వమేధ అభివృద్ధి

అని, అలాంటి శక్తిని సంపాదించడం కోసం చేస్తున్న యజ్ఞంగా చంద్రబాబు అభివర్ణించారు. దేశంలో ఇంతకు ముందు 42 యజ్ఞాలు జరిగాయని ఇది 43వది అన్నారు. వైద్య విద్య నభ్యసించిన దేవసంస్కృతి విశ్వ విద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య చిన్మయ పాండ్యా వేదికపై ప్రకృతి, శక్తిని గురించి చెప్పిన తీరు బాగుందని ఆయన న్నారు. ప్రకృతిలో మనందరం భాగస్వాములు కావాలని, ప్రకృతిని గౌరవించి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సమాజం కోసం ప్రకృతి ఉపయోగపడే పరిస్థితి రావాలని, అందుకే ఈ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. వ్యవసాయాన్ని గౌరవించేందుకు ఏరువాకను ప్రారంభించామని, నీటిని పరిరక్షించుకోవాలి , నీటి సమస్య తీరాలి అనే ఉద్దేశ్యంతో భారతదేశంలో ఎక్కడా లేని విధంగా జలసిరికి హారతి ప్రారంభించామని, గోదావరి పుష్కరాలు బ్రహ్మాండంగా జరిపి మొదటి సారిగా అక్కడ అఖండ హారతికి శ్రీకారం చుట్టామని, తరువాత కృష్ణా పుష్కరాలు ఘనంగా చేసి పవిత్ర హారతి ప్రారంభించామని, ఈ రెండూ శాశ్వతంగా ఇస్తున్నామని, మానవ మనుగడకు కారణమైన జలం మనకు సంపదతో పాటు సర్వం ఇస్తుందన్నారు. మరోపక్క వన మహోత్సవం కూడా పెట్టామని, కార్తీక మాసంలో ప్రతి ఒక్కరూ చెట్లను పూజించాలని, చెట్లను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతాయని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఆరోగ్యం, పంటలు, సంపదతో పాటు ఇటీవల నుంచి సౌర విద్యుత్‌ను కూడా సూర్యభగవానుడు ఇస్తున్నాడని, దీంతో సూర్య ఆరాధనకు శ్రీకారం చుట్టామన్నారు. సూర్య భగవానుడు ఇచ్చే సౌర విద్యుత్ ఉపయోగించుకుంటే ప్రపంచంలో ఎవరూ మనతో పోటీ పడలేని విధంగా ముందుకు పోయే పరిస్థితి ఉంటుందన్నారు. భారతీయులకు ఆ శక్తి ఉందని చంద్రబాబు అన్నారు. ఎన్నారైలు ఎంతో బాగా పనిచేసి అమెరికా ప్రగతికి ఉపయోగ పడ్డారని, మేధాశక్తిలో మనం తక్కువ కాదని, కష్టపడే తత్వముందని, సద్వినియోగం చేసుకో గలిగితే ప్రపంచంలోని మూడు అగ్రరాజ్యాల్లో భారత్ ఒకటిగా ఉండి అమెరికాను కూడా మించి పోయే శక్తి సామర్థ్యాలు వస్తాయన్నారు.

సాంకేతికతలో మనకు మనమే సాటి ఎవరూ మనతో పోటీ పడే పరిస్థితి లేదని, గూగుల్, మైక్రోసాఫ్ట్ కంపెనీలకు మనవాళ్లే సీఈఓలుగా ఉన్నారంటే అదే మన టెక్నాలజీ శక్తి అన్నారాయన. అశ్వమేధ యాగం ద్వారా మనలో నమ్మకం, అదనపు శక్తి వస్తుందని, దానికి మేధోశక్తిని జోడించి పనిచేస్తే అన్నీ సాధ్యమేనని, ఏదీ అసాధ్యం కాదని చంద్రబాబు అన్నారు. నాలుగురోజుల పాటు 501 హోమ గుండాలు, 11వేల కలశాలతో శోభాయాత్ర 24 వేల దీపాలతో వినూత్న కార్యక్రమం జరపటం సంతోషంగా ఉందని చంద్రబాబు అన్నారు. అమరావతిలో దక్షిణాది రాష్ట్రాల కేంద్రంగా గాయత్రీ పరివార్ ఏర్పాటుకు ముందుకు వస్తే అవసరమైన భూమిని ఇస్తామని, సానుకూలంగా స్పందిస్తారనే ఆశాభావాన్ని చంద్రబాబు వ్యక్తంచేశారు. త్వరలోనే తాను హరిద్వార్‌ను సందర్శిస్తానని ఆయనన్నారు. వేదికపై చంద్రబాబును గాయత్రి పరివార్ దక్షిణాది రాష్ట్రాల కోఆర్డినేటర్ అశ్వనీ సుబ్బారావు, ఇన్‌చార్జ్ బ్రిజ్‌మోహన్ గౌర్ సత్కరించి ఆశీర్వదించారు. చిన్మయ పాండ్యా చంద్రబాబుకు జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రమంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, జిల్లా కలెక్టర్ కోన శశిధర్ పాల్గొన్నారు.

అలా.. సెట్ చేశాం

12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకూ నిర్వహిస్తారు. ఏపీ ఎడ్‌సెట్‌ను ఏప్రిల్ 19న ఎస్‌వి వర్సిటీ, ఏపీ లాసెట్‌ను ఏప్రిల్ 19న ఎస్‌కె వర్సిటీ నిర్వహిస్తుందన్నారు. ఏపీఐసెట్‌ను మే 2న ఎస్‌వి వర్సిటీ నిర్వహిస్తుందన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకూ రెండు సెషన్స్‌లో పరీక్ష ఉంటుంది. ఏపీఈసెట్‌ను మే 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జెఎన్‌టియు (అనంతపురం) నిర్వహిస్తుంది. ఏపీపీజీసెట్‌ను మే 10 నుంచి 12 వరకూ ఆంధ్ర విశ్వ విద్యాలయం రోజుకు రెండు సెషన్లలో నిర్వహిస్తుంది. ఏపీపీఈసెట్‌ను మే 4 నుంచి నాగార్జున వర్సిటీ నిర్వహిస్తుంది. ఫలితాలను వారం రోజుల్లో వెల్లడిస్తామని, గరిష్ఠంగా 10 రోజుల సమయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.గడ ఏడాది మాదిరిగా ఆన్‌లైన్‌లో మాక్‌టెస్టును ఎంపిక చేసిన కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. గ్రామీణ విద్యార్థుల సౌకర్యార్థం మాక్‌టెస్టు సీడీలను రూపొందించి, ఆయా జూనియర్ కళాశాలల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. వివిధ ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లను ఆయా సెట్‌ల కన్వీనర్లు ప్రకటిస్తారన్నారు.

ఇంధన, లాజిస్టిక్స్, ఆతిథ్య వర్శిటీలు

రాష్ట్రంలో ఇంధన, లాజిస్టిక్, ఆతిథ్య వర్శిటీలను ఏర్పాటు చేయనున్నామన్నారు. విశాఖలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని వర్శిటీగా మార్పు చేయనున్నామని వెల్లడించారు. వచ్చే విద్య సంవత్సరం నుంచి ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ వర్శిటీని ప్రారంభించే యోచన ఉందన్నారు. అన్ని వర్శిటీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్లను ఇవ్వాలని వీసీలను ఆదేశించామన్నారు. 2016-18 బి.ఎడ్, డి.ఎడ్ విద్యార్థులకూ టెట్ రాసే అర్హత కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్ల ఉపాధ్యాయ శిక్షణపై చర్చ జరుగుతోందని, రాష్ట్రంలో నాలుగేళ్ల సమీకృత విద్యార్థి శిక్షణా కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. నాక్ ఏ గ్రేడ్ సాధించిన వంద కళాశాలల్లో ఈ కోర్సును ప్రారంభిస్తామన్నారు.

బాబు వస్తే.. చక్కెర చేదు!

శాపంలా పరిణమిస్తోందన్నారు. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తుండటం వల్లే రైతులకు ఇలాంటి దుస్థితి ఏర్పడిందన్నారు. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుమల, కాణిపాకం ఆలయాల పాలకమండళ్ల పదవీకాలం పూర్తై నెలలు కావస్తున్నా కొత్త పాలకమండళ్లను ఏర్పాటు చేయలేని దుస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టామని చెబుతున్న జన్మభూమి కమిటీలు మాఫీయా ముఠాలుగా మారాయని ధ్వజమెత్తారు. సంబంధిత కమిటీ సభ్యులు పించన్లు, మరుగుదొడ్లు, రేషన్‌కార్డుల మంజూరుకు లంచం డిమాండ్ చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల వారిని తీవ్రంగా హింసిస్తున్నారని ఆరోపించారు. ప్రజలను మోసం చేయడంలో బాబు పిహెచ్‌డి చేశారని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తే ఇంటింటికి ఒక కేజీ బంగారంతో పాటు, ఒక బెంజి కారును ఉచితంగా ఇస్తానని కూడా హామీ ఇచ్చే రకమని ఎద్దేవా చేశారు. అనంతరం ఆయన తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయనున్న నవరత్నాల గురించి ప్రజలకు వివరించారు.

అరకు మాజీ ఎమ్మెల్యే రవిబాబు వైకాపాలో చేరిక


విశాఖపట్నం జిల్లా అరకు నియోజకవర్గానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె రవిబాబు సోమవారం జగన్ సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. కంభా రవిబాబుతో పాటు పలువురు అరకుకు చెందిన టీడీపీ కార్యకర్తలు మూడు బస్సుల్లో పూతలపట్టుకు చేరుకొని జగన్ సమక్షంలో వైకాపాలో చేరారు. ఈకార్యక్రమంలో విశాఖ జిల్లా వైకాపా అధ్యక్షులు అమరనాథ్‌రెడ్డితో పాటు వైకాపా సీనియర్ నేత విజయసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరం

నారా భువనేశ్వరి వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 8: తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 18న దేశ వ్యాప్తంగా లెజెండరీ రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. గత రెండేళ్ళుగా ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున తెలుగు రాష్ట్రాల్లో 145 చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు ఎన్టీఆర్ ట్రస్టు ముఖ్యకార్య నిర్వహణాధికారి టి.విష్ణువర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



బెంగళూరులో సోమవారం అగ్నిప్రమాదం జరిగిన బార్ ఇదే. ఈ దుర్ఘటనలో ఐదుగురు మృతిచెందారు.


ఇదేనా పద్ధతి?

- పాక్‌ను ఉగ్రబూచిగా చూపుతారా?
- ఆ దేశం బాధ్యతల్లో మీ వేలెందుకు?
- అమెరికాపై గుర్రుమన్న చైనా

బీజింగ్, జనవరి 8: ఉగ్రవాద బూచిగా పాక్‌ను వేలెత్తి చూపిస్తూ, దేశంలో ఉగ్రవాద నిరోధానికి చర్యలు తీసుకోవాలంటూ అమెరికా తీవ్ర వత్తిడి తేవడాన్ని చైనా గర్హించింది. అబద్ధాలతో తమను పాక్ మోసం చేసిందంటూనే, ఇప్పటికైనా దేశంలోని ఉగ్ర శిబిరాలపై దండెత్తకుంటే రక్షణ సాయం నిలిపేస్తామని కొద్దిరోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించటం తెలిసిందే. ట్రంప్ ప్రకటించిందే తడవుగా 2 బిలియన్ యుఎస్ డాలర్ల రక్షణ సాయాన్ని అమెరికా నిలిపేసింది. తాలిబాన్, హుక్కాని నెట్‌వర్క్‌పై పాక్ తక్షణం చర్యలు తీసుకోక తప్పదంటూ అమెరికా వత్తిడి తీసుకురావడం తెలిసిందే. దీనిపై పాక్‌ను వెనకేసుకొచ్చిన చైనా, అమెరికా వైఖరిని ఎండగట్టడం గమనార్హం. ఉగ్రవాదానికి, రక్షణ సాయానికి ముడిపెట్టడం బాధ్యతగల దేశం అనుసరించే చర్య కాదని వ్యాఖ్యానించింది. 'ఏ దేశానికైనా ఉగ్రబూచిని అంటగట్టడాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుంది. ఉగ్రవాద నిరోధానికి సంబంధించి ఒక దేశం బాధ్యతలో మరో దేశం వేలుపెట్టడం, వొత్తిడి తేవడం ఎంత మాత్రం సహేతుకం కాదు. చైనా అంగీకరించబోదు' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లు కాంగ్ మీడియా వద్ద వ్యాఖ్యానించారు. వైట్‌హౌస్ వైఖరిపై స్పందించాలన్న మీడియా ప్రశ్నకు సమాధానమిస్తూ 'ఏ విషయంలోనైనా చైనా ఆశాజనకమైన పాత్రనే పోషిస్తుంది. ఉగ్రవాద దేశంగా అవతరించాలన్న పాక్ ఆసక్తికి మనం బలం చేకూర్చాలే తప్ప, వత్తిడి తీసుకురావడం ఎంతమాత్రం సహేతుకం కాదు' అని వ్యాఖ్యానించారు. 'ప్రపంచ ఉగ్రవాద నిరోధానికి పాక్ తనవంతు పాత్ర పోషించిందన్న విషయాన్ని మర్చిపోకూడదు. ఆ కోణంలో పాక్ చాలా త్యాగాలే చేసిందన్న విషయాన్ని చైనా అనేక సందర్భాల్లో బలంగానే చెప్పాం' అని లు స్పష్టం చేశారు.

క్రీడ

లో స్కోరింగ్ మ్యాచ్‌లో
దక్షిణాఫ్రికా గెలుపు



వరుస బంతుల్లో మహమ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా వికెట్లు పడగొట్టి, దక్షిణాఫ్రికాను గెలిపించిన తర్వాత ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న వెర్నన్ ఫిలాండర్ (ఎడమ). మొదటి ఇన్నింగ్స్‌లో మూడు రెండో ఇన్నింగ్స్‌లో ఆరు చొప్పున మొత్తం తొమ్మిది వికెట్లు సాధించిన ఫిలాండర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది

కేప్ టౌన్, జనవరి 8: మొదటి రోజు ఆటతోనే లో స్కోరింగ్ మ్యాచ్‌గా కొనసాగే అవకాశం ఉందని అందరూ అనుమానించిన విధంగానే భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మొదటి టెస్టు ముగిసింది. ప్రత్యర్థిని రెండో ఇన్నింగ్స్‌లో 130 పరుగులకే కట్టడి చేసిన ఆనందం విరాట్ కోహ్లీ నాయకత్వంలోని భారత జట్టుకు ఎక్కువ సేపు నిలవలేదు. 208 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే ఆలౌటైంది. 37 పరుగులతో రవిచంద్రన్ అశ్విన్ టాప్ స్కోరర్‌గా నిలిచాడంటే, భారత బ్యాట్స్‌మెన్ వైఫల్యం ఏ విధంగా కొనసాగిందో ఊహించుకోవచ్చు. వెర్నన్ ఫిలాండర్ ఆరు వికెట్లు పడగొట్టి, దక్షిణాఫ్రికాను విజయపథంలో నడిపించాడు. ఒక రోజు ఆట మొత్తం వర్షం కారణంగా రద్దయినప్పటికీ, మ్యాచ్ నాలుగు రోజుల్లోనే ముగియడం పిచ్ తీరుకు అద్దం పడుతుంది. బౌలర్లకు అనుకూలించిన కేప్ టౌన్ వికెట్‌పై ఇరు జట్ల ఆటగాళ్లు పరుగుల కోసం నానా తంటాలు పడ్డారు. మొత్తం మీద ఇది లో స్కోరింగ్ మ్యాచ్‌గానే ముగిసింది.

బౌలర్లకు అనుకూలం

వర్షం కారణంగా మూడో రోజు ఆట రద్దుకాగా, నాలుగో రోజైన సోమవారం ఉదయం దక్షిణాఫ్రికా రెండు వికెట్లకు 65 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. అసలే బౌలర్లకు అనుకూలిస్తున్న పిచ్ మూడో రోజు కురిసిన వర్షం కారణంగా వారికి స్వర్గ ధామంగా మారింది. ఫలితంగా దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ పరుగుల కోసం తీవ్రంగా శ్రమించారు. కానీ, ఫలితం లేకపోయింది. మరో 65 పరుగులకే మిగతా ఎనిమిది వికెట్లను కోల్పోయిన దక్షిణాఫ్రికా 130 పరుగులకు ఆలౌటైంది. అయితే, మొదటి ఇన్నింగ్స్‌లో 77 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించిన కారణంగా భారత్ ముందు 208 పరుగుల లక్ష్యాన్ని ఉంచగలిగింది. నాలుగో రోజు ఆటను ప్రారంభించి, ఓవర్‌నైట్ స్కోరుకు ఒక పరుగు జత కలిసిన తర్వాత హాషిం ఆమ్లా వికెట్‌ను దక్షిణాఫ్రికా కోల్పోయింది. అతను నాలుగు పరుగులు చేసి, మహమ్మద్ షమీ బౌలింగ్‌లో రోహిత్ శర్మ క్యాచ్ పట్టగా వెనుదిరిగాడు. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన కాగిసో రబదా 5 పరుగుల వ్యక్తిగత స్కోరువద్ద, మహమ్మద్ షమీ బౌలింగ్‌లోనే విరాట్ కోహ్లీకి దొరికిపోయాడు. అనంతరం ఏబీ డివిలియర్స్ క్రీజ్‌లో నిలదొక్కుకోవడానికి విశేషంగా శ్రమిస్తుండగా, మిగతా వారు వచ్చినంత వేగంగా వెనక్కు పరుగులు తీశారు. కెప్టెన్ ఫఫ్ డు ప్లెసిస్ ఒక్క పరుగు కూడా చేయకుండానే జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో వృద్ధిమాన్ సాహా క్యాచ్ పట్టగా ఔటయ్యాడు. క్వింటన్ డి కాక్ 8 పరుగులు చేసి, డు ప్లెసిస్ మాదిరిగానే వృద్ధిమాన్ సాహా క్యాచ్ అందుకోగా, జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. పరుగుల ఖాతా తెరవని వెర్నన్ ఫిలాండర్‌ను మహమ్మద్ షమీ ఎల్‌బిగా నిష్క్రమించాడు. కేశవ్ మహారాజ్ 15 పరుగులు చేసిన తర్వాత, భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో వృద్ధిమాన్ సాహాకు చిక్కాడు. రెండు పరుగులు చేసిన మోర్న్ మోర్కెల్ కూడా అదే తరహాలో ఔటయ్యాడు. 35 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన డివిలియర్స్‌ను భువనేశ్వర్ కుమార్ క్యాచ్ పట్టగా, జస్‌ప్రీత్ బుమ్రా ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌కు 41.2 ఓవర్లలో 130 పరుగుల వద్ద తెరపడింది.

పరుగుల వేటలో భారత్ విఫలం

దక్షిణాఫ్రికాను రెండో ఇన్నింగ్స్‌లో 130 పరుగులకే ఆలౌట్ చేసిన భారత్ పరుగుల వేటలో విఫలమైంది. ఓపెనర్ శిఖర్ ధావన్ 16 పరుగులు చేసి, మోర్న్ మోర్కెల్ బౌలింగ్‌లో డేల్ స్టెయిన్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా ఫీల్డింగ్‌కు వచ్చిన క్రిస్ మోరిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 30 పరుగుల వద్ద తొలి వికెట్ కూలగా, ఆతర్వాత ఒక్క పరుగు కూడా జోడించకుండానే మురళీ విజయ్ కూడా వెనుదిరిగాడు. అతను 13 పరుగులు చేసి, వెర్నన్ ఫిలాండర్ బౌలింగ్‌లో ఏబీ డివిలియర్స్‌కు దొరికాడు. ఓపెనర్లు ఇద్దరు ఔటైన తర్వాత భారత్ కోలుకోలేకపోయింది. చటేశ్వర్ పుజారా నాలుగు పరుగులకే మోర్న్ మోర్కెల్ బౌలింగ్‌లో క్వింటన్ డి కాక్‌కు క్యాచ్ ఇచ్చాడు.

కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలవలేక, 28 పరుగులు చేసి, వెర్నన్ ఫిలాండర్ బౌలింగ్‌లో ఎల్‌బిగా పెవిలియన్ చేరాడు. రోహిత్ శర్మ (10), వృద్ధిమాన్ సాహా (8), హార్దిక్ పాండ్య (1) తక్కువ స్కోర్లకే నిష్క్రమించారు. రవిచంద్రన్ అశ్విన్ (53 బంతుల్లో 37), భువనేశ్వర్ కుమార్ (14 బంతుల్లో 13 నాటౌట్) కొంత సేపు వికెట్ల పతనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

మహమ్మద్ షమీ (4), జస్‌ప్రీత్ బుమ్రా (4)ను వెర్నన్ ఫిలాండర్ వరుస బంతుల్లో ఔట్ చేయడంతో, భారత్ రెండో ఇన్నింగ్స్‌కు 44.4 ఓవర్లలో 135 పరుగుల వద్ద తెరపడింది. మూడు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌పై దక్షిణాఫ్రికా 1-0 ఆధిక్యాన్ని సంపాదించింది.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్: 73.1 ఓవర్లలో 286 (ఏబీ డివిలియర్స్ 65, ఫఫ్ డు ప్లెసిస్ 62, క్వింటన్ డి కాక్ 43, వెర్నన్ ఫిలాండర్ 23, కేశవ్ మహారాజ్ 35, కాగిసో రబదా 26, డేల్ స్టెయిన్ 16 నాటౌట్, భువనేశ్వర్ కుమార్ 4/87, అశ్విన్ 2/21).

భారత్ మొదటి ఇన్నింగ్స్: 73.4 ఓవర్లలో 209 ఆలౌట్ (చటేశ్వర్ పుజారా 26, హార్దిక్ పాండ్య 93, భువనేశ్వర్ కుమార్ 25, వెర్నన్ ఫిలాండర్ 3/33, కాగిసో రబదా 3/34, డేల్ స్టెయిన్ 2/51, మోర్న్ మోర్కెల్ 2/57).

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు 2 వికెట్లకు 65): అయిడెన్ మర్‌క్రామ్ సి భువనేశ్వర్ కుమార్ బి హార్దిక్ పాండ్య 34, డీన్ ఎల్గార్ సి వృద్ధిమాన్ సాహా బి హార్దిక్ పాండ్య 25, కాగిసో రబదా సి విరాట్ కోహ్లీ బి మహమ్మద్ షమీ 5, హాషిం ఆమ్లా సి రోహిత్ శర్మ బి మహమ్మద్ షమీ 4, ఏబీ డివిలియర్స్ సి భువనేశ్వర్ కుమార్ బి జస్‌ప్రీత్ బుమ్రా 35, ఫఫ్ డు ప్లెసిస్ సి వృద్ధిమాన్ సాహా బి జస్‌ప్రీత్ బుమ్రా 0, క్వింటన్ డి కాక్ సి వృద్ధిమాన్ సాహా బి జస్‌ప్రీత్ బుమ్రా 8, వెర్నన్ ఫిలాండర్ ఎల్‌బి మహమ్మద్ షమీ 0, కేశవ్ మహారాజ్ సి వృద్ధిమాన్ సాహా బి భువనేశ్వర్ కుమార్ 15, మోర్న్ మోర్కెల్ సి వృద్ధిమాన్ సాహా బి భువనేశ్వర్ కుమార్ 2, డేల్ స్టెయిన్ 0 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం (41.2 ఓవర్లలో ఆలౌట్) 130.

వికెట్ల పతనం: 1-52, 2-59, 3-66, 4-73, 5-82, 6-92, 7-95, 8-122, 9-130, 10-130.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 11-5-33-2, జస్‌ప్రీత్ బుమ్రా 11.2-1-39-3, మహమ్మద్ షమీ 12-3-28-3, హార్దిక్ పాండ్య 6-0-27-2, రవిచంద్రన్ అశ్విన్ 1-0-3-0.

భారత్ రెండో ఇన్నింగ్స్ (లక్ష్యం 208): మురళీ విజయ్ సి ఏబీ డివిలియర్స్ బి వెర్నన్ ఫిలాండర్ 13, శిఖర్ ధావన్ సి (సబ్‌స్టిట్యూట్) క్రిస్ మోరిస్ బి మోర్న్ మోర్కెల్ 16, చటేశ్వర్ పుజారా సి క్వింటన్ డి కాక్ బి మోర్న్ మోర్కెల్ 4, విరాట్ కోహ్లీ ఎల్‌బి వెర్నన్ ఫిలాండర్ 28, రోహిత్ శర్మ బి వెర్నన్ ఫిలాండర్ 10, వృద్ధిమాన్ సాహా ఎల్‌బి కాగిసో రబదా 8, హార్దిక్ పాండ్య సి ఏబీ డివిలియర్స్ బి కాగిసో రబదా 1, అశ్విన్ సి క్వింటన్ డి కాక్ బి వెర్నన్ ఫిలాండర్ 37, భువనేశ్వర్ కుమార్ 13 నాటౌట్, మహమ్మద్ షమీ సి ఫఫ్ డు ప్లెసిస్ బి వెర్నన్ ఫిలాండర్ 4, జస్‌ప్రీత్ బుమ్రా సి ఫఫ్ డు ప్లెసిస్ బి వెర్నన్ ఫిలాండర్ 0, ఎక్స్‌ట్రాలు 1, మొత్తం (44.4 ఓవర్లలో ఆలౌట్) 135.

వికెట్ల పతనం: 1-30, 2-30, 3-39, 4-71, 5-76, 6-77, 7-82, 8-131, 9-135, 10-135.

బౌలింగ్: వెర్నన్ ఫిలాండర్ 15.4-4-42-6, మోర్న్ మోర్కెల్ 11-1-39-2, కాగిసో రబదా 12-2-41-2, కేశవ్ మహారాజ్ 4-1-12-0.

న్యూజిలాండ్‌తో హాకీ సిరీస్
శ్రీజేష్‌కు మళ్లీ చోటు



శ్రీజేష్

న్యూఢిల్లీ, జనవరి 8: న్యూజిలాండ్‌తో ఈనెల 17 నుంచి జరుగనున్న హాకీ సిరీస్‌లో భారత్ గోల్‌కీపర్ పి.ఆర్.శ్రీజేష్‌కు మళ్లీ చోటు దక్కింది. మోకాలి నొప్పితో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆయన గత ఏడాది జరిగిన కొన్ని కీలక మ్యాచ్‌లలో పాల్గొనలేకపోయాడు. అయితే, ప్రస్తుతం ఫిట్‌గా ఉండడంతో మళ్లీ ఎనిమిది నెలల విరామం తర్వాత అతనికి హాకీ జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. 2016లో జరిగిన జూనియర్ వరల్డ్ కప్‌లో అప్పటి యువ గోల్‌కీపర్ క్రిష్ణన్ బహదూర్ పాథక్ స్థానంలో చోటుదక్కించుకున్న శ్రీజేష్ భారత్ జట్టును గెలిపించాడు. ఇదిలావుండగా న్యూజిలాండ్‌లో జరిగే హాకీ పోటీలో 25 ఏళ్ల మన్‌ప్రీత్‌సింగ్ మిడ్‌ఫీల్డర్‌గా వ్యవహరించనుండగా, చింగ్లెన్‌సానా సింగ్ డిప్యూటీగా ఉంటాడు. న్యూజిలాండ్‌తో జరిగే ఆ మ్యాచ్‌లో బెల్జియం, జపాన్‌ను భారత్ జట్టు ఎదుర్కోనుంది. ఈ సిరీస్‌లో పాల్గొనే 20 మంది సభ్యుల జట్టు న్యూజిలాండ్‌లోని తౌరంగ, హామిల్టన్‌లో బెల్జియం, జపాన్ జట్లతో పోటీ పడుతుంది.

హెచ్‌సీయూ అధ్యక్షుడిగా
వివేక్ అనర్హుడు: వీహెచ్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 8: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న అవకతవకలపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సోమవారం వీహెచ్ విలేఖరులతో మాట్లాడుతూ హెచ్‌సీఏ పాలకవర్గం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు అంతర్జాతీయ, ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణలో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మ్యాచ్‌లద్వారా వచ్చే ఆదాయం, ప్రత్యేక గ్యాలరీ డబ్బులను దోచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్న వివేక్‌కు హెచ్‌సీఏ అధ్యక్షుడిగా కొనసాగే అర్హత లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అండతోనే వివేక్ అవినీతికి పాల్పడుతూ, హెచ్‌సీఏపై అధిపత్యం చెలాయిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో భావి క్రికెటర్లను తయారుచేయడానికి ప్రతిబంధకంగా మారిన హెచ్‌సీయూని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, దీనిపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. క్రీడలలో రాజకీయ నాయకుల జోక్యం తగ్గాలని, తెలంగాణలో క్రికెట్‌ను అదుకోవాలని హనుమంతరావు డిమాండ్ చేశారు.

ఇలావుంటే, భారత మాజీ కెప్టెన్ మహమ్మద్ అజరుద్దీన్‌ను సమావేశానికి అనుమతించకపోవడాన్ని హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ సమర్థించారు. ప్రాక్సీ ఓటింగ్‌కు అజర్ వచ్చాడని, అయితే, ఆ పత్రంపై సస్పెన్షన్‌కు గురైన కార్యదర్శి సంతకం ఉందని చెప్పారు. బీసీసీఐ నిబంధనలు, లోధా కమిటీ సిఫార్సులకు లోబడే పని చేస్తున్నామని, కొంత మంది చేస్తున్న విమర్శలు అర్థరహితమని అన్నారు.

చివరి టెస్టులో ఇంగ్లాండ్ చిత్తు

ఇన్నింగ్స్ తేడాతో ఆస్ట్రేలియా విజయం

సిడ్నీ, జనవరి 8: అన్ని విభాగాల్లోనూ అద్వితీయ ప్రతిభాపాటవాలు కనబరచిన ఆస్ట్రేలియా ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌ను 4-0 తేడాతో సొంతం చేసుకుంది. సోమవారం ఇక్కడ ముగిసిన చివరి, ఐదో టెస్టులో ఇంగ్లాండ్‌ను ఇన్నింగ్స్ 123 పరుగుల తేడాతో చిత్తుచేసింది. మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లకు 93 పరుగులు చేసిన ఇంగ్లాండ్ 88.1 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ జో రూట్ 58, వికెట్‌కీపర్-బ్యాట్స్‌మన్ జానీ బెయిర్‌స్టో 38 పరుగులు చేశారు. వీరిద్దరి వికెట్ల తర్వాత ఇంగ్లాండ్‌కు టామ్ క్యూరన్ కొంత సేపు అండగా నిలిచే ప్రయత్నం చేశాడు. అతను 23 పరుగులతో నాటౌట్‌గా ఉన్నప్పటికీ, మిగతా టెయిలెండర్లు ఒకరి తర్వాత మరొకరిగా పెవిలియన్‌కు క్యూ కట్టడంతో ఇంగ్లాండ్‌కు ఇన్నింగ్స్ ఓటమి తప్పలేదు. పాట్ కమిన్స్ 39 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. నాథన్ లియాన్ 54 పరుగులకు మూడు వికెట్లు కూల్చాడు. మిచెల్ స్టార్క్, జొష్ హాజెల్‌వుడ్ చెరొక వికెట్ సంపాదించారు.

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ ఇంగ్లాండ్ 112.3 ఓవర్లలో 346 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే. అందుకు సమాధానంగా ఆస్ట్రేలియా ఏడు వికెట్లకు 649 పరుగుల భారీ స్కోరువద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి, ఇంగ్లాండ్‌పై 303 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. ఈ లోటును భర్తీ చేసుకోవడం ఒక ఎత్తయితే, ఆలౌట్ కాకుండా జాగ్రత్త పడడం మరో ఎత్తుకాగా, జో రూట్ నాయకత్వంలోని ఇంగ్లాండ్ తీవ్రమైన ఒత్తిడి మధ్య రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టింది. ఫలితంగా ఆదివారం ఆట ముగిసే సమయానికి 93 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ జో రూట్ 43, బెయిర్‌స్టో 17 పరుగుల వ్యక్తిగత స్కోర్లతో ఆటను కొనసాగించారు. కానీ, ఎక్కువ సేపు పోరాటాన్ని కొనసాగించలేకపోయారు. రూట్ అర్ధ శతకాన్ని పూర్తి చేయడం మినహా, ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో చెప్పుకోదగ్గ అంశమేదీ లేదు. మొదటి ఇన్నింగ్స్‌లో నాలుగు, రెండో ఇన్నింగ్స్‌లో మరో నాలుగు చొప్పున మొత్తం ఎనిమిది వికెట్లు పడగొట్టిన పాట్ కమిన్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ సిరీస్ మొత్తం అద్భుతంగా రాణించిన ఆసీస్ కెప్టెన్ స్టీవెన్ స్మిత్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 112.3 ఓవర్లలో 346 ఆలౌట్ (అలస్టర్ కుక్ 39, జేమ్స్ విన్స్ 25, జో రూట్ 83, దావీద్ మలాన్ 62, మోయిన్ అలీ 30, టామ్ క్యూరన్ 31, పాట్ కమిన్స్ 4/80, మిచెల్ స్టార్క్ 2/80, జొష్ హాజెల్‌వుడ్ 2/65).

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 193 ఓవర్లలో 7 వికెట్లకు 649 డిక్లేర్డ్ (డేవిడ్ వార్నర్ 56, ఉస్మాన్ ఖాజా 171, స్టీవెన్ స్మిత్ 83, షాన్ మార్ష్ 156, మిచెల్ మార్ష్ 101, టిమ్ పైన్ 38 నాటౌట్, మోయిన్ అలీ 2/170, స్టువర్ట్ బ్రాడ్ 1/121, టామ్ క్యూరన్ 1/82, మాసన్ క్రేన్ 1/193).

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ (తొలి ఇన్నింగ్స్ లోటు 303 పరుగులు, ఓవర్‌నైట్ స్కోరు 4 వికెట్లకు 93 పరుగులు): 88.1 ఓవర్లలో 180 ఆలౌట్ (జో రూట్ 58, జానీ బెయిర్‌స్టో 38 టామ్ క్యూరన్ 23 నాటౌట్, పాట్ కమిన్స్ 4/39, నాథన్ లియాన్ 3/54, మిచెల్ స్టార్క్ 1/38, జొష్ హాజెల్‌వుడ్ 1/36).



ఆస్ట్రేలియా విజయంలో కీలక పాత్ర పోషించిన పాట్ కమిన్స్

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

వెన్నెల

ఆంధ్రభూమి

మంగళవారం, 9 జనవరి 2018






'అజ్ఞాతవాసి'లో పవన్ కళ్యాణ్

సంక్రాంతి సంగ్రామం!

బరిలో భారీ చిత్రాలు ★ సమరానికి సై అంటున్న స్టార్ హీరోలు

సంక్రాంతి పండుగ వస్తుందనగానే మన ఇళ్లల్లో, ముఖ్యంగా గ్రామాల్లో పండుగ వాతావరణం చోటు చేసుకోవడం మనం చూస్తున్నదే. ఎంతో సరదాగా నాలుగు రోజుల పాటు జరుపుకునే ఈ పండుగ సందర్భంగా వేయబోయే ముగ్గులు.. చేయబోయే వంటకాలు.. రాబోయే అతిథులు.. కొనబోయే దుస్తులు.. పాల్గొనబోయే పోటీలు.. ఇలా అన్నింటి గూర్చి మాట్లాడుకోవడం మొదలు పెడతాం. వీటన్నింటితో పాటు మనం ముఖ్యంగా చర్చించుకునేది పండుగలో భాగమైన సంక్రాంతి సినిమాల సంగ్రామం గూర్చి. సినీ ప్రియుల ఉత్సాహాన్ని రెట్టింపు చేసేవి సంక్రాంతి చిత్రాలే. టాలీవుడ్‌లో అతిపెద్ద సీజన్ సంక్రాంతి. వారం రోజులపాటు సెలవులు వుండే ఈ సీజన్‌లో అగ్ర కథానాయకుల చిత్రాలు విడుదలవుతుంటాయి. సంక్రాంతి ఒక సెంటిమెంట్‌గా భావించే స్టార్ హీరోలున్నారు.



సంక్రాంతి వచ్చిందంటే వెండితెరకు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షమే. ఈ సీజన్‌లోనే తమ చిత్రాలను విడుదల చేయడానికి ప్రతీ హీరో, దర్శక నిర్మాతలూ ఆ దిశగా సన్నాహాలు చేసుకుంటుంటారు. గత ఏడాది సంక్రాంతి పండుగ సమయం టాలీవుడ్‌కు బాగా కలిసొచ్చింది. మెగాస్టార్ చిరంజీవి 'ఖైదీ నంబర్.150', బాలకృష్ణ 'గౌతమీ పుత్ర శాతకర్ణి', శర్వానంద్ 'శతమానం భవతి' ఇలా వచ్చిన మూడు చిత్రాలు ఘన విజయాలు సాధించాయి. జనవరి నెలలో వచ్చే ఈ సంక్రాంతి సంగ్రామానికి ముఖ్యంగా ఈ ఏడు అంటే 2018కి రెండంటే రెండే చిత్రాలు నువ్వా.. నేనా? అన్న రీతిలో ప్రేక్షకుల ముందుకొచ్చి సందడి చేయబోతున్నాయి. అవి పవన్‌కళ్యాణ్ హీరోగా నటించిన 'అజ్ఞాతవాసి', బాలకృష్ణ 'జై సింహా'. వీటితో పాటు యువ హీరో రాజ్ తరుణ్ కథానాయకుడుగా నటించిన 'రంగులరాట్నం' తమిళ స్టార్ సూర్య హీరోగా నటించిన 'గ్యాంగ్' సైతం ఈ బరిలోనే అడుగుపెడుతున్నాయి. అయితే పోటీ విషయానికొస్తే మాత్రం రెండు అగ్ర హీరోల చిత్రాలనే పరిగణనలోకి తీసుకోవాలి. భారీ బడ్జెట్‌తో కోట్లు ఖర్చుపెట్టి తీసిన ఈ సినిమాలు సంక్రాంతి సంగ్రామానికి సై అంటే సై.. అంటున్నాయ్. ఇటు బాలయ్యకు, అటు పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌కు అభిమానులు ఎక్కువే. వీరి చిత్రాల విడుదల సమయంలో అభిమానుల హల్‌చల్ అంతా ఇంతాకాదు. 2018లో సంక్రాంతికి తమ అభిమాన హీరోల చిత్రాలు వస్తున్నాయంటే ఇక వీరి ఆనందానికి హద్దేముంటుంది? ముఖ్యంగా పవన్ కళ్యాణ్ 'అజ్ఞాతవాసి', బాలకృష్ణ 'జై సింహా' ఎన్నో అంచనాల మధ్య సంక్రాంతి సమరానికి సై అంటున్నాయి. 'ఈ సంక్రాంతి విజేతలం మేం అంటే మేమే' అంటూ ఆయా చిత్రాల హీరోలతో పాటు దర్శక నిర్మాతలూ బలమైన నమ్మకంతో వున్నారు.

పక్కా మాస్ నటనతో ఇప్పటికీ వన్నె తగ్గని నటుడిగా పేరు తెచ్చుకుంటూ నేటి తరం కుర్ర హీరోలతో పోటీపడుతున్న హీరో బాలకృష్ణ 'జై సింహా'గా కాలర్ ఎగరేస్తూ సంగ్రామం లోకి అడుగుపెడు తున్నారు. బాలకృష్ణ సినిమా అంటే రౌద్ర రసం, డైలాగులు, స్టెప్పులు.. వాటితో పాటు వినోదం కూడా! బాలయ్య కామెడీ చేస్తే భలే బాగుంటుంది దానికి బ్రహ్మానందం తోడైతే ఇంకా బాగుంటుంది. తెరపై వీళ్లిద్దరూ కలిస్తే ఎంతటి హంగామా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పంచ్‌ల మీద పంచ్‌లు పడిపోతాయి. 'జై సింహా'లో అలానే జరిగిందట. సి.కె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. నయనతార, హరిప్రియ, నటాషాదోషి కథానాయికలు. ముఖ్యమైన

-ఎం.డి అబ్దుల్

పాత్రల్లో బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్ నటిస్తున్న ఈ చిత్రానికి చిరంతన్ భట్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ చిత్రం 12న విడుదలవుతోంది. వేగంగా సినిమాను రూపొందిస్తారని దర్శకుడు కె.ఎస్.రవికుమార్‌కు పేరుంది. 'జై సింహా'ను అంతే వేగంగా షూటింగ్ జరిపి అనుకున్న టైమ్‌కే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. బాలయ్యకు సంక్రాంతి సెంటిమెంట్ వుంది. తనకు అచ్చివస్తుందన్న నమ్మకం బలంగా వుంది. బాలయ్య.. అనగానే శక్తిమంతమైన సంభాషణలే గుర్తుకు వస్తాయి. ప్రతీ సినిమాలోనూ ఆయన శైలికి తగ్గట్టుగా సంభాషణల్ని పొందు పరచాలని తాపత్రయ పడుతుంటారు దర్శకులు, రచయితలు. సాదాసీదా సంభాషణని సైతం బాలయ్య పలికితే ఆ కిక్ వేరేలా ఉంటుంది. అందుకే బాలయ్య సినిమాల్లో మాటలు తూటాల్లా పేలుతుంటాయి. 'జై సింహా'లోనూ అలాంటి సంభాషణలు వినే అవకాశం ఉంది. టీజర్‌లో మచ్చుకకి ఒకటి రుచి చూపించారు కూడా. 'సింహం మౌనాన్ని సన్యాసం అనుకోవద్దు' అంటూ బాలయ్య తన ఉగ్రరూపం చూపించారు. బాలయ్య 102వ చిత్రమిది. 'సింహా' అనే శబ్దం నందమూరి బాలకృష్ణకు బాగా కలిసొచ్చింది. 'లక్ష్మీ నరసింహా', 'సమర సింహారెడ్డి', 'నరసింహానాయుడు', 'సింహా' ఇలా.. ఆ పేరు టైటిల్‌లో కనిపించినప్పుడల్లా విజయాన్ని అందుకున్నారు. ఈ సారి ఆయన 'జై సింహా'గా మరోమారు సింహా పాత్రలో అభిమానులను అలరించబోతున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఎన్‌టిఆర్ విగ్రహం.. దాని చుట్టూ వేలాది జనం.. మధ్యలో బాలయ్య. మొత్తంగా చూస్తే ఓ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నట్లు కనిపిస్తుందా దృశ్యం. ఈ చిత్రాన్ని బాలయ్య శైలి, మాస్ అంశాలతో తెరకెక్కిస్తున్నారు. బాలయ్య పాత్ర ఆయన కనిపించే విధానం కొత్తగా ఉంటుందని చిత్ర బృందం చెబుతోంది. "అనుభవజ్ఞులైన నటీనటులు, సాంకేతిక నిపుణులూ ఈ చిత్రానికి పనిచేశారు. సెంటిమెంట్ నచ్చే వాళ్లకు, యాక్షన్ కోరే వాళ్లకు, ప్రేమ సన్నివేశాలు ఇష్టపడే వాళ్లకు.. ఇలా అందరికీ ఈ సినిమా నచ్చుతుంది" అంటున్నారు దర్శకుడు కె.ఎస్.రవికుమార్. "ఓ హీరోతో సినిమా తీస్తే, అది బాగా ఆడకపోతే డేట్లు ఇవ్వడానికి ఆలోచిస్తారు. కానీ బాలయ్య అలాకాదు. 'పరమవీరచక్ర' తరువాత కూడా పిలిచి మరీ అవకాశం ఇచ్చారు. మా చిత్ర బృందం పనితనమేమిటో, ఈ సినిమాపై మేం ఇంత నమ్మకం ఎందుకు పెట్టుకున్నామో ఈ సినిమా విడుదల తర్వాతా తెలుస్తుంది. బాలయ్య ఫైట్లకి ఎలా చప్పట్లు కొడతారో, ఈ సినిమాలో సెంటిమెంట్ సీన్లకూ అలాంటి స్పందనే అందిస్తారు. సంక్రాంతికి ఈ సినిమా విడుదలవుతుందంటే చాలా మందికి నమ్మకం లేదు. కానీ అనుకున్నట్టుగానే మా సింహాన్ని సంక్రాంతికే తీసుకువచ్చాం" అని నిర్మాత సి. కళ్యాణ్ చెప్పారు.

"నాన్నగారు నిర్మాతగా అప్పట్లో రెండు సినిమాలు తీశారు. తోడుదొంగలు, పిచ్చిపుల్లయ్య. ఇవి సరిగా ఆడలేదు.. బాగా నష్టపోయారు. అయితే వీటికి ఉత్తమ చిత్రాలుగా రాష్ట్రపతి బంగారు పతకాలు వచ్చాయి. అలాంటి సమయంలో 'జయసింహ' తీసి ఘన విజయం సాధించారు. ఆ టైటిల్‌తోనే నేనూ ఈ సినిమా చేయడం ఆనందంగా వుంది. మాయాబజార్, నర్తనశాల, పాండవ వనవాసం, శ్రీ కృష్ణ పాండవీయం, దానవీర శూరకర్ణ ఇలాంటి గొప్ప చిత్రాలు చేసే అదృష్టం నాన్నగారికి దక్కింది. ఆ తర్వాత అది నాకు అబ్బింది. సి.కళ్యాణ్‌తో ఇది వరకు తీసిన 'పరమవీరచక్ర' నాకెంతో నచ్చింది. దాసరి గారితో చేయాలన్న కోరిక ఆ సినిమాతో తీరింది. కె.ఎస్.రవికుమార్‌తో పనిచేయాలని ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నా. ఎందుకో కుదరలేదు. ఇలాంటి సినిమా చేయాలని ఆగామేమో" అన్నారు బాలయ్య ఒక సందర్భంలో.

సంక్రాంతి హీరోగా బాలకృష్ణకు పేరుంది. ఆయన నటించిన చిత్రాలు పండక్కి చాలానే విడుదలయ్యాయి. బాలయ్య సినిమా సంక్రాంతికి విడుదలవుతుందంటే విజయం ఖాయమనే ధీమా అటు పరిశ్రమతో పాటు, ఇటు అభిమానుల్లోనూ కనిపిస్తుంటుంది. గత ఏడాది సంక్రాంతికి 'గౌతమీపుత్ర శాతకర్ణి'గా ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. 'జై సింహా'తో మరోసారి సంక్రాంతి సందడి (మిగతా 12వ పేజీలో...)

పవన్‌కళ్యాణ్- త్రివిక్రమ్‌ది సూపర్‌హిట్ కాంబినేషన్. వీరిద్దరూ 'జల్సా'తో హంగామా సృష్టించారు. 'అత్తారింటికి దారేది'తో టాలీవుడ్ రికార్డులను బద్దలు కొట్టారు. అందుకే ఈ 'అజ్ఞాతవాసి'పై అంచనాలు పెరిగాయి. అమెరికాలో అత్యధిక సెంటర్లలో విడుదల చేస్తుండడంతో ఈ విషయంలో 'బాహుబలి' రికార్డులను కూడా బద్దలు కొట్టింది. విడుదలకు ముందే దాదాపు పది కోట్లకు పైగా వ్యాపారం జరిగిందని చెబుతున్నారు. ఆశించిన స్థాయిలో సినిమా విజయవంతమయితే 'అజ్ఞాతవాసి' వంద కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం. ప్రవాసంలో ఉన్న ఓ రాకుమారుడిలా పవన్‌కళ్యాణ్ వినోదాలు పంచబోతున్నారు. 'జల్సా', 'అత్తారింటికి దారేది' తర్వాత పవన్-త్రివిక్రమ్ కలయికలో వస్తున్న చిత్రం కావడంతో సహజంగానే ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఈ సంక్రాంతికి సరికొత్త రికార్డుల్ని సృష్టించే చిత్రమవుతుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.



'జై సింహా'లో బాలకృష్ణ, నయనతార



మీ వ్యూస్


కుటుంబ కథా చిత్రమ్

పిచ్చి పట్టింది!

గతంలో సుధీర్‌బాబు, మారుతి కాంబినేషన్‌లో 'ప్రేమకథా చిత్రమ్' నచ్చింది. హారర్ కామెడీతో అదరగొట్టిన ఈ సినిమా తరహాలోనే థ్రిల్లర్ అన్నారు కదా అని ఈమధ్య వచ్చిన 'కుటుంబ కథా చిత్రమ్' పోస్టర్ చూసి సినిమాకెళితే పిచ్చిపట్టింది. ఇలాంటి చిత్రాన్ని తెరకెక్కించిన మహారాజశ్రీ దర్శకుడికి శతకోటి వందనాలు. ఆ టైటిల్ ఏంటో, ఆ సినిమా ఏంటో, ఆ కలల గోలేంటో అర్థమైతే ఒట్టు. మొత్తంగా ఈ చిత్ర రాజాన్ని కిచిడి చేసి పారేశారు దర్శక ప్రభుద్ధుడు. డబ్బులిచ్చి తల బొప్పి కట్టించుకోవడం అంటే ఇదే కామోసు!

-వాడపర్తి వెంకటరమణ, గొల్లలవలస

మూసధోరణిలో...

2017 సంవత్సరంలో దాదాపు 200 తెలుగు సినిమాలు విడుదలవ్వగా పట్టుమని పది సినిమాలు కూడా ప్రజాదరణ పొందలేదు. వీటిలో గుర్తుంచుకోదగిన సినిమాలు అతి తక్కువ. ఒకప్పుడు మన తెలుగు సినిమాలు అద్భుత విజయాలు, అవార్డులు, రివార్డులతో విశ్వవిఖ్యాతి గాంచినాయి. అనేక సంవత్సరాల తర్వాత మన తెలుగు సినిమా 'బాహుబలి' జాతీయ పురస్కారం సాధించింది. ఇపుడు తెలుగు సినిమా నిర్మాతల, దర్శకుల ధోరణి చాలా మారిపోయింది. దీన్ని బట్టి ఇమేజ్ చట్రంలో సినిమాలు మూసధోరణిలో తీస్తున్నారు. ఒక విధానంలో తీసిన సినిమా (డబ్బింగ్ అయినా) సక్సెస్ అయితే ఆ ధోరణిలో 20-30 సినిమాలు వరుసగా వచ్చి ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. 2017 లో ఖైదీ నెంబర్ 150, శతమానంభవతి, బాహుబలి-2 తదితర సినిమాలు ప్రజాదరణ పొందాయి. పెళ్లిచూపులు, ఘాజి, గౌతమీపుత్ర శాతకర్ణి లాంటి సినిమాలు హిట్ కాకున్నా విమర్శకుల ప్రశంసలు పొందాయి. టీవీ మాధ్యమం విభిన్నమైన ప్రసారాలు 24 గంటలు అందిస్తున్న తరుణంలో ఆ పోటీని తట్టుకొని ప్రేక్షకులు మెచ్చే విధంగా సినిమాలు నిర్మించడం నిస్సందేహంగా కత్తిమీద సాములాంటిదే. అయి మంచి సినిమాలు, సామాజిక ప్రయోజనం, మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా చిత్రాలు తీయాలన్న జిజ్ఞాస, తపన, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అదేం అసాధ్యం కాదు. మసకబారిపోతున్న తెలుగు సినిమాల ప్రతిష్ఠను పెంపొందించేందుకు టాలీవుడ్ కృషి చేయాలి.

-జి.అశోక్, గోదూర్

పాటకు చిరునామా..

19 డిసెంబర్, మంగళవారం ఆంధ్రభూమి వెన్నెలలో బాబ్జి వ్రాసిన మధరమైన పాట పేరు మహమ్మద్ రఫీ హిందీ గానప్రియులను అలరించేలా ఉంది. సమ్మోహన గాయకుడు మహమ్మద్ రఫీ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన గానం అమరం. అప్పట్లో భాషాభేదం లేకుండా రేడియోలో రఫీ పాటలు 'బినాకా గీత్ మాలా'లో వినని శ్రోతలుండరు. అంటి మహా గళం కూడా అవకాశాల కోసం, సినిమా ఆఫీసుల చుట్టూ తిరగడం, స్టూడియోల చుట్టూ ప్రదక్షిణలు చేయవలసి రావడం, చేతిలో పని లేక పస్తులు ఉంటూ ఆకలిరాగలా ఆలపించడం హృదయవిదారకం. ఒక ప్రపంచ ప్రసిద్ధుడైన రఫీకి జయంతే వుంటుందని చెప్పిన వ్యాస రచయిత బాబ్జీ అభినందనీయులు.

-యం.రమణకుమారి, హైదరాబాద్

మధురాతిమధురం..

హిందీ, తెలుగు చిత్రసీమలో మధురంగా పాడగలిగిన గాయకులెందరో వున్నా మధురాతిమధురంగా పాడి భాష ఉన్నంతకాలం సప్త స్వరాలు జీవించినంతకాలం బ్రతికే గాయక శిఖామణులు మహమ్మద్ రఫీ, మన ఘంటసాల అని ఘంటాపథంగా చెప్పవచ్చు. వీరిద్దరూ కనీసం షష్టిపూర్తి అయినా చేసుకోకుండా ఏదో సమయం మించిపోతోంది అని చిత్ర పరిశ్రమను, అభిమానులను వీడి వెళ్లిపోయారు. వీరి తరువాత వచ్చిన గాయకులు ఎంత బాగా పాడుతున్నా వీరిద్దరి గళాల కళాత్మక మాధుర్యాన్ని మించి పాడటం అసంభం. వీరెప్పుడు మరువలేని సుమధుర గాయకులుగానే ప్రథమ స్థానంలో శాశ్వతంగా నిలవగలరు. కనుకే మరణించారనే భావన కలుగదు. అందుకే వీరికి జయంతులు ఉంటాయి కాని వర్ధంతులు ఉండవు. మధురమైన పాట పేరు మహమ్మద్ రఫీ అనే మాట అక్షర సత్యం.

-ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

సినిమా చూడరా!

హైదరాబాద్‌లో జరిగిన తెలుగు సభలలో అందరూ తెలుగులోనే మాట్లాడారు. పాఠశాలల స్థాయి వరకు తెలుగు చదవాలని అన్నారు. వీరంతా మన తెలుగు సినిమాలలో ఇంగ్లీషు పదాలు లేని స్వచ్ఛమైన తెలుగు మాటలు ఉండాలని అనరెందుకు? వారు సినిమాలు చూడరా?

-డొక్కా యుగంధర్, ఒక్కలంక

ప్రశ్నలు - జవాబులు

తారల ఇంటర్‌వ్యూలు రాను రాను బోర్ కొడుతున్నాయి. ఇంచుమించు అన్నీ రొటీన్ ప్రశ్నలు, రొటీన్ జవాబులే. జిందగీ సక్సెస్‌ని మీరు ముందుగా ఊహించారా? అంటూ చచ్చుప్రశ్న. జవాబు మనం ఊహించుకోవచ్చు. అయితే మొదటి మూడు రోజులే ఆ చిత్రానికి సొమ్ములొచ్చాయి. తరువాత ఢమాల్. నష్టం మిగిలింది. ఇలాగే వుంటాయి అన్ని ప్రశ్నలు, డాబుసరి జవాబులు!

-ఆర్.శాంతి సమీర, వాకలపూడి

జగ్గయ్య గురువు

జీవిత మార్గంలో కొన్ని కొన్ని సంఘటనలు విచిత్రంగా వుంటాయి. జమున చదువుకొనే రోజులలో దుగ్గిరాల పాఠశాలలో జగ్గయ్య గురువుగా విద్యాబోధన చేశారు. అదే పాఠశాలలో జమున చదువుకున్నారు. ఆ తరువాత 1953లో పుట్టిల్లుతో గరికపాటి రాజారావు చిత్రంతో చిత్ర పరిశ్రమకు వచ్చారు. ప్రభాకర్ రెడ్డి ఎంబిబిఎస్ డాక్టర్ కావలసిన సమయంలో యాక్టర్‌గా మారారు. హైదరాబాద్‌లో ప్రభాకర్ రెడ్డి మెడిసిన్ చదివే సమయంలో మేనమామ డా.హనుమంతరావు ప్రభాకర్‌రెడ్డికి గురువు. జీవితపథంలో ఆశ్చర్యపరిచే పలు సంఘటనలు జరుగుతుంటాయి. అది దైవలీల.

-కొవ్వూరు వెంకటేశ్వర ప్రసాదరావు, టంగుటూరు



చిక్కడు - దొరకడు

ఫ్లాష్‌బ్యాక్ @50

గుడివాడ తాలూకా కొత్త నిమ్మకూరుకు చెందిన ధాన్యం వ్యాపారి కుదరవల్లి నరసయ్య, వీరి కుమారుడు కుదరవల్లి సీతారామస్వామి. కొంతకాలం ధాన్యం వ్యాపారం, కొంతకాలం బస్ కండక్టర్‌గా పనిచేశారు. 1967లో వీరి స్నేహితులు పొట్లూరి వెంకట నారాయణరావుతో కలిసి లక్ష్మీనారాయణ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించిన చిత్రం 'చిక్కడు-దొరకడు. ఆ తరువాత పొట్లూరి వెంకట నారాయణ వీడిపోయినా, 'కదలడు-వదలడు', 'రైతేరాజు', 'నా పేరే భగవాన్', 'ముగ్గురూ ముగ్గురే' చిత్రాలు- ఆపైన 'మామా అల్లుళ్ళ సవాల్' కైకాల సత్యనారాయణ సమర్పణలో నిర్మించారు. ఈ చిత్రం 21-12-1967న విడుదలైంది.

మంత్రాలు, మాయలు, జంతువులతో విన్యాసాలు, దెయ్యాలు, భూతాలతో కూడిన పలు విజయవంతమైన జానపద చిత్రాల నిర్దేశకునిగా, నిర్మాతగా, జానపద బ్రహ్మగా వాసిగాంచిన బి.విఠలాచార్య ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, దర్శకత్వం నిర్వహించారు.

ఈ చిత్రానికి రచన వేటూరి, కళ బి.నాగరాజన్, స్టంట్స్ శివయ్య, ఫొటోగ్రఫీ హెచ్.ఎస్.వేణు, ఎడిటింగ్ ఎస్.గోవిందస్వామి, సంగీతం టి.వి.రాజు, నృత్యం చిన్ని, సంపత్, పాటలు వీటూరి, నారాయణరెడ్డి. చిత్రంలో టైటిల్స్ వెరైటీగా రూపొందించడమేకాక స్పెషల్ ఎఫెక్ట్స్ కూడా చూపినవారు కె.ఎస్.మణి, కో-డైరెక్టర్ వైకుంఠం రామస్వామి, బి.వి.శ్రీనివాస్, నిర్మాతలు పొట్లూరి వెంకట నారాయణ, కుదరవల్లి సీతారామస్వామి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం- బి.విఠలాచార్య.

3వ రాజ వంశాలకు చెందిన కథ. మాళవరాజ్య ప్రభువు మిక్కిలినేని, భార్య సునందాదేవి (మోహన) సంతానం లేక విచారిస్తుంటారు. వారికి జటానంద స్వామి (వడ్లమాని విశ్వనాథ) సంతాన కామేశ్వరి ప్రసాదంగా రెండు మామిడిపండ్లనిచ్చి, వాటిని భుజిస్తే మహారాణి సంతానవతి అవుతుందని చెబుతాడు. వాటిని భుజించిన మహారాణి ఇద్దరు కవల పిల్లల్ని కంటుంది. మహారాజు బావమరిది త్యాగరాజు, తన కుమారుడు ప్రచండుడికి రాజ్యం లభించాలని ఆ పిల్లల్ని హతమార్చమని భటులను నియమిస్తాడు. వారు ఆ పిల్లల్ని చంపక అడవిలో విడి విడిగా వదిలివేస్తారు. దొంగల నాయకునికి దొరికిన బిడ్డ చిక్కన్న దొర (ఎన్‌టిఆర్) నాయకునిగా ఎదుగుతాడు. ధనవంతులను దోచి, పేదలకు పంచుతుంటాడు. ఛాయాదేవి దంపతులకు దొరికిన బిడ్డ అన్ని విద్యలు నేర్చి, దిలీప్ చక్రవర్తి పేరిట ధనం లేకపోయినా యుక్తితో పొరుగు రాజు స్నేహం సంపాదించి సత్రాలు నిర్మించి పేరు తెచ్చుకుంటాడు. దొరకడుగా మరో పేరుతో (కాంతారావు) పిలవబడుతుంటాడు. పుష్పగిరి రాజ్యంలో మంజరి (విజయలలిత) అనే వేశ్య ఎందరినో ఇబ్బంది పెడుతుందని తెలుసుకున్న చిక్కడు ఆమెను మోసగించి ధనం కొల్లగొడతాడు. ఆ దేశ మహారాణి ప్రియంవదదేవి (జయలలిత) మారువేషంలో అతన్ని కలుసుకొని అతని మంచితనం గ్రహించి ఇష్టపడుతుంది. అదేవిధంగా దిలీపుడు పాంచల రాజకుమారి పద్మావతి (కృష్ణకుమారి)ని అనుకోకుండా కలుసుకొని, ఆమెను ప్రేమించి, ఆమె ప్రేమ పొందుతాడు. మాళవ రాజ్య ప్రతినిధిగా ఉన్న ప్రచండుడు (సత్యనారాయణ) తండ్రి సలహాతో భువనేశ్వరి ఆలయంలో గల నిధి కోసం పాంచాల, పుష్పగిరి రాజ్యాలలో వున్న హారాల కోసం ప్రయత్నిస్తుంటాడు. ఈ విషయం గ్రహించిన చిక్కడు, దొరకడు వారి ప్రేయసిలతో కలిసి హారాల కోసం ఒకరిపై ఒకరు ఎత్తులు వేసుకుంటారు. చివరికి మూడు హారాలను సంపాదించిన చిక్కడు, దొరకుడు నిధిని కైవసం చేసుకునే సమయానికి ప్రచండుడు సైన్యంతో అడ్డుపడగా, వానిని, వాని తండ్రిని అంతం చేయటం, నిధికి కాపలాగా వున్న యోగి ద్వారా, ఈ వంశాలకు చెందిన పెద్దలే ఈ నిధిని దాచారని, దాని వారసులకే అది లభించిందని తెలియజేయడం, నిజ తల్లిదండ్రులను కలుసుకొని, రాకుమారులిరువురూ రాకుమార్తెలను వివాహం చేసుకోవడంతో చిత్రం సుఖాంతంగా ముగుస్తుంది.



ఈ చిత్రంలో ఇంకా బాలకృష్ణ, మీనాకుమారి, మోదుకూరి సత్యం, జగ్గారావు నటించారు. చిక్కడు-దొరకడు చక్కని అలరించే సన్నివేశాల కూర్పుతో ఆహ్లాద భరితంగా రూపుదిద్దుకుంది. చిక్కడు నాయకునిగా నెగ్గటానికి ముళ్ల గదలు వేలాడుతూ తిరుగుతుండడం వాటిమధ్య నుంచి వంగకుండా, తమాషాగా వెళ్ళడం, నువ్వులు చేత్తో పిండి నూనె తీయటం, తాటిచెట్టును ఒక్క వేటుతో నరకటం, మహారాణి ప్రియంవద హారాన్ని తెలివిగా కాజేయటం, పద్మావతి సైగలతో తన గురించి చెప్పటం, తెరలమధ్య ఆమె ఉనికి దొరకడు గుర్తించటం, చిక్కడు, దొరకడు హారాలను తెలివిగా దాచటం, దాన్ని మరొకరు తస్కరించటం, రాజసభలో రెండుసార్లు హారాలను చేజిక్కించుకోవటం, వారిరువురి కత్తియుద్ధంలో తొలుత ఎన్‌టిఆర్ చేతిపై 'చి' అక్షరం, కాంతారావు 'దొ' అక్షరం ఎన్‌టిఆర్ వ్రాయటంతో మొదలై చిక్కడు-దొరకడు అని వారు పేర్లు వ్రాయటం తమాషాగాను, చివర్లో నిధి కోసం వినాయకుడు, హనుమంతుడు, గరుత్మంతుడు విగ్రహాలు, భువనేశ్వరి విగ్రహంపై సత్యనారాయణతో ఫైట్ ఎంతో థ్రిల్లింగ్‌గా, అర్థవంతంగా సన్నివేశాలను విఠలాచార్య రూపొందించి చిత్రీకరించారు. సన్నివేశానుగుణమైన అర్థవంతమైన సంభాషణలతోపాటు కొన్ని తమాషా పదాలు 'జంబాల బాతూ పెట్టవే గుడ్డు', ఊరిపేరు మూతినాకుడుపాలెం, హీరో పేరు 'దాని మొగుడు' వంటివి జతగూర్చారు వీటూరి.

సమర్థవంతులైన నటీనటులు ఎన్‌టిఆర్, జయలలిత, కాంతారావు, కృష్ణకుమారి, సత్యనారాయణ ఎంతో ఈజ్‌తో తమ పాత్రలను పోషించి మెప్పించారు. ఎన్‌టిఆర్ తనదైన ప్రత్యేక జానపద స్టయిల్‌ను ఈ చిత్రంలోనూ అలరించేలా హుషారుగా ప్రదర్శించగా, వారికి ధీటుగా జయలలిత అంతే ప్రతిభను నటనలో, నృత్యాలలో ముఖ్యంగా నాగిని నృత్యంలో ఆనందింపజేయటం మెచ్చుకోతగ్గది. చక్కని ఫొటోగ్రఫీ, అందమైన సెట్టింగ్స్, రాజభవనాలు, ఉద్యానవనాలలో విడిగా చిత్రీకరించిన గీతాలు, నృత్యాలు, సంగీతం ఈ చిత్రాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దాయి.

చిత్ర గీతాలు- నకిలీ మహారాణి ముందు గీతం జయలలిత, ఎన్‌టిఆర్, కాంతారావులపై చిత్రీకరణ 'అందాలన్నీ నీవే ఆనందాలన్నీ' (పి.సుశీల, బి.వసంత, ఘంటసాల, రఘురాం- రచన సి.నారె), జయలలితపై వీధిలో నృత్యగీతం, ప్రజలు, ఎన్‌టిఆర్‌లపై చిత్రీకరణ 'ఓ లచ్చి ఇన రయ్యో ఓ లమ్మీ' గానం (పి.సుశీల, రచన సినారె), కాంతారావు, కృష్ణకుమారిలపై తొలుత పద్యం కాంతారావుపై మొదలై ముగిశాక పాట 'విరిసిన ఇంద్రచాపమో పద్యం పాట పగటి పూట చంద్ర బింబం' (పి.సుశీల- సినారె) జయలలిత, మీనాకుమారి బృందంపై జలక్రీడల గీతం 'ఇంతలో ఏదో జరిగింది వింతగా' (పి.సుశీల -సినారె), కృష్ణకుమారి చెలులపై గీతం 'కన్నెపిల్ల అనగానే అందరికీ అలుసే' (పి.సుశీల, వీటూరి), ఎన్‌టిఆర్, జయలలిత గీతం హుషారుగా సాగుతుంది. 'దొర నిమ్మ పండులాగా ఊరించే దొరసాని' (ఘంటసాల, పి.సుశీల, రచన-సినారె), విజయలలిత, ఎనటిఆర్‌లపై గీతం 'ఇదిగో నేనున్నాను ఎదురుగా' (పి.సుశీల, రచన-సినారె), చిత్ర ప్రారంభంలో మోహనపై చిత్రీకరించిన ప్రార్థన పద్యం 'అమ్మా ఆశ్రిత కల్పవల్లి' (పి.సుశీల రచన వీటూరి) ఘంటసాల, పి.బి.శ్రీనివాస్ ఆలపించిన పోటీగా సాగే గీతం, ఎన్‌టిఆర్, కాంతారావులపై చిత్రీకరణ 'ఔరా వీరాధివీరా ఔరౌరా' (రచన సినారె) అలరించేలా సాగుతుంది.

'చిక్కడు-దొరకడు' చిత్రం చక్కని సన్నివేశాల కూర్పుతో, సంగీత, నృత్య అలరింపులతో మేటి నటీనటుల కాంబినేషన్ దానికి తగ్గ నటనతో విజయవంతమైన చిత్రంగా నిలిచింది. ప్రేక్షకాదరణ పొంది, ఆర్థిక విజయాన్ని సాధించింది. ఈ చిత్రాన్ని 1977 దర్శక నిర్మాత ఎల్.వి.ప్రసాద్ తమ ప్రసాద్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హిందీలో 'జయ్ విజయ్'గా స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. కె.బి.పాఠక్ డైలాగులు, పాటలు మజ్రు సుల్తాన్‌పురి వ్రాశారు. సంగీతం రాజేష్ రోషన్ సమకూర్చారు. జితేంద్ర, రీనారాయ్, బిందియాగోస్వామి, ప్రేమ్ కృష్ణ ప్రధాన పాత్రలు పోషించారు. 1977 జనవరి 1న విడుదలైంది.

-సి.వి.ఆర్.మాణిక్యేశ్వరి

సంక్రాంతి బరిలో గెలిచేదెవరు?

తెలుగు సినిమా పరిశ్రమకు ఒక ఆచారం వుంది. అదేంటంటే ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగకు పెద్ద బడ్జెట్ సినిమాలను విడుదల చేయడం. అంటే కేవలం పెద్ద సినిమాలనే కదా, చిన్న హీరోలు నటించిన సినిమాలు, చిన్న బడ్జెట్‌తో నిర్మించిన సినిమాలు కూడా విడుదలవుతాయి. కానీ పెద్ద హీరోల సినిమాలు, పెద్ద బడ్జెట్‌తో నిర్మించిన సినిమాలు ప్రదర్శించటానికే తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సినిమా థియేటర్లు సరిపోవు. ఇంకా చిన్న చిన్న సినిమాలు ప్రదర్శించటానికి ఏసి థియేటర్లు కాకున్నా మామూ లు మండల కేంద్రాల్లో ఉన్న థియేటర్లు కూడా ఖాళీగా ఉండవు. బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఎక్కువ ధరలకైనా థియేటర్లను నడిపిస్తారు. చిన్న సినిమాలకేమో అంత స్థాయిలో బడ్జెట్ ఉండదు. ఇంతకుముందు రీళ్ళ ద్వారా సినిమాను ప్రదర్శించేవారు. ఇప్పుడేమో ఆ పరిస్థితి లేదు. అంతా ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకొని దానికి తగ్గ నగదు ఇచ్చి సినిమాను నడపించుకోవడం పరిపాటయ్యింది. ఇదం తా చిన్న హీరోలు, నిర్మాతలు, టెక్నీషియన్లకి కొంత తలనొప్పిగానే వుందని చెప్పవచ్చు. చిన్న సినిమాలకే కాదు.. ఒక్కోసారి పెద్ద సినిమాలకు కూడా చిక్కులు ఎదురవుతాయి.



ఇప్పుడు సంక్రాంతికి త్రివిక్రమ్- పవన్‌కళ్యాణ్ కాంబినేషన్‌లో అజ్ఞాతవాసి విడుదల వుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన జల్సా, అత్తారింటికి దారేది? సినిమాలు రెండూ బాక్సాఫీస్ రికార్డులు బద్దలుకొట్టాయి. అదేకోవలో అజ్ఞాతవాసి కూడా సంక్రాంతి పండుగకు విడుదల చేసి పాత రికార్డును బద్దలుకొట్టేయాలని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. అలాగే బాలకృష్ణ జై సింహా చిత్రం తో పాటు రాజ్‌తరుణ్ రంగులరాట్నం, సూర్య గ్యాంగ్ చిత్రాలు కూడా ఈ సంక్రాంతికే విడుదలవు తున్నాయి. నాగబాబు కుమారుడు సాయివరుణ్‌తేజ్ 'ఫిదా' తో తెలుగు ప్రేక్షకుల మనసుల్ని దోచేసుకున్నాడు. ఇపుడు చిన్నాన్న పవన్‌కళ్యాణ్ నటించిన 'తొలి ప్రేమ' టైటిల్‌తో బివిఎస్‌ఎన్ ప్రసాద్ దర్శకత్వంలో తీసిన సినిమా కూడా ఇదే వరుసలో ఉంది. మరొక సినిమా 'మనసుకు నచ్చింది' ఘట్టమనేని మం జుల దర్శకత్వంలో వస్తోంది. సూర్య నటించిన చిత్రం 'గ్యాం గ్' విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో విడుదలకు సిద్ధంగా ఉంది. సుబ్రహ్మణ్యం.ఆర్.వి దర్శకత్వం వహించిన సినిమా 'ఇగో (ఇందు-గోపి) కూడా వారంలోనే విడుదలకు సిద్ధంగా ఉంది. తెలుగు చిత్ర పరిశ్రమ ఆచారాల ప్రకారం చూసినట్లయితే 2018 సంక్రాంతికి ఏ సినిమా విడుదలవుతుందో, ఏది ఆగిపోతుందో, విడుదలయిన వాటిలో ఏది బాక్సాఫీస్ రికార్డును బద్దలుకొడుతుందో చూడాలి మరి! ఏది ఏమైనా 2018 సంక్రాంతికి అనుకున్నన్ని సినిమాలు విడుదల కావడంలేదు, కావేమో కూడా!

ఇదేకాక 2018 సంవత్సరంలో పూర్తికావాల్సినవి 'సాహో' ప్రభాస్ హీరోగా నటిస్తున్న సినిమా, చిరంజీవి 151వ సనిమా 'సైరా నరసింహారెడ్డి', రామ్‌చరణ్ నటిస్తున్న 'రంగస్థలం' సుకుమార్ దర్శకత్వంలో తీస్తున్న సినిమా, ఇవే కాకుండా రజనీకాంత్ 2.0 సినిమాలే కాకుండా తెలుగు చిత్ర పరిశ్రమ 2018 సంవత్సరంలో ఎన్ని సినిమాలు షూటింగ్‌లు పూర్తిచేసుకుని దిగ్విజయాన్ని సాధిస్తాయో చూడాలి మరి! 2018 సంవత్సరం సంక్రాంతి బరిలో నిలిచేదెవరో, గెలిచేదెవరో ముందు ముందు తెలుస్తుంది. గత సంక్రాంతి మాదిరిగా ఉత్సాహం అయితే పరిశ్రమలో కనిపించడంలేదనే చెప్పాలి. ఈ సంక్రాంతికి చాలా తక్కువ సినిమాలే విడుదలవుతున్నాయి. కొన్ని కొన్ని సినిమాలు ఎప్పుడో మొదలయినప్పటికీ షూటింగ్ పూర్తికాక కొన్ని, టెక్నికల్ సమస్యలతో కొన్ని ఆలస్యమవుతున్నాయి. షూటింగ్ జరుపుకుంటున్న సినిమాలన్నీ 2018 సం.లో విడుదల అయ్యి వాటి సత్తా చాటాలని ఆశిద్దాం!

-శ్రీనివాస్ పర్వతాల

డియర్ ఫ్రెండ్స్.. ఈ లింక్ క్విజ్ మీ కోసమే...

ఏ సినిమాలో ఎవరు నటించారు? దర్శకుడెవరు? సంగీతం ఎవరిచ్చారు? ఆయా చిత్రాల్లో సన్నివేశాల మధ్య లింకులు, సంక్షిప్తతలు, అవి చూడగానే గుర్తొచ్చే విషయాలే ఈ లింక్ పజిల్ స్పెషాలిటీ. ఒకదానికొకటి సంబంధం లేని రెండు విషయాలు చదవగానే -వాటిమధ్యనున్న 'బంధం' తక్కున గుర్తుకొచ్చిందంటే ప్రశ్నకు సమాధానం దొరికేసినట్టే. కొత్త పజిల్‌ను ఎంజాయ్ చేయండి. మీ సమాధానాలు కార్డుపైనా గానీ, మరే విధంగానైనా గానీ రాసి పంపించవచ్చు. ఎలాంటి కొట్టివేతలు, దిద్దివేతలు లేకుండా జవాబులన్నీ స్పష్టంగా రాయాలి. మా దగ్గరున్న కీ సొల్యూషన్‌తో అన్ని విధాలా సరిపోయే జవాబులను రాసిన వారి పేర్లు ప్రచురిస్తాం.



ఫిలిం క్విజ్ 61

కందుల శ్రీనివాస్

1. ఈ వర్కింగ్ స్టిల్ ఏ చిత్రానికి సంబంధించినది?
2. చిరంజీవి శివుడిగా మారిన కె.విశ్వనాథ్ చిత్రం?
3. సీనియర్ ఎన్‌టిఆర్ కథానాయకుడుగా నటించిన 'అడవిరాముడు' చిత్ర దర్శకుడు?
4. వందకు పైగా హిందీ సినిమాల్లో పాటలు పాడిన కానన్‌దేవికి 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారం లభించిన సంవత్సరం?
5. భారతీయ సినీ సంగీత ఖ్యాతి కేతనాన్ని ఎగురవేసిన సృజనశీలి అల్లారఖా రహ్మాన్ (ఎ.ఆర్.రహ్మాన్) ఒక నాటి పేరు?
6. ఎ.ఆర్. రహ్మాన్ పుట్టిన ప్రదేశం?
7. 'జల్సా', 'జులాయి' సినిమాక కథానాయిక?
8. 1943లో కె.ఎల్. సైగల్ నటించిన 'తాన్‌సేన్' చిత్రానికి సంగీత దర్శకుడు?
9. 1949లో వచ్చిన 'మహల్' చిత్రంలో 'ఆయేగా ఆనేవాలా..' పాటను పాడిన గాయని?
10. ఈ స్టిల్‌లో ఉన్నవారిని గుర్తించండి?



సమాధానాలు- 59

1. నక్షత్రం, 2. శ్రీదేవి
3. రజనీకాంత్-కృష్ణ, 4. సుహాసిని
5. పి.ఎన్ రామచంద్రరావు
6. బి.సరోజాదేవి, 7. భారతీరాజా
8. జంధ్యాల,
9. ఎస్.పి.బాలు, ఎస్.జానకి
10. పూనమ్ భజ్వా

సరైన సమాధానాలు రాసిన వారు

కామినేని కృష్ణప్రసాద్, విశాఖపట్నం
డా. శివభూషణం, కర్నూలు
కె. అరవింద్, మహబూబ్‌గనర్
ఆర్. పరమేశ్వర్‌రావు, అనంతపురం
కె. విజయ్‌కుమార్. కాకినాడ
తేనేటి రమ్యదీప్తి, సత్తెనపల్లి
కె.అనసూయ, హైదరాబాద్
కె.వి.ఎస్.ఎన్ మూర్తి, విశాఖపట్నం
లతీఫొద్దీన్ అహమద్, సుల్తానాబాద్
యమునాశ్రీ, హన్మకొండ
కె.వీణారెడ్డి, కాజీపేట, హన్మకొండ
పి.వి శివప్రసాదరావు, అద్దంకి, ప్రకాశం జిల్లా
బండారు వరలక్ష్మి, విశాఖపట్నం
కె.ఆర్.లీలా, గుంటూరు
ఎం.డి మహబూబ్‌అలీఖాన్, గుంటూరు
పట్నాల ముత్యాలరావు, రాజమహేంద్రవరం
కెవిఎస్‌ఎస్ బ్రహ్మానందరావు, ఏలూరు
జి.వి. మురళీమోహన్, ముచ్చుమిల్లి
ఎన్.సుధాకర్, కడప
బి.లక్ష్మి, కరీంనగర్
కె. సిద్దులు, భూపాలపల్లి
సి.హెచ్. సత్యనారాయణ, జనగాం
ఆర్.కె.విజయకుమార్, జనగాం
బి.అలేఖ్య, వనస్థలిపురం

పూర్తి చేసిన క్విజ్‌ను పంపించాల్సిన మా చిరునామా: ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్- 03



కోనేటిరాయడు కొండదిగి వస్తే..!

తెలుగు చిత్రసీమలో ఈ మధ్య భక్తి చిత్రాలు బాగా తగ్గిపోయాయి. ఈ సినిమాలను చూసేందుకు జనాలు కూడా అంతగా ఆసక్తి చూపిస్తున్నారా? అన్న ప్రశ్న బలంగా వుంది. అందుకు భక్తి సినిమాలు తీయడానికి ఎవరు పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. ఇక తాజాగా శ్రీ వెంకటేశ్వరస్వామిపై 'శ్రీ చిలుకూరు బాలాజీ' అనే మరో భక్తి సినిమా వచ్చింది. ఫిల్మీడియా బ్యానర్‌లో అల్లాణి శ్రీధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ భక్తిరస చిత్రం ఎలా ఉందో చూద్దాం..

కథలోకి.. మాధవ (సాయికుమార్) ఒక నాస్తికుడు. దేవుడు లేడని నమ్మే మనిషి. తిరుమల వెళ్లడానికి ఆర్థిక సహాయం కోసం వచ్చిన ఒక భక్తుడికి దేవుడు లేడని చెబుతాడు. ఆ సమయంలో మాధవ భార్య (భానుశ్రీ మెహ్రా) ఆ భక్తునికి సహాయం చేస్తుంది. కొంతకాలం తరువాత మాధవ నాస్తికుడి నుండి దేవుడు ఉన్నాడని నమ్మి భక్తునిగా మారతాడు. ప్రతి ఏటా తిరుమల వస్తానని దేవునికి మాట ఇస్తాడు. ఒకసారి నడక దారిన తిరుమల వెళ్లిన మాధవకు మొదట ఆర్థిక సహాయం అడిగిన భక్తుడు ఎదురవుతాడు. ఆ తరువాత ఏం జరిగింది? మాధవ దేవుణ్ణి ఎందుకు నమ్ముతాడు? తన స్వగ్రామమైన చిలుకూరులో వెంకటేశ్వరుని ఆల యం ఎందుకు నిర్మిస్తాడు? చిలుకూరి బాలాజీ మహిమలు ఏమిటి? కోనేటిరాయడు కొండదిగి వస్తే ఏం జరిగిందన్నదే మిగతా కథ.

మాధవ పాత్రలో సాయికుమార్ చక్కటి నటన కనబరిచాడు. అతని భార్య పాత్రలో భానుశ్రీ మెహ్రా అందర్నీ ఆకట్టుకుంది. సాంప్రదాయం, భక్తి గల స్ర్తీ పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. అతిథి పాత్రలో కనిపించిన బాలసుబ్రహ్మణ్యం మెప్పించాడు. ఉన్నది చిన్న పాత్రే అయినా సినిమాకు కీలకం కావడంతో ఆయన చేసిన ఎపిసోడ్ బాగా పనిచేసింది. నారదునిగా నటించిన అశోక్‌కుమార్‌కు ఇలాంటి పాత్రలు కొట్టినపిండే. అవలీలగా కానిచ్చేసి భక్తుల మనసుల్ని గెలుచుకున్నాడు. నిజ జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించిన దర్శకుడు అల్లాణి శ్రీధర్ సినిమాను రూపొందించిన విధానం అందిరికీ నచ్చేలా ఆద్యంతం ఎంతో

★★ శ్రీ చిలుకూరి బాలాజీ

తారాగణం:
సాయికుమార్, ఎస్.పి. బాలు, సుమన్, అశోక్‌కుమార్, సమీర్, భానుశ్రీ మెహ్రా
స్ర్కీన్‌ప్లే: అజయ్‌శాంతి,
ఎడిటర్: కె.రవీంద్రబాబు
కెమెరా: శ్రీనివాస్ కూనపరెడ్డి
సంగీతం: అర్జున్
రచన, నిర్మాణం, దర్శకత్వం:
అల్లాణి శ్రీధర్



ఆసక్తికరంగా సాగింది. పాత్రలు, సన్నివేశాలు నిజ జీవితానికి దగ్గరగా ఉండడంతో సినిమా ఆసక్తిగా నడిచింది. సినిమా నిడివి తక్కువగా ఉండడం, కథను అర్థం అయ్యే విధంగా సినిమా తెరకెక్కించడంలో దర్శకుడు సక్సెస్ అయ్యారు. ఇలాంటి చిత్రాలు తీయడంలో ఆయనకు ఆయనే సాటి. గతంలో వచ్చిన ఆయన చిత్రాలు మనకు ఈ విషయాన్నే తెలియజేస్తాయి. నటుడు భానుచందర్ వృద్ధుడి పాత్రలో చక్కటి నటన కనబరిచారు. సాయికుమార్ దేవుడు ఉన్నాడని నమ్మే సన్నివేశం బాగుంది. దేవుణ్ణి పూర్తిగా వ్యతిరేకించే సాయికుమార్ సడెన్‌గా దేవునికి భక్తుడు అవుతాడు. అతనికి దేవుడు ఉన్నాడని ఒక సన్నివేశం ద్వారా కనువిప్పు కలుగుతుంది. కానీ అలా కాకుండా, ఎందుకు అతను దేవుణ్ణి నమ్మాడు? దేవుడు ఉన్నాడనే నిజం తెలుసుకోవడానికి కారణాలు ఏంటి? అనే విషయాలపై ఎక్కువ దృష్టి పెట్టి ఉంటే ఇంకా బావుండేది.

ఇక సాంకేతిక విభాగం గురించి చెప్పాలంటే.. దర్శకుడు అల్లాణి శ్రీధర్ ఎంచుకున్న కథ నిజ జీవితంలో జరిగిన ఒక సంఘటనకు తెరరూపం. తను అనుకున్నది అనుకున్నట్లు ప్రేక్షకులకు చూపించడంలో సఫలమయ్యారు. ఈ చిత్రంలో ముఖ్యంగా స్ర్కీన్‌ప్లే గురించి చెప్పుకోవాలి. అజయ్‌శాంతి అందించిన స్ర్కీన్‌ప్లే ఆద్యంతం ఎంతో సాఫీగా సాగి ఆకట్టుకుంది. చిన్న కథకు చక్కటి స్ర్కీన్‌ప్లేని అందించి మంచి మార్కుల్ని కొట్టేశారు. ఇక దేవుడు ఉన్నాడు, దేవుని గొప్పతనం గురించి చెప్పిన డైలాగ్స్ అదిరిపోయాయి. కూనపరెడ్డి కెమెరా వర్క్ సూపర్. ముఖ్యంగా పై లోకంలో చిత్రీకరించిన సన్నివేశాలు విశేషంగా ఆకట్టుకునేలా ఉన్నాయి. అనవసరమైన సన్నివేశాలు లేకుండా ఎడిటర్ కె.రవీంద్రబాబు జాగ్రత్తపడ్డాడు. అర్జున్ అందించిన సంగీతం బాగుంది. సుద్దాల అశోక్‌తేజ (హే..శ్రీనివాసా..రా..రా!), వీరేంద్ర కాపర్తి (కదిలింది పాదం..), జొన్నవిత్తుల, డా.రాణీ పులోమాజాదేవి రాసిన పాటల్లో సాహిత్యం బాగుంది. తిరుమల వెళ్లలేని చాలా మంది భక్తులకు చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని సందర్శించవచ్చని, తిరుమలలో కొలువైఉన్న వెంకటేశ్వరుడు భక్తుల కోరికలు తీరుస్తూ వారిని మంచి మార్గంలో నడిపిస్తున్నాడనే సందేశం ఈ సినిమా ద్వారా ఇవ్వడం జరిగింది. మంచి భక్తిరస చిత్రం చూడాలనుకొనేవారు ఈ సినిమాను ఏ మాత్రం మిస్ కావొద్దు. అలాగే చిలుకూరు బాలాజీ దేవాలయం విశిష్టత.. దాని చరిత్ర తెలుసుకునే అంశాలు ఉన్నాయి.

-త్రివేది

సినిమాల్లో చరిత్ర వక్రీకరణ

ఎం.ఏ విద్యార్థులకు 'భారతములో వనచర వృత్తాంతము' అనే పాఠం ఉండేది. దూర విద్యా కేంద్రం వారి పేపర్లు దిద్దుతున్నప్పుడు ఒక విద్యార్థి ఇలా వ్రాశాడు. ''నేను సుల్తాన్ బజార్ వెళ్లాను. చాయ్ తాగాను'' ద్రౌపది; ''ఆబిడ్స్ వెళ్లాను- సినిమా చూశాను'' భీముడు; ''నాంపల్లి వెళ్లాను- పల్లీలు తిన్నాను'' ధర్మరాజు- ఇలా రెండు పేజీల సమాధానం ఉంది. ఇందులో సుల్తాన్ బజార్ వెళ్లాను అనే వాక్యం అస్పష్టంగా వ్రాశాడు. ద్రౌపది అనే మాటను పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాశాడు. అంటే అతడు భారతములోని వనచర వృత్తాంతము వ్రాస్తున్నాడని భ్రమింపజేసే ప్రయత్నం చేశాడని అర్థం.

కొన్ని సంవత్సరాల క్రితం లల్లాదేవి అనే రచయిత ఒక చారిత్రక నవల వ్రాశాడు. అందులో దేవీ నాగానీక ఇతివృత్తం ఉంది. ఈమె శాతవాహన రాజ వంశానికి చెందిన రాణి. అయితే లల్లాదేవి ఏదో రాక్షసుల కథ వ్రాసి నాగానీక పేరును వాడుకున్నాడు. ఒకసారి ఆయన కలిసినప్పుడు 'మీరు దేవీ నాగానీక గురించి ఏ చారిత్రక ఆధారాలు సేకరించారు?' అని ప్రశ్నించాను. అతడు నవ్వి, నేను వ్రాసింది ఫాంటసీ అని జవాబు చెప్పాడు. మరి నాగానీక పేరు ఎందుకు వాడుకున్నట్లు? చాలా బాధ కలిగింది. వెంటనే దేవీ నాగానీక చరిత్రను సేకరించి ఒక నవల వ్రాసి ఒక వారపత్రికలో ధారావాహికంగా ప్రచురించాను. ఈమె మహారథత్రణకయిరుని కాలానికి చెందిన రాణి.

మనం చరిత్ర చెప్పదలచుకుంటే ఆధారాలతో సప్రమాణంగా చెప్పాలి. లేకుంటే ఫాంటసీ వ్రాసుకోవచ్చు. దొరికితే దొంగలు అనే సినిమా వచ్చింది. అందులో జీపు ఆకాశంలో ఎగిరిపోతూ ఉంటుంది. అది ఆబ్‌సెండ్‌మైండ్ ప్రొఫెసర్ అనే ఇంగ్లీషు సినిమాకు భావానువాదం. అలాగే ఆదిత్య 369 అనే సినిమా వచ్చింది. సోమాలియా స్పేస్‌షిప్ వచ్చింది. గ్రహంతరవాసులతో మాట్లాడే కథ ఇందులో ఫాంటసీ. వాటిని చారిత్రక సత్యాలు అని అనరు.

ఇటీవల బాహుబలి అనే సినిమా వచ్చింది. ఇది ఒక ఫాంటసీ. బాగా డబ్బులు రావటంతో ద్వితీయ భాగం కూడా తీశారు. వేల కోట్లు సంపాదించింది. పాకిస్తాన్ దురాక్రమణ సందర్భంగా మే 2017లో భారత జవాన్లు మరణించారు. లెఫ్టినెంట్ ఉమర్ హఫీజ్ అనే యువకుణ్ణి పట్టుకొనిపోతూ కాల్చి చంపారు. వారికి జాతి శ్రద్ధాంజలి సమర్పిస్తున్న సమయంలో బాహుబలి సక్సెస్‌మీట్ పెట్టి షాంపైన్ విందులు అందించారు. ఇదీ మన వర్తమాన చిత్రసీమ చరిత్ర. 'నేను సుల్తానుబజారు పోయాను చాయ్ తాగాను- ద్రౌపది' అనే వాక్యం ఉన్నట్లు ఈ ఫాంటసీలో చారిత్రక ఐతిహాసిక వ్యక్తుల పేర్లు అక్కడక్కడా వచ్చేటట్లు నిర్మాతలు శ్రద్ధ తీసుకున్నారు.

కాలకేయులు: వీరు కశ్యప ప్రజాపతికి కాలక వలన పుట్టిన రాక్షసులు. వీరి ప్రసక్తి పురాణాలలోను, భారతములోనూ వస్తుంది. ఈ సినిమాలో కాలకేయులు అనే రాజులు ఉన్నట్లు చూపించారు. ఇలాంటి రాజవంశం లేదు. అంటే చరిత్రను వంచించటమే.

అవంతిక: ఈమె అగ్నిమిత్రుని భార్య- ఈమెకు సినిమాకు ఎట్టి సంబంధమూ లేదు.

భల్లాలరాజు: ఇతడు మధ్యయుగాలలో ద్వారసముద్రాన్ని పాలించిన ప్రభువు. ఈ ప్రాంతం కర్ణాటకలో వుంది. ఇందులో ఈ పేరును వాడుకున్నారు.

బిజ్జలదేవుడు: ఇతడు క్రీ.శ.12వ శతాబ్దానికి చెందిన కాలచూరి వంశస్థుడైన రాజు. జైనమతస్థుడు. ఈయన పశ్చిమ చాళుక్యుల చేతిలో హతుడైనాడు.

శివగామి: ఈమె తమిళనాడు ప్రాంతానికి చెందిన దేవత. తమిళులు 'క' అనే అక్షరాన్ని 'గ'అంటూ పలుకుతారు.

మాహిష్మతి: ఈ నగరం ప్రసక్తి భారతంలోని సభాపర్వంలో రాజసూయయాగం సందర్భంలో వస్తుంది. ప్రాచీన భారత భూగోళం ప్రకారం అవంతి పక్కన మాహిష్మతి ఉంది. అంటే ఇది మధ్య భారతదేశంలో ఉంది.

కట్టప్ప: ఇది రాయలసీమ ప్రాంతానికి చెందిన పేరు. 'అప్ప' అంటే తండ్రి అని అర్థం. కర్ణాటక ప్రాంతంలో కూడా బసవలింగప్ప, రాచప్ప వంటి పేర్లు వుంటాయి.

కాబట్టి సారాంశం ఏమంటే, ఏవేవో పేర్లు చరిత్ర నుండి పురాణాలనుండి తీసుకొని ఒక కట్టుకథను అల్లారు. దానికి చారిత్రక భ్రాంతిని కల్పించారు. కట్టుకథలకు మాహిష్మతి అయితేనేమిటి? ప్రాగ్జ్యోతిషపురం అయితేనేమిటి? కాలకేయులు అనే రాజవంశీయులు చరిత్రలో ఎక్కడా లేరు. ఉన్నట్లు చూపిస్తే దానిని ఫాలసీ అంటారు.

కుక్కలకుంట దేశాన్ని నక్కల ప్రభువు పాలించాడు. అతని భార్య జాంబూకవతి అని కథ వ్రాసుకుంటే ఎవరికీ అభ్యంతరం వుండదు. అంతేగాని మాహిష్మతి, శివగామి, బిజ్జలదేవుడు వంటి చారిత్రక నామాలు ఉపయోగించి జనాలను మోసం చేయటం తగునా?

డబ్బు సంపాదించుకునేందుకు ఎన్నో మార్గాలున్నాయి. డాన్ అనే సాంఘిక హిందీ చిత్రం వచ్చింది. అందులో హీరో ద్విపాత్రాభినయం ఉంది. సర్దార్ పాపారాయుడు వంటి తెలుగు చిత్రాల్లోనూ ద్విపాత్రాభినయం పెట్టి విజయాలు సాధించారు. గంగ మంగ వంటి చిత్రాలల్లో హీరోయిన్ ద్విపాత్రాభినయం ఉంది. ఇవన్నీ సరదాగా చూసి ఆనందించవచ్చు. ఇష్టం లేకపోతే మానేయవచ్చు. కానీ ఫాంటసీలు నిర్మించి వాటిని ఐతిహాసిక చారిత్రక చిత్రాలంటూ భ్రమింపజేయడం తగదు. 'బాహుబలి' చిత్రానికి నంది పురస్కారం (15-11-2017) ప్రకటించారు.

ఇంతకూ నిజమైన బాహుబలి ఎవరు? 1950 దశకంలో నాటి ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ తన ఛాంబర్‌లో 'దో ఆంఖే బారా హాథ్' అనే చిత్రాన్ని చూశాడు. అది శాంతారాం నిర్మించిన బ్లాక్ అండ్ వైట్ చిత్రం. దీనికి జాతీయ స్థాయిలో స్వర్ణకమలం వచ్చింది. ఇదిగో ఈ రెండు కళ్ళు పన్నెండు చేతుల వీరుడే నిజమైన బాహుబలి. ప్రజలకు సంస్కారాన్ని నేర్పేవి చిత్రాలు. సంహారాన్ని నేర్పేవి కావు. విపరీతమైన పబ్లిసిటీతో జనాలను మోసగించి ప్రజల జేబులకు చిల్లిపొడవటం దుర్మార్గం, దోపిడీ!

వింధ్యావాసిని పదవ తరగతి ఫస్టుక్లాసులో పాసయింది. నీకేమి గిఫ్టు కావాలి? అని అడిగాను. నాకు బాహుబలిని చూపించు అని అడిగింది.

'అదేమిటి?' అని అడిగాను ఆశ్చర్యంగా.

'ఔను! కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడో చూడాలి' అన్నది ఈ పాప. నేను నిర్ఘాంతపోయాను. అంటే పబ్లిసిటీ ప్రభావం ఏ స్థాయికి చేరిందో దీన్ని బట్టి అర్థం అవుతున్నది.

స్వచ్ఛభారత్ అనేది ఒక మంచి భావన. దీనినే ఆంధ్రప్రదేశ్‌లో జన్మభూమి పేరుతో కొంతకాలం నిర్వహించారు. అందుకు చాలా పబ్లిసిటీ ఇచ్చారు. మీరిద్దరు మీకిద్దరు అంటూ కుటుంబ నియంత్రణ ప్రచారం రేడియో, టీవీల ద్వారా విపరీతంగా చేశారు. ఇవి సాంఘిక సంస్కరణలు. వాటికి ప్రచారం అవసరమే. అయితే అమెరికాలో ఒక కంపెనీ 'స్వంత పళ్లకన్నా కట్టుడు పళ్లు మంచివి' అని ప్రచారం చేసి ఉన్న పళ్లు ఊడగొట్టి డబ్బు సంపాదించుకొన్నారు. దీనిని మోసం, దుర్మార్గం అంటారు.

తెలుగులో చాలా చారిత్రక చిత్రాలు వచ్చాయి. అందులో కొన్ని కల్పనలు లేకపోలేదు. పోతన శ్రీనాథుడు బావ- బావమరుదులేనా అనేది వివాదాంశం. గౌతమీపుత్ర శాతకర్ణి కాలంలో భారత్‌పైకి వచ్చిన గ్రీకు రాజులెవరు? వాసిష్ఠి కాలంలో వచ్చిన శత్రురాజు రుద్రధాముడు శకవంశస్థుడు (జునాగడ్ శాసనం) తెనాలి రామకృష్ణుడు ఢిల్లీ పాదుషాను కలిసినట్లు చూపటం అసత్యం. శ్రీకృష్ణదేవరాయలు తిమ్మరుసు కళ్లు పీకించాడు అనడానికి చారిత్రకాధారాలు లేవు. అల్లూరి సీతారామరాజు రూథర్‌ఫర్డ్‌ను కలుసుకోలేదు. ఇలా ఆయా చిత్రాల్లో చరిత్ర వక్రీకరించబడినా దానివల్ల ప్రధాన కథాంశానికి భంగం కలగలేదు. హీరోకు అవనతి కలగదు. అంటే చారిత్రక చిత్రాలల్లో కల్పనలు ఉండవచ్చు కానీ కల్పిత కథను చారిత్రకం అని భ్రమింపజేయకూడదు. ఇదిగో బాహుబలి చిత్రంలో జరిగింది ఈ భ్రాంతి. టెన్‌కమాండ్‌మెంట్స్ అనే ఇంగ్లీషు చిత్రాన్ని సిసిల్‌బి డెమెల్లో అనే పాశ్చాత్యుడు తీశాడు. ఇది బైబిలుమీద ఆధారపడిన కథ. తెలుగులో చాణక్య అనే టీవీ సీరియల్ వచ్చింది. ఇందుకు వారు చాలా రీసెర్చి చేశారు. మరి తెలుగు చిత్రాలల్లో అలాంటి పరిశోధన ఎందుకు కన్పడటంలేదు? బాజీరావు మస్తానీ సినిమాలో పీష్వాలు భంగు తాగి డాన్సు చేసినట్లు చూపించారు. చిత్తూరు రాణి పద్మిని అల్లాఉద్దీన్ ఖిల్జీతో డ్యూయెట్లు పాడుతుందా? ఇలలో కాదు కలలో అని ఒక సమర్థన.

విశ్వనాథవారి ఏకవీరలో కుట్టాన్ సేతుపతి వీరభూపతి అంబా సముద్రము, రాబర్ట్ డొనాబిలే వంటి పేర్లు ఉన్నంత మాత్రాన అది చారిత్రక నవల కాజాలదు. జోధా అక్బర్, మొగల్-ఎ-ఆజం వంటి చిత్రాల్లో అక్బరును అవతార పురుషునిగా చిత్రించారు. ఇటీవల టెక్నాలజీ పెరగటంతో నటనకు ప్రాధాన్యం తగ్గి గ్రాఫిక్స్‌తో సమ్మోహితులను చేస్తున్నారు. నటీనటులు పిండిబొమ్మల్లా నిలబడితే చాలు. అయినా అంజలి, సావిత్రి, ఏఎన్నార్, ఎన్టీఆర్‌లను చూసిన కళ్లతో ఈ కొయ్యబొమ్మలను చూడ టం బాధాకరమే. ఐనా నిర్మాతలు బలవంతంగా సమాజం మీదికి ఈ ముఖాలను రుద్దుతున్నారు.

రేపు బాహుబలికి ఆస్కారు అవార్డు ఇవ్వాలనే ప్రచారం మొదలుపెట్టవచ్చు. రాజమౌళికి దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం ఇవ్వాలని అడగవచ్చు. మనకు ఎవరిమీదా శత్రుత్వం ఉండదు. కాని ఆర్థికంగా నష్టపోయి రుద్రమదేవి నిర్మించిన గుణశేఖర్ యోగ్యుడా? ఫాంటసీ నిర్మించిన బాహుబలి టీం గొప్పదా? కాస్త స్థిమితంగా కూర్చొని ఆలోచించండి.

వింధ్యవాసి, భువనేశ్వరి, షోడశి, అఖిల, కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు? అని ప్రశ్నిస్తుంటే వింతగా ఉంటుంది. ఐతే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అమెరికాకు వెళ్లి అక్కడ తెలుగువారితో మీరు ఒక్కొక్కరు బాహుబలి కావాలి అంటుంటే ఔరా..! అని నివ్వెరపోవలసి వస్తుంది.

సరిహద్దులలో వందలాదిమంది జవాన్లు అమరులౌతున్నారు. మంచుకొండలలో కాపలా కాస్తూ మృత్యువును కౌగిలించుకుంటున్నారు. జనాన్ని భ్రాంతికి గురిచేసి సంపాదించిన ఈ డబ్బులో సగమైనా వారి కుటుంబాలకు ఇస్తే పాప పరిహారం జరుగుతుంది. వెలగపూడి రాజధాని నిర్మాణానికి భారీ విరాళం ఇచ్చి తెలుగు భక్తి నిరూపించుకోవాలి. తెలుగులో సినీ విజ్ఞాన విశారదలున్నారు. వారు చక్కగా సినీ సమీక్షలు వ్రాసి పాఠకులను మెప్పించగలరు. అది నా పని కాదు. ఐనా ఈ చిత్రం మీద బాహుబలి-1, బాహుబలి-2 అన్నట్లు రెండు భాగాల విమర్శలు వ్రాయటం ఎందుకు జరిగింది? అంటే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రూ.200 ఖరీదైన చిత్రాన్ని వెయ్యి రూపాయలు పెట్టి బ్లాకులో కొని సకుటుంబంగా సినిమా చూశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఈ చిత్రాన్ని ఉదాహరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమెరికాలో తెలుగువారిని 'ఒక్కొక్కరూ ఒక్కొక్క బాహుబలి కావాలి' అంటూ ప్రబోధించారు. ఈ రకం హిస్టీరియా లోగడ చూశామా? పోనీ ఇదేమైనా అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్ చంద్రబోసు జీవిత చరిత్రయా? జాతికి ఇది ఇచ్చే స్ఫూర్తి ఏమిటి? లోగడ తెలుగులో చిరంజీవి సినిమా ఖైదీ 150- 150 కోట్లు వసూలు చేసింది. హిందీలో అమీర్‌ఖాన్ పికె 750 కోట్లు కలెక్షన్లు పొందింది. ఆ విధంగా చూసినపుడు ఒక తెలుగు సినిమా 1500 కోట్లు సంపాదించిందని సంబరపడిపోతున్నారు. ఇది ఏ విధంగా పురోగమనమో జాతిని ప్రేమించే విశ్లేషకులు చెప్పాలి. ఇపుడు బాహుబలి యూనిట్‌వారు తమపై వచ్చే విమర్శలను లెక్కచేయకుండా ప్రపంచంలోని వివిధ దేశాలలో డబ్ చేసి విడుదల చేసే ప్రయత్నంలో ఉన్నారు. అది పచ్చి వ్యాపారం!

ప్రముఖ చలనచిత్ర విమర్శకుడు కొంపల్లి గౌరీశంకర్ మాట్లాడుతూ- 'కలలలో విహరింపజేసేదే చిత్రం. నిత్య జీవితం చూడాలంటే కిటికీ తలుపు తీస్తే చాలు. రోడ్డుమీద తాగుబోతులు, రేవులు, గుడిసెలు కన్పడుతూనే వుంటాయి' అన్నాడు. ఈ వాక్యాన్ని సామాజిక స్పృహ అంటూ తపనపడేవారు తీవ్రంగా ఆలోచింపవలసి ఉంటుంది.

దేశ పౌరునికి కావలసింది విద్య- వైద్యం- ఉద్యోగం- కూడు- గూడు. అంతేకాని కబాలీలు, బాహుబలులు కాదు! దీనిని పాలకులు గుర్తించటం మంచిది.

లోగడ ఎం.ఎస్.రెడ్డి భాగమతి-ప్రతాపరుద్రుడు అనే రెండు చారిత్రకాలకు స్క్రిప్టు తయారుచేసుకొని నాకు వినిపించాడు. 'భాగమతికి కందుకూరి రుద్రకవికి సంబంధం ఏమిటి'? అని ప్రశ్నించాను. 'నీవు సినిమా స్క్రిప్టు వినేటప్పుడు చరిత్రను మరిచిపోవాలి' అన్నాడు.

ఔను. అందుకే మన చారిత్రక చిత్రాల్లో చరిత్ర ఉండదు. ఉంటే వక్రీభవించి ఉంటుంది.


'బాహుబలి' కట్టుకథకు రచయితకు నూరు కోట్లు పారితోషికం ఇచ్చినట్లు ఫిలింనగర్ వర్గాల భోగట్టా. ఇది నిజమేనా??

దంగల్ 1500 కోట్లు వసూలు చేయాలని టార్గెట్ నిర్ణయించుకుంది. ఇది దేనిని తెలియజేస్తుంది?

మరో అంశం- రజనీకాంత్ రాజకీయాలలోకి రావాలని తమిళనాడులో ఆందోళనలు మొదలైనాయి. అంటే భారతదేశాన్ని సినిమా నటులు పాలించే యుగం మొదలయిందని అర్థం.

సంజయ్ లీలా భన్సాలీ 'పద్మావతి' చారిత్రక చిత్రం వివాదాలల్లో చిక్కుకున్న ఈ సందర్భంలో చారిత్రక ప్రామాణ్యం - చిత్ర నిర్మాణం అనే అంశంపై ప్రత్యేక చర్చ అవసరం అనిపిస్తున్నది.

-ప్రొ. ముదిగొండ శివప్రసాద్



మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)

అనుకోకుండా కుటుంబంలో కలహాలేర్పడే అవకాశముంటుంది. అశుభవార్తలు వినాల్సి వస్తుంది. ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్తపడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతన కార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.

వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)

ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. ధననష్టాన్ని అధిగమించుటకు ఋణప్రయత్నం చేస్తారు. కుటుంబ విషయాల్లో మార్పులు వుంటాయి.

మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)

బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది. చేసే పనులలో ఇబ్బందులుండును. క్రొత్త పనులను ప్రారంభించుట మంచిది కాదు. గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్ని విధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధనవ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధసేవ అవసరం.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

కొన్ని ముఖ్యమైన పనులు వాయిదా వేసుకుంటారు. మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి జాగ్రత్త వహిస్తారు. కొన్ని మంచి అవకాశాలను కోల్పోతారు. ఆర్థిక పరిస్థితిలో మార్పులుండవు.

కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)

ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)

కుటుంబ విషయాలపై అనాసక్తితో వుంటారు. గృహంలో మార్పులు జరిగే అవకాశాలున్నాయి. తలచిన కార్యాలు ఆలస్యంగా నెరవేరతాయి. కొన్ని కార్యాలు విధిగా రేపటికి వాయిదా వేసుకుంటారు. స్ర్తీలతో జాగ్రత్తగా నుండుట మంచిది.

వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)

వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)

మానసిక ఆందోళన తొలగుతుంది. ఆరోగ్యం గూర్చి జాగ్రత్త వహించాలి. ఆకస్మిక భయం దూరమవుతుంది. ప్రయాణాల్లో మెలకువ అవసరం. ప్రయత్న కార్యాల్లో ఇబ్బందులెదురవుతాయి. విదేశయాన ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి.

మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)

తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనంవల్ల ఆరోగ్యం చెడిపోతుంది. చిన్న విషయాల్లో మానసికాందోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది.

కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)

ప్రయత్న కార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)

శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరును. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరును. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి. అన్ని విధాలా సుఖాన్ని పొందుదురు.

★



అంజలి పదేళ్ల ప్రయాణం!

అందాల ముద్దుగుమ్మ అంజలి కెరీర్‌లో ఇప్పటి వరకు పదేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసింది. తెలుగు, తమిళ భాషల్లో అటు సీనియర్, ఇటు జూనియర్‌లు అంటూ తేడాలేమీ పెట్టుకోకుండా, తను చేసే క్యారెక్టర్‌కే ప్రాధాన్యమిస్తూ అందరితో జోడీ కట్టింది. అచ్చ తెలుగు అమ్మాయి అయిన ఈ సుందరాంగి వైవిధ్యమైన పాత్రల ద్వారా ఇటు తెలుగు, అటు తమిళంలోనూ ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం అంజలి నటిస్తున్న తాజా చిత్రం 'బెలూన్'. ఇది హారర్ నేపథ్యంగా సాగే కథ. ఇది వరకే ఇలాంటి హారర్ చిత్రాల్లో నటించిన అనుభవం అంజలికి ఉంది. అందుకే ఈ చిత్రంలో నటిస్తున్నప్పుడు ఈ అమ్మడిలో ఉత్సాహం పరవళ్లు తొక్కుతోంది. గతంలో చేసిన హారర్ చిత్రం 'గీతాంజలి' గుర్తుంది కదా? అందులో అంజలి చేసిన క్యారెక్టర్‌కు మంచి మార్కులే పడ్డాయి. కెరీర్ ఎలా సాగుతోంది అని అంజలిని కదిలిస్తే- ''పరిశ్రమకు వచ్చి అప్పుడే పదేళ్ల ప్రయాణం పూర్తయిందంటే ఆశ్చర్యమేస్తుంది. ఈ పదేళ్ల కాలంలో కెరీర్ ఎలా సాగింది? అని ఆలోచిస్తే నాకే వింతగా అనిపిస్తుంది. మంచి చిత్రాలు.. అంతకంటే మంచి క్యారెక్టర్లు లభించాయి. వాటిని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ముఖ్యంగా ఈ విషయంలో టాలీవుడ్ ప్రోత్సాహం మరచిపోలేనిది. వివిధ చిత్రాల్లో నేను పోషించిన పాత్రలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరించి చిత్రాలను విజయవంతం చేసి నా కెరీర్ ముందుకు సాగేలా చేశారు. ఇవన్నీ నాకు బాగా గుర్తుండిపోయే విషయాలు. నా తాజా చిత్రం 'బెలూన్'తో మళ్లీ కెరీర్‌లో ఊపందుకుంటానన్న నమ్మకం బలంగా ఉంది. మరో పదేళ్లు కెరీర్‌ని ఇలానే కొనసాగించాలనుకుంటున్నా. తప్పకుండా ఆ దిశగా నా ప్రయాణం ఉంటుంది''అని ఎంతో సంబరపడిపోతూ చెప్పుకొచ్చింది అంజలి!

★

కొత్త ఏడాదిలో భారీ చిత్రాల జాతర!





మొత్తానికి మరో ఏడాది గడిచిపోయింది.. గత ఏడాది తెలుగు చిత్రసీమలో ప్రత్యేకంగా గుర్తుపెట్టుకున్న ఏడాదిగా నిలిచిపోయింది. ఎప్పటికన్నా ఈ ఏడాది సక్సెస్ రేట్ పెరగడమే కాదు కొత్త విజయాలు.. కొత్త ఉత్సాహాలు దక్కాయి. ఈ విషయంలో మొదటగా చెప్పుకోవలసింది 'బాహుబలి'. రాజమౌళి తెరకెక్కించిన ఈ చిత్రం మొదటి భాగం సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. దానికి సీక్వెల్‌గా 'బాహుబలి-2' పేరుతో వచ్చిన ఈ సినిమా దాన్ని మించిన విజయాన్ని అందుకోవడమే కాకుండా, ఇండియన్ సినిమా బాక్సాఫీస్‌పై కొత్త విజయాన్ని నమోదు చేసింది. ఇంతవరకు ఏ సినిమా అందుకోని విధంగా ఏకంగా 1600కోట్ల వసూళ్లను కొల్లగొట్టి తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసింది. ఇక మిగతా సినిమాలు కూడా కొత్తదనంతో ఆకట్టుకున్నాయి. భిన్నమైన సినిమాలకు ప్రేక్షకులు పట్టం కట్టారు. తెలుగులో కూడా ఈ ఏడాది 100 కోట్ల క్లబ్‌లను దాటి తెలుగు సినిమా ఏకంగా 150, 200 కోట్ల క్లబ్‌ల వరకు చేరుకున్నాయి. మరికొన్ని సినిమాలు భారీ అంచనాల మధ్య విడుదలై పరాజయాన్ని చవిచూశాయి. ఇక కొంతమంది హీరోలకు ఈ ఏడాది నిరాశే మిగిల్చింది. ఇక బిజినెస్ పరంగా.. మార్కెట్ పరంగాతెలుగు సినిమా స్థాయి పెరిగింది. మరి కొత్త ఏడాదిలో ఎవరు ఎలా బరిలోకి దిగుతున్నారు.. ఏ ఏ సినిమాలు సిద్ధం అవుతున్నాయో ఓ లుక్ వేద్దాం..

కొత్త ఏడాది.. 2018 మాత్రం తెలుగు ప్రేక్షకులకు కొత్త సందడి ఇచ్చే ప్రయత్నంలో ఉంది. ఈ ఏడాదిలో ఎక్కువగా బడా సినిమాల జాతర కనిపిస్తోంది. పవన్‌కళ్యాణ్, మహేష్‌బాబు, బాలకృష్ణ, అల్లు అర్జున్, రామ్‌చరణ్ వంటి స్టార్ హీరోలు వారి అభిమానులను అలరించేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఆయన సినిమాలపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొనడమే కాకుండా బిజినెస్ పరంగా సంచలనం రేపుతున్నాయి. ఈ ఏడాది ముందుగా రంగంలోకి దిగుతున్నాడు పవన్‌స్టార్. 'అజ్ఞాతవాసి'గా అలరించేందుకు రెడీ అయ్యాడు. 'జల్సా', 'అత్తారింటికి దారేది?' వంటి సూపర్‌హిట్స్ ఇచ్చిన క్రేజీ దర్శకుడు త్రివిక్రమ్‌తో పవన్‌కళ్యాణ్ చేస్తున్న మూడో సినిమా కావడంతో భారీ అంచనాలు తారాస్థాయికి చేరాయి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పవన్ నటిస్తున్న ఈ చిత్రంలో అను ఇమ్మాన్యుయేల్, కీర్తి సురేష్‌లు హీరోయిన్లుగా నటిస్తున్నారు. సినిమా సంచలనం క్రియేట్ చేస్తుందని అంటున్నారు. ఇక ఆ తరువాత సీనియర్ హీరో నందమూరి బాలయ్య 'జై సింహ' అంటూ రంగంలోకి దిగుతున్నాడు. సంక్రాంతి హీరోగా ఇప్పటికే మంచి పేరుతెచ్చుకున్న బాలయ్య గత ఏడాది 'గౌతమీపుత్ర శాతకర్ణి'తో సూపర్‌హిట్ అందుకున్నారు. ఇప్పుడు అదే ఉత్సాహంతో ఈ ఏడాదికి 'జై సింహా'గా రాబోతున్నాడు. తమిళ దర్శకుడు కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం జనవరి 12న థియేటర్లలో సందడి చేయనుంది. ఇక సందడ్లో సడేమియా అంటూ తాను కూడా సంక్రాంతి బరిలో దిగేందుకు సిద్ధం అవుతున్నాడు కుర్ర హీరో రాజ్‌తరుణ్. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'రంగులరాట్నం' కూడా విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సినిమా కూడా జనవరి 12న విడుదల కానుంది.

వీరికి పోటీగా తమిళ హీరో సూర్య తన 'గ్యాంగ్'ను వేసుకుని వస్తున్నాడు. ఇప్పటికే కోలీవుడ్‌లో ఆసక్తి రేపిన ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సంక్రాంతి బరిలోనే దిగేందుకు రెడీ అవుతోంది.

ఇక సంక్రాంతి సీజన్ తరువాత మరికొన్ని సినిమాలు విడుదలకు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో స్టార్ హీరోలకు ధీటుగా బాక్సాఫీస్‌పై సత్తా చాటిన అనుష్క 'భాగమతి'తో సిద్ధం అవుతోంది. అశోక్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 26న విడుదల చేస్తారట. దాంతోపాటు మాస్ మహారాజా రవితేజ కూడా రంగంలోకి ఎంట్రీ ఇస్తున్నాడు. ఈమధ్య వరుస పరాజయాలతో టెన్షన్‌లో వున్న ఆయనకు రాజా ది గ్రేట్ ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇపుడు అదే ఊపుతో 'టచ్ చేసి చూడు' అంటూ బాక్సాఫీస్‌పై యుద్ధానికి దిగుతున్నాడు. వీరందరితోపాటు 'మహానటి' కూడా వస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో మహానటిగా ఇమేజ్ తెచ్చుకున్న సావిత్రి జీవిత కథతో తెరకెక్కుతున్న సినిమా ఇది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సావిత్రి నిజ జీవిత కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు. కీర్తి సురేష్ సావిత్రిగా నటిస్తున్న ఈ సినిమా మార్చి 28న మూడు భాషల్లో విడుదల కానుంది.

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ ఈసారి కొత్త ప్రయోగానికి సిద్ధమయ్యాడు. 'ధృవ' వంటి హిట్ తరువాత రామ్‌చరణ్ 'రంగస్థలం' సినిమాలో నటిస్తున్నాడు. సుకుమార్ దర్శకత్వంలో పీరియాడిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ ఇప్పటికే మంచి ఆదరణ పొందింది. సమంత కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా మార్చి 30న విడుదల కానుంది. అందరిలో ఆసక్తి రేకెత్తిస్తున్న సరికొత్త సంచలనంతో ఈ సినిమా విజయవంతం అవుతుందన్న నమ్మకం అందరికీ వుంది. తరువాత మహేష్‌బాబు 'భరత్ అను నేను' అంటూ రాబోతున్నాడు. 'శ్రీమంతుడు' హిట్‌తో ఆకట్టుకున్న కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మహేష్‌బాబు తొలిసారిగా ముఖ్యమంత్రిగా నటిస్తుండడం ఆసక్తి రేకెత్తిస్తోంది. ఏప్రిల్ 27న ఈ చిత్రం విడుదల కానుంది.

అల్లు అర్జున్ కూడా ఇదే నెలలో 27న 'నా పేరు సూర్య' అంటూ ప్రేక్షకులముందుకు రానుంది. 'రేసుగుర్రం', 'టెంపర్' వంటి చిత్రాలకు కథ అందించిన వక్కంతం వంశీ దర్శకుడిగా మారి రూపొందిస్తున్న ఈ చిత్రంలో అల్లు అర్జున్ సైనికుడిగా నటిస్తున్నాడు. లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు రూపొందిస్తున్న ఈ చిత్రం కూడా 27నే వస్తోంది. ఈ సినిమాలతోపాటు ప్రభాస్ 'సాహో' కూడా సిద్ధమవుతోంది. తెలుగు సినిమా చరిత్రలో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించిన 'శివ' సినిమా కాంబినేషన్‌లో దాదాపు 28 ఏళ్ల తరువాత రూపొందుతున్న నాగార్జున సినిమా కూడా లైన్‌లోనే వుంది.

-శ్రీనివాస్ ఆర్.రావ్



'అజ్ఞాతవాసి'లో పవన్ కళ్యాణ్, కీర్తి సురేష్

సంక్రాంతి సంగ్రామం!

(9వ పేజీ తరువాయి...) చేయబోతున్నారు. 'గౌతమీపుత్ర శాతకర్ణి' విజయం సాధించడం ఒక ఎత్తయితే.. తెలుగు చక్రవర్తి అయిన శాతకర్ణి కథని వందో చిత్రంగా చేయడం మరో విశేషం. తెలుగు భాషపైన, తెలుగు నేలపైన ఆయనకున్న మమకారానికి అద్దం పట్టిన చిత్రమది. అలాంటి బాలయ్య మరోసారి తెలుగు వాళ్ల పెద్ద పండుగైన సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చి అలరించేందుకు సిద్ధమయ్యాడు. బాలకృష్ణ, నయనతార హిట్టు జోడీ గా గుర్తింపు తెచ్చుకున్నారు. 'సింహా', 'శ్రీరామ రాజ్యం' చిత్రాల్లో వీరి జోడీ ప్రేక్షకుల్ని ముగ్ధుల్ని చేసింది. అందుకే ముచ్చటగా మూడోసారి కలిసి నటించిన 'జై సింహా'పై అభిమానుల్లో అంచనాలు అంతకంతకు పెరిగిపోయాయి. బాలకృష్ణ శైలి, మాస్ అంశాలు పుష్కలంగా ఉన్న చిత్రమని సినీ వర్గాలు చెబుతున్నాయి. అచ్చొచ్చిన సంక్రాంతి బాలకృష్ణ ఖాతాలో మరో విజయాన్ని చేర్చడం ఖాయమని అభిమాన వర్గాలు ధీమాగా చెబుతున్నాయి. ఈ సినిమాకు శాటిలైట్ రూపంలో తెలుగు, హిందీకి కలిపి దాదాపు రూ.15 కోట్లకు పైగా ఆర్జించింది. మరో 35 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉంది. బాలయ్యకు ఎప్పటిలాగే సంక్రాంతి సెంటిమెంట్ కలిసివస్తే 'జై సింహా' ఖాతాలో రూ. 50 కోట్లు వేసుకోవలసిందే. 2017లో మెరుపు వేగంతో సినిమాలు చేసిన బాలయ్య 2018లో కూడా అదే జోరును ప్రదర్శించబోతున్నారు. ఎమ్మెల్యేగా రాజకీయంగానూ బిజీగానే ఉంటున్నప్పటికీ ఆయన సినిమాలకి మాత్రం ఏలోటూ రానీయడం లేదు. ఇప్పటికే బోయపాటి శ్రీను దర్శకత్వంలో సినిమా చేయడానికి పచ్చజెండా ఊపారు. తేజ దర్శకత్వంలో ఎన్‌టిఆర్ జీవిత చరిత్ర కూడా చేయబోతున్నారు. ఆ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలోనూ ఓ చిత్రం చేయనున్నారని సమాచారం. ఈ లెక్కన 2018లో కూడా బాలయ్య బిజీ బిజీనే. ఈయన దూకుడు మామూలుగా లేదు. సెంచరీ సినిమా తర్వాత అది మరింత ఎక్కువైంది.

ఇక పవన్ కళ్యాణ్ ఇమేజ్‌కు తగిన హీరోయిజం, తన తరహా వినోదంతో దర్శకుడు త్రివిక్రమ్ 'అజ్ఞాతవాసి'ని రూపొందించారు. ఈ చిత్రం 10న విడుదలవుతోంది. హారికా హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్‌కు జోడీగా కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ నటిస్తున్నారు. పవన్‌తో నటించడం వీరిద్దరికీ ఇదే తొలిసారి. చక్కటి వినోదంతో పాటు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. సంక్రాంతి లక్ష్యంగా ఈ చిత్రాన్ని శరవేగంగా పూర్తి చేశారు. పవన్ ఐటి నిపుణుడి పాత్రలో కనిపిస్తారు. అనిరుధ్ సంగీతాన్ని సమకూర్చిన స్వరాలు విశేష ప్రజాదరణ పొందాయి. యూరప్‌లో పాటలను ఎంతో అందంగా కెమెరాలో బంధించారు. పవన్‌ది- త్రివిక్రమ్‌ది సూపర్‌హిట్ కాంబినేషన్. 'జల్సా'తో హంగామా సృష్టించారు. 'అత్తారింటికి దారేది'తో టాలీవుడ్ రికార్డులను బద్దలు కొట్టారు. అందుకే ఈ 'అజ్ఞాతవాసి'పై అంచనాలు పెరిగాయి. అమెరికాలో అత్యధిక సెంటర్లలో విడుదల చేస్తుండడంతో ఈ విషయంలో 'బాహుబలి' రికార్డులను కూడా బద్దలు కొట్టింది. విడుదలకు ముందే దాదాపు పది కోట్లకు పైగా వ్యాపారం జరిగిందని చెబుతున్నారు. ఆశించిన స్థాయిలో సినిమా విజయవంతమయితే 'అజ్ఞాతవాసి' వంద కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం. ప్రవాసంలో ఉన్న ఓ రాకుమారుడిలా పవన్‌కళ్యాణ్ వినోదాలు పంచబోతున్నారు. 'జల్సా', 'అత్తారింటికి దారేది' తర్వాత పవన్- త్రివిక్రమ్ కలయికలో వస్తున్న చిత్రం కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఈ సంక్రాంతికి సరికొత్త రికార్డుల్ని సృష్టించే చిత్రమవుతుందని ట్రేడ్ వర్గాలు నమ్మకంగా చెబుతున్నాయి. 'మధురాపురి సదన..మృదువదనా' అనే కీర్తనతో ప్రేక్షకుల ముందుకొచ్చిన టీజర్‌లో పవన్ లుక్, హావభావాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 'అతని చర్యలు ఊహాతీతం వర్మా' అనే డైలాగ్‌ని బొమన్ ఇరానీతో చెప్పించారు. కుటుంబ బంధాల నేపథ్యంలో సాగే చిత్రమిది. త్రివిక్రమ్ శైలికి వినోదం జోడించారన్న విషయం టీజర్ చూస్తేనే అర్థమయింది. జానపద గీతాలంటే పవన్‌కళ్యాణ్‌కి ఎంతో ఇష్టం. తాను నటించే సినిమాల్లో ఆ ఇష్టాన్ని ప్రత్యేకంగా ప్రదర్శిస్తుంటారు. అవకాశం వచ్చిన ప్రతీసారీ స్వయంగా గొంతు సవరించుకుని పాటలు పాడుతుంటారు. విశేషంగా ప్రాచుర్యం పొందిన 'ఖుషి'లోని 'బై బయ్యే బంగారు రమణమ్మా..', 'అత్తారింటికి దారేది'లోని 'కాటమ రాయుడా..' పాటలు పవన్ ఆలపించినవే. ఇవి ఎంతటి ప్రజాదరణ పొందాయో తెలిసిందే. తాజాగా 'అజ్ఞాతవాసి' కోసం ఆయన మరోపాట పాడారు. భాస్కరభట్ల రవికుమార్ రచించిన 'కొడకా కోటేశ్వరా...'గీతాన్ని పవన్ పాడగా, సంగీత దర్శకుడు అనిరుధ్ నేతృత్వంలో రికార్డ్ చేశారు. ఈ చిత్రంపై భారీ అంచనాలే వున్నాయి. మంచి బిజినెస్ కూడా జరిగిపోయింది.

ఈ రెండు చిత్రాలతో పాటు మరో రెండు చిత్రాలు ఈ బరిలోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అవి రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'రంగులరాట్నం', సూర్య హీరోగా నటించిన అనువాద చిత్రం 'గ్యాంగ్'. 2017లో 'రారండోయ్ వేడుక చూద్దాం..', 'హలో..'వంటి సూపర్ హిట్ చిత్రాలను అందించిన అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'రంగులరాట్నం' చిత్రం ఈ సంక్రాంతికే ప్రేక్షకులను అలరించబోతోంది. ఇందులో రాజ్‌తరుణ్‌కు జోడీగా చిత్రా శుక్లా నటిస్తోంది. శ్రీరంజని దర్శకత్వం వహించారు. 'ఉయ్యాలా జంపాలా' వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని నిర్మించిన అన్నపూర్ణ స్టూడియోస్ మళ్లీ రాజ్ తరుణ్‌తో చేస్తున్న చిత్రమిదే కావడంతో అందరి దృష్టి ఈ చిత్రంపై పడింది. ఈ చిత్రానికి సంబంధించి 10 నుంచి 15 కోట్ల వరకు వ్యాపారం జరగొచ్చని అంచనా వేస్తున్నారు.

సూర్య హీరోగా వస్తున్న అనువాద చిత్రం 'గ్యాంగ్' కూడా ఈ సంగ్రామంలోనే అడుగుపెడుతోంది. ఇందులో కీర్తి సురేష్ కథానాయిక. బాలీవుడ్‌లో విజయం సాధించిన 'స్పెషల్ ఛబ్బీస్'కి రీమేక్ ఇది. టాలీవుడ్‌లో సూర్యకు మంచి మార్కెట్ ఉంది. పైగా యూవీ క్రియేషన్స్ లాంటి అగ్ర సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రారంభ వసూళ్లకు ఢోకాలేదంటున్నారు ట్రేడ్ వర్గాలు.

మొత్తంగా చూస్తే ఈ సంక్రాంతికి అగ్రహీరోల చిత్రాలు థియేటర్లలో ఇలా సందడి చేయబోతున్నాయి. పండుగ నాలుగు రోజులూ థియేటర్లలో కొత్త సినిమాల హడావుడి కోలాహలంగా ఉండబోతోంది. ఈ చిత్రాల ద్వారా ఈ సంక్రాంతికి సుమారు రూ. 200 కోట్ల మార్కెట్ జరగబోతోందని తెలిసింది. ఇవన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సంక్రాంతికి సినీ సంబరాలు అంబరాన్ని తాకినట్లే. సంక్రాంతికి తమ చిత్రాల ద్వారా విజయ ఢంకా మోగించాలని ఎన్నో ఆశలతో, బలమైన నమ్మకంతో ఈ సంగ్రామంలో దూసుకు వస్తున్న ఇద్దరు అగ్ర హీరోల లక్ష్యం ఎలాంటి ఫలితాలనిస్తుందో చూడాల్సిందే.

★

సంక్రాంతి హీరోగా బాలకృష్ణకు పేరుంది. ఆయన నటించిన చిత్రాలు పండక్కి చాలానే విడుదలయ్యాయి. బాలయ్య సినిమా సంక్రాంతికి విడుదలవుతుందంటే విజయం ఖాయమనే ధీమా అటు పరిశ్రమతో పాటు, ఇటు అభిమానుల్లోనూ కనిపిస్తుంటుంది. గత ఏడాది సంక్రాంతికి 'గౌతమీపుత్ర శాతకర్ణి'గా ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. 'జై సింహా'తో మరోసారి సంక్రాంతి సందడి చేయబోతున్నారు. 'సింహా' అనే శబ్దం నందమూరి బాలకృష్ణకు బాగా కలిసొచ్చింది. 'లక్ష్మీ నరసింహా', 'సమర సింహారెడ్డి', 'నరసింహనాయుడు', 'సింహా' ఇలా.. ఆ పేరు టైటిల్‌లో కనిపించినప్పుడల్లా విజయాన్ని అందుకున్నారు. ఈ సారి ఆయన 'జై సింహా'గా మరోమారు సింహా పాత్రలో ప్రేక్షకులను అలరించబోతుండడంతో సహజంగానే ఈ చిత్రంపై అంచనాలు పెరిగాయి. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.



'జై సింహా'లో బాలకృష్ణ నయనతార

ఓ తండ్రి తీర్పు



జయభేరి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై నటుడు, నిర్మాత మాగంటి మురళీమోహన్ నటించి నిర్మించిన 'ఓ తండ్రి తీర్పు' చిత్రం అంటే మాకెంతో ఇష్టం. మురళీమోహన్, జయసుధ జంటగా వచ్చిన ఈ చిత్రానికి మాగంటి రాజాచంద్ర దర్శకత్వం వహించారు. అల్లు రామలింగయ్య, ప్రభాకర్‌రెడ్డి, సాయిచంద్, బాలాజీ, కమలాకర్, ఈశ్వరరావు, కె.విజయ, సంయుక్త, రాజ్యలక్ష్మి, కైకాల సత్యనారాయణ తదితరులు నటించిన ఈ చిత్రం ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది.



కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను పిల్లలు పెద్దవారయ్యాక వారి ఆలనా పాలనా చూడకపోవడం, వృద్ధాప్యంలో వారికి అండగా నిలవాల్సినవారు వారిని ఇంటినుంచి వెళ్లగొట్టడం, చివరికి ఆ తండ్రి తన స్వశక్తితో ఉన్నత స్థాయికి ఎదగడం ఈ చిత్ర కథ ప్రధానాంశం. రామచంద్రయ్యగా మురళీమోహన్ నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. యువకుడిగా, మధ్యవయస్కుడిగా, వృద్ధుడిగా మురళీమోహన్ నటించిన తీరు ప్రశంసనీయం. సీతగా సహజ నటి జయసుధ మంచి నటనను ప్రదర్శించింది. చివరలో కొడుకులు ఇంటికి వచ్చినపుడు, భర్తతో కొడుకుల కోసం ఘర్షణపడే భార్యగా జయసుధ నటన అబ్బురమనిపిస్తుంది. రమేష్, సురేష్‌గా బాలాజీ, కమలాకర్‌ల నటన, వారి భార్యలుగా రాజ్యలక్ష్మి, సంయుక్తలు తమదైన నటనతో అలరించారు. ఖాసింభాయ్‌గా నటుడు ప్రభాకర్‌రెడ్డి నటన కన్నీళ్లు తెప్పిస్తుంది. రాజా బహద్దూర్ చక్రధర్‌రావుగా సత్యనారాయణ విలనీ, హనుమంతుగా సాయిచంద్ ఈ చిత్రానికి ఆయువుపట్టు. తన మార్క్ నటనతో సాయిచంద్ మంచి ఈజ్‌తో నటించాడు. పాన్‌వాలాగా అల్లు రామలింగయ్య తనదైన శైలిలో నటించి మెప్పించాడు. చిత్రం చివరలో వృద్ధులకు బాసటగా, కొడుకుల చేత గెంటివేయబడ్డ అభాగ్యులకు 'మన ఇల్లు' సంస్థను మురళీమోహన్ స్థాపించటం చాలా బావుంది. కుటుంబ కథా చిత్రాల దర్శకునిగా పేరుగాంచిన మాగంటి రాజాచంద్ర ప్రతీ సన్నివేశాన్ని ఎంతో అందంగా చిత్రీకరించి దర్శకుడిగా తన పేరును పదిలపర్చుకునేలా దర్శకత్వం వహించాడు. 1983లో విడుదలైన ఓ తండ్రి తీర్పు ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసలు పొంది ఘనవిజయం సాధించింది. ఆ సంవత్సరపు నంది అవార్డు ఉత్తమ చిత్రంగా ఎంపికై నంది అవార్డును గెలుచుకుంది. కుటుంబ కథా చిత్రంగా ఇప్పటికీ ఈ చిత్రం అంటే మాకెంతో ఇష్టం.

-జి.గౌరీ గాయత్రి, ఉప్పల్

నాకు నచ్చిన పాట



'కన్నులైనా తెరవనీ..'

కృష్ణ, శుభ ప్రధాన తారాగణంగా నిర్మాత డూండి నిర్మించిన సస్పెన్స్ చిత్రం 'గూడుపుఠాణి'లో ఒక పసి బాలుడిని ఉద్దేశించి నేపథ్యంగాసాగే ఈ గీతంలో రచయిత ఆరుద్ర మేడి పండులాంటి ఈ సంఘంలోని మనుషుల స్వరూపాలను బాగా తెలియజేశారు. 'కన్నులైనా తెరవనీ ఓ చిన్ని పాప స్వాగతం' అంటూ ఆహ్వానిస్తూ 'లోకమంతా శాంతి నెరిపిన గులాబి లేదులే' అంటూ పిల్లలకు ప్రియమైన నాయకుడు నెహ్రూగారిని గుర్తుచేసి, 'మానవతకై ప్రాణమిచ్చిన బోసి నవ్వు లేదులే' అని మత ఘర్షణలు నిలువరించడానికి సత్యాగ్రహం చేసి తుపాకీ కాల్పుల్లో మరణించిన జాతిపిత మహాత్మాగాంధీగారిని స్మరించి, 'పూల మాదిరి మెరిసిపోయే ముళ్ళబాటలు మిగిలెనే / నవ్వు చాటున మెరిసిపోయే నాగుపాములు మిగిలెనే / నేటి లోకం అసలు రూపం నీవు చూసేదెన్నడో, నీకు తెలిసెదెన్నడో' అంటూ మాయమాటలతో, తప్పుడు వాగ్దానాలతో ప్రజలను కుల, మత, వర్గ, భేదాలతో విడదీసి అధికారంకోసం అర్రులు చాస్తూ, అక్రమ సంపాదనలకోసం అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించి, ధన సంపాదనే పరమావధిగా ధనం సంపాదించి దేశానికి అవినీతి కేన్సర్‌ను వ్యాప్తిచేసి నైతిక విలువలకు తిలోదకాలిస్తున్న నాయకులను నాగుపాములుగా అభివర్ణించడం హర్షదాయకం. 'జాతి కోసం బలైపోయిన నేత నేడిక లేడులే' అని సుభాష్ చంద్రబోసుగారిని గుర్తుంచడం, 'జగతిలో మన కీర్తి పెంచిన విశ్వకవి లేడాయెనే' అంటూ తన రచనలతో, జాతీయ గీతాలను అందించి ప్రజలలో సమైక్యభావాన్ని పెంపొందించిన రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి కవులు లేరని, 'సొంత లాభం కొరకు దేశం గొంతు నులిమే ధీరులే / మంచి చేసినవారిని ముంచే మనుషులెందరో కలరులే /నేటి లోకం అసలు రూపం నీవు చూసేదెప్పుడో నీకు తెలిసేదెన్నడో' అంటూ ఎందరో త్యాగధనులు పోరాడి సాధించిన ఈ దేశ స్వాతంత్ర్య ఫలాలను విదేశీ ద్రోహులతో చేతులు కలిపి దేశంలో హింసాకాండ, బాంబుల విధ్వంసం, ప్రజల మానాలతో చెలగాటం ఆడే స్వార్థపరుల సంఖ్య పెరిగిపోయిందని ఆవేదన వెలిబుచ్చిన ఈ గీతం ఆలోచనాత్మకం. ఎస్.పి.కోదండపాణి స్వరచనకు బాలుగారి అసాధారణ గాన రీతిలో జాలువారిన ఈ గీతం నేటికీ ప్రేక్షకులను అలరించడమే కాదు ఆలోచింపజేస్తున్నది.

-సుసర్ల సర్వేశ్వర శాస్త్రి, విశాఖపట్టణం

మీకోసం..

తెలుగు చలన చిత్రాలలో ఇప్పటికే ఎన్నో వందల సినిమాలు ప్రేక్షకులు చూసారు. అన్ని చిత్రాల్లో కొన్ని చిత్రాలు మనసును ఆకట్టుకుంటాయి. హృదయాన్ని ఏ పిల్ల సమీర తీరాలకో తీసుకెళతాయి. కొన్ని చిత్రాలు సందేశాత్మకంగా ఉంటే, మరికొన్ని నిత్య నూతనంగా భావించే ప్రేమలాలిత్యంతో అద్భుతంగా ప్రేక్షకుల మనసులలో తొణికిసలాడుతాయి. ఏ సినిమా ఏ ప్రేక్షకుడికి ఎలా నచ్చుతుందో తెలియదు. ఒక్కసారి సినిమా చూశాక ఆ చిత్రం నిరంతరం ప్రేక్షకుణ్ణి వెంటాడింది అంటే అది ఉత్తమ చిత్రమే. అదేవిధంగా ఒక్కసారి మన అద్భుతమైన సంగీత దర్శకులు బాణీలు కట్టిన పాటలు వింటే, మళ్లీమళ్లీ అదే పాట చెవులలో మారుమ్రోగుతుంటే, అది ఉత్తమమైన బాణి. సాహిత్యపరంగా అద్భుతంగా తీర్చిదిద్దిన మాటలు. తమ గానంతో గాయనీ గాయకులు ఆ పాటకు అమరత్వాన్ని చేకూరుస్తారు. అటువంటి గొప్ప పాటలు సినిమాలు మనకు కొదవలేదు. అటువంటి పాటలకు లేక చిత్రాలకు వేదికే ఈ శీర్షిక. **మీకు నచ్చిన పాట** కానీ, **చిత్రం** కానీ ఈ శీర్షికలో మీరు పాఠకులతో మీ భావాలు పంచుకోవచ్చు. అయితే, మీకు ఆ పాట కాని, ఆ చిత్రం కాని ఎందుకు నచ్చింది అనే విషయాన్ని సవివరంగా రాయాల్సి వుంటుంది. మీకు నచ్చిన ఆ పాటను కానీ, చిత్రాన్ని కానీ తోటి పాఠకులతో పంచుకోవడానికి ఇది ఉత్తమమైన వేదిక. ఇక ఆలస్యమెందుకు మీకు నచ్చిన పాట లేక సినిమా గూర్చి సవివరంగా వ్రాసి పంపమని ఆహ్వానిస్తున్నాం.

మా చిరునామా

ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక

36, సరోజినీదేవి రోడ్ , సికిందరాబాద్- 03